thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 71 కరీంనగర్ గురువారం, 22 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00


### అనధికార వైద్య కాలేజీల్లో చేరొద్దు: ఎన్ఎంసీ

న్యూఢిల్లీ : వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు.. ఎలాంటి గుర్తింపు లేని, లేదా నకిలీ గుర్తింపుతో నడుస్తున్న అనధికార కాలేజీల్లో చేరొద్దని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) హెచ్చరించింది. దేశంలో కొన్ని కళాశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఎంబీబీఎసలో చేరగోరు విద్యార్థులు ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మెడికల్ వర్సిటీలను పరిశీలించి ఎంచుకోవాలని సూచించింది. ఇక, విదేశాల్లో ఏ యూనివర్సిటీని ఎంచుకున్నా అక్కడే కనీసం 54 నెలల పాటు కోర్సు చేయాలని, 12 నెలల పాటు అదే దేశంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలని పేర్కొంది. వారికి మాత్రమే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్స్(ఎఫఎంజీఎల్) లభిస్తుందని వివరించింది.

# దద్దరిల్లిన దండకారణ్యం..

## 28 మంది మావోయిస్టుల హతం..

## సుప్రీం కమాండర్ కేశవరావు మృతి..



ఆపరేషన్ కగార్ దూకుడు పెరిగింది. దట్టమైన అడువుల్లో తుపాకులు గర్జిస్తున్నాయి. మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది. భద్రతాబలగాలు వారిని రౌండప్ చేస్తూ హతమారుస్తున్నాయి. తాజాగా.. చత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లా అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బుధవారం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి.. ఈ కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక జవాన్ మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మూడు జిల్లాల భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.. ఉదయం నుంచి జవాన్లకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి, అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు సమాచారం.. అంతేకాకుండా పలువురు కీలక నేతలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు .. వరంగల్ ఆర్ఈసీలో చదివారు. గంగన్న పేరుతో ఏవోబీలో కేశవరావు కీలక పాత్ర పోషించారు. పార్టీ కేంద్ర కమిటీ సెక్రెటరీ ఎన్కౌంటర్‌లో మృతి చెందడం.. మావోయిస్ట్ పార్టీ చరిత్రలోనే అతి భారీ నష్టంగా పేర్కొంటున్నారు. ఈ ఎన్‌కౌంటర్ కు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

**ఎవరీ కేశవరావు?...** గాగన్న అలియాస్ ప్రకాష్, అలియాస్ క్రిష్ణ, అలియాస్ విజయ్, అలియాస్ కేశవ్, అలియాస్ బస్వరాజు, అలియాస్ బీఆర్, అలియాస్ దారపు నరసింహారెడ్డి, అలియాస్ నరసింహ. మావోయుస్టు పార్టీ సారథ్య బాధ్యతలు చేపట్టిన నంబాల కేశవరావుకు ఉన్న వివిధ పేర్లు ఇవి. కేశవరావుది శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం జియ్యన్నపేట.. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటాన్ని ఆయన అతిదగ్గర నుంచి చూశారు. విద్యార్థి దశ నుంచే విప్లవ రాజకీయాలవైపు ఆకర్షితుడై అంచెలంచెలుగా ఎదిగారు. సూరపనేని జనార్దన్ తర్వాతి తరంవాడైన కేశవరావు.. వరంగల్లోని రీజనల్ ఇంజనీరింగ్ (ప్రస్తుతం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కాలేజీలో 1974లో ఇంజనీరింగ్ చదివారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. కేశవరావుది మిలిటరీ వ్యూహరచనలో అందెవేసిన చేయి. అత్యాధునిక పేలుడు పదార్థాల వినియోగంలో, పేలుళ్లకు సంబంధించిన అధునాతన ప్రక్రియల ఆచరణలోనూ కేశవరావు నిపుణుడు. మావోయుస్టు పార్టీ సైనిక విభాగానికి కేశవరావు కీలక వ్యూహకర్త. మావోయుస్టు పార్టీలోని అత్యున్నత సైనిక విభాగం సెంట్రల్ మిలిటరీ కమిషన్ బాధ్యతలను ఆయన నిర్వర్తించారు. అంతేకాకుండా జోనల్ కమిటీ, స్పెషల్ ఏరియా కమిటీ లాంటి పార్టీలోని మిలిటరీ సబ్కమిటీల బాధ్యత కూడా కేశవరావుదేనని పోలీసుల అంచనా. మావోయుస్టు ప్రాబల్య రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్ గఢ్ పై ఆయనకు సంపూర్ణ అవగాహన ఉంది. ఆరు నెలల క్రితం నుంచే కేశవరావు మావోయిస్టు పార్టీ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నప్పటికీ.. తాజాగా అధికారికంగా ఈ నిర్ణయం వెలువడిందని తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేయడంలో, కేడర్ రిక్రూట్మెంట్లో కేశవరావు బాధ్యత కీలకమని తెలుస్తోంది. 1980లో అప్పటి పీపుల్స్ వార్ అనుబంధ విద్యార్థి సంఘం ఆర్ఎస్యూ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ సందర్భంగా ఒకే ఒక్కసారి కేశవరావు శ్రీకాకుళంలో అరెస్టయ్యారు. ఆయన తండ్రి వాసుదేవరావు అధ్యాపకుడిగా పనిచేసేవారు.

ఆయన కళింగ సామాజిక వర్గానికి చెందిన వారు. మావోయుస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పలు దాడుల్లో కేశవరావు కీలక నిందితుడిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అలిపిరిలో బాంబుదాడి ప్రధాన సూత్రధారి.. అలాగే.. తాజాగా ఏపీలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే సోములపై దాడి వ్యూహకర్త కేశవరావేనని అంచనా..




తెలంగాణాలో ఇవాళ భారీ వర్షం కురిసే అవకాశం వుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సాయంత్రం తర్వాత భారీ వర్షాలు కంటిన్యూగా రాత్రంతా వానలు పడతాయంటోంది. రానున్న ఐదు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయంటోంది. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశముందంటోంది. ఇక ఈదురు గాలులు వీస్తాయని, వాటి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లుగా ఉంటుందని తెలిపింది. ఇవాళ తెలంగాణలో రోజంతా మేఘాలు కమ్ముకుని వుండే అవకాశం వుంది. ఉదయం వేళ హైదరాబాద్ సహా.. మధ్య తెలంగాణలో జల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం వుందంటోంది. మరి కొన్ని చోట్ల మోస్తరు వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం 3 తర్వాత హైదరాబాద్ సహా తెలంగాణలోని చాలా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు.




గూఢచర్యం చేస్తూ అరెస్టైన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల మీడియా సంస్థ పేర్కొంది. పాక్ హైకమిషన్‌లో పనిచేసే డానిష్‌తో తాను నిత్యం టచ్‌లో ఉండేదాన్నని పేర్కొంది. 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో తొలిసారి డానిష్ పరిచయం అయ్యాడని ఆమె వెల్లడించింది.

**బ్లాకౌట్ వివరాలు కూడా పాక్‌కు..** ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా జ్యోతి పాక్‌కు సమాచారం చేరవేసినట్లు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా ఆ సమయంలో పాక్ సరిహద్దు రాష్ట్రాలను వైమానిక, క్షిపణి దాడుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం బ్లాకౌట్లు నిర్వహించింది. ఈ సమాచారం కూడా ఆమె డానిష్‌కు చేరవేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దర్యాప్తు బృందం ఆమె నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకొన్నాయి. దీంతోపాటు.. ఆమెకున్న రెండు బ్యాంకు ఖాతాలను కూడా విశ్లేషిస్తున్నాయి. ఇక నేటితో జ్యోతి పోలీస్ కస్టడీ ముగియనుంది. ఆమెను హిస్సార్ కోర్టులో హాజరుపర్చనున్నారు.

**డైరీలో పాక్‌పై ప్రేమ..** తాజాగా జ్యోతి మల్హోత్రా డైరీ, ఫొటోలు వైరల్‌గా మారాయి. దానిలో ఆమె పాక్‌పై వల్లమాలిన అభిమానం చూపించినట్లు అర్థమవుతోంది.

అక్కడి ప్రజల నుంచి విపరీతమైన ప్రేమ లభించినట్లు పేర్కొంది. ఆ దేశం క్రేజీగా, కలర్‌ఫుల్‌గా ఉన్నట్లు అభివర్ణించింది.

**గూఢచర్యంలోకి దించిన 'హ్యాపీనెస్'...** పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిష్ వీసా విభాగంలో పని చేసేవాడు. పంజాబ్‌లోని మలేర్‌కోట్లా ప్రాంతానికి చెందిన గజాల అనే యువతిని కూడా హనీట్రాప్‌లోకి లాగి.. గూఢచర్యానికి వాడుకొన్నట్లు తెలుస్తోంది. ఆమె తన కుటుంబంలోని వారికి వీసాల కోసం ఫిబ్రవరి 2వ తేదీన పాక్ హైకమిషన్‌కు వెళ్లింది. ఆ మర్నాడు వారి వీసాలు ఎప్పుడు వస్తాయో తెలుసుకొనేందుకు గజాలా ఆంటీ నస్రీన్ బానో హైకమిషన్‌కు వెళ్లింది. నాడు గజాలా వీసా మినహా అందరివి ఓకే అయినట్లు వెల్లడించారు. అదేనెల 27వ తేదీన హైకమిషన్‌లో వీసా ఆఫీసర్ అంటూ డానిష్ నుంచి గజాలకు మెసేజ్ వచ్చింది. నాటినుంచి ఇద్దరి పరిచయం పెరిగింది. మరో ఫోన్ నెంబర్ నుంచి టెలిగ్రామ్ యాప్ వాడాలని ఆమెకు సూచించాడు. చివరికి ఏప్రిల్‌లో డానిష్ సాయంతో ఆమె పాక్ వీసా పొందింది. ఆ తర్వాత అతడికి పెళ్లైనట్లు ఆమె గుర్తించింది. మరోవైపు డానిష్ ఆమెను మెల్లగా గూఢచర్యానికి వాడుకోవడం మొదలుపెట్టాడు. సైనిక స్థావరాల సమాచారాలు అడిగేవాడు. ఆ తర్వాత నగదు లావాదేవీలు కూడా నడిపాడు. డానిష్ నెంబర్ గజాలా ఫోన్‌లో 'హ్యాపీనెస్' అనే పేరుతో సేవ్ చేసుకొన్నట్లు గుర్తించారు. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని డానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడు. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను.. అతడు ట్రాప్ చేశాడు.




# కేసీఆర్ కు జైలు తప్పదా?

## కాళేశ్వరం విచారణలో బిగ్ ట్విస్ట్!

హైదరాబాద్ : కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక తుదిదశకు చేరుకుంది. ఇందులో కీలకంగా వ్యవహరించిన కేసీఆర్కు నిన్న కమిషన్ సమన్లు పంపింది. ఆయనతో పాటు హరీష్‌రావు, అప్పటి ఆర్థిక శాఖా మంత్రి ఈటెల రాజేందర్‌కు కుడా నోటీసులు ఇచ్చారు. దీంతో కేసీఆర్కు జైలు తప్పదా? అనే చర్చ ఊపందుకుంది.

**అంతా సీఎం రేవంత్ చెప్పినట్లే..** 'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.. కేసీఆర్ కుటుంబానికి చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించడం ఖాయం'..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో శేరిలింగంపల్లిలో నాటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. రేవంత్ రెడ్డే సీఎం అయ్యారు.

కాళేశ్వరంపై విచారణకు కమిషన్ కూడా ఏర్పాటు చేశారు. మరో రెండు నెలల్లో ఆ కమిటీ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. అయితే.. ఇప్పటి వరకు నాటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావును కమిషన్ విచారించలేదు.

**మరో రెండు నెలలు పొడిగింపు..** అయితే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాల్లో కీలక సూత్రధారి అయిన మాజీ సీఎం కేసీఆర్ను క్రాస్ ఎగ్జామినేషన్ చేసేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిద్ధమైంది. ఇందుకు సంబంధించి నివేదికను మే 22న ప్రభుత్వానికి సమర్పించాలని భావించింది. కానీ అనూహ్యంగా కమిషన్ విచారణను జూలై 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంచలనం రేపుతోంది. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్బొజ్జా ఇందుకు సంబంధించి జీవో జారీ చేశారు. దీంతో సహజ న్యాయసూత్రాల ప్రకారం.. అవినీతి అభియోగాలపై సంజాయిషీ చెప్పుకోవడానికి కేసీఆర్ను విచారణకు పిలవనున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ ఇచ్చిన సమాధానాల ఆధారంగానే నిర్ణయం తీసుకోవాలని కమిషన్ భావిస్తున్నట్లు సమాచారం.

**మే 24 లోపు నివేదిక సమర్పణ..** మరోవైపు ఛత్తీస్ గఢ్ విద్యుత్తు కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లపై విచారణ జరిపిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఇప్పటికే కేసీఆర్కు సమన్లు పంపించింది. దీంతో విచారణ పూర్తికాకుండానే తనను దోషిగా ప్రకటించేలా జస్టిస్ నర్సింహారెడ్డి ప్రకటనలు చేశారని కేసీఆర్ కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో నర్సింహారెడ్డి అభియోగాలపై అభ్యంతరాలు తెలిపిన సుప్రీం కోర్టు.. ఆయనను విచారణ నుంచి తప్పించింది. ఆ తర్వాత విచారణ బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మదన్ భీంరావు లోకూర్.. విద్యుత్తు కొనుగోలు, థర్మల్ నిర్మాణాలపై కేసీఆర్ వివరించిన లేఖనే పరిగణనలోకి తీసుకోవడం విశేషం.

కాగా కాళేశ్వరంపై దాదాపు 400 పేజీల రిపోర్ట్ను సిద్ధం చేసిన కమిషన్.. మే 24 లోపు ప్రభుత్వానికి అందించనునంది. 2024 మార్చిలో కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సుప్రీంకోర్టు రిటైర్డ్‌జడ్జి జస్టిస్ పీసీ ఘోష్‌చైర్మన్‌గా ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. 100 రోజుల్లో విచారణ పూర్తి చేయాలనే తెలిపింది.

100 మందికి పైగా అధికారులు, నిపుణులను విచారించి దీనిపై 400 పేజీలకు పైగా నివేదిక రెడీ చేసింది.



# దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక, సరళీకృత విధానాలతో భారత్‌ను బలమైన దేశంగా రాజీవ్‌గాంధీ నిలబెట్టారన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని చెప్పారు. "పహల్గాం ఘటన నేపథ్యంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకున్నారు. దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఆమె ఆనాడే స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిది. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా భాజపా నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బయటకు రాలేదు. మేం బయటకు వచ్చి మద్దతు తెలిపాం. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి.. ఈరోజు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. సెక్రటేరియట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు విమర్శలు చేశారు. సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు ఆ వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం.. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం.. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు




## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

హైదరాబాద్: భాగ్యనగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం పడుతోంది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. నగరంలోని మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, లక్డీకపూల్, ఫిలింనగర్, బోరబండ, యూసఫ్‌గూడా, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షం పడుతోంది. వర్షం ధాటికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మ్యాన్‌హోళ్లు పొంగిపోర్లుతుండటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

**పలు జిల్లాల్లో భారీ వర్షం...** తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం దంచికొడుతోంది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, నర్సింహులపేటలో భారీ వర్షం కురుస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం మేఘావృతమైంది. భారీ వర్షం కురుస్తోండటంతో ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, కోదాడ, నల్లబండగూడెం, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. సూర్యాపేట జిల్లాలోని నల్లబండగూడెం సమీపంలో ఓ చెట్టు కింద మేకల మందపై పిడుగు పడటంతో 39 మేకలు మృతిచెందాయి. అయితే మరో ఐదు రోజులు భారీ వర్షసూచన ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈరోజు, రేపు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

## కాంగ్రెస్, భాజపా నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు: కేటీఆర్



నల్గొండ: నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి ఇలాంటి పనులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ప్రజాపాలన.. కమీషన్ల పాలనగా మారిందని ఆరోపించారు. "ఎన్ని నోటీసులు ఇచ్చినా అవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి. న్యాయం, ధర్మం గెలుస్తాయి.. నిజాయతీ ఎప్పటికీ ఓడిపోదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి చనిపోతే ఇంకా మృతదేహాలు బయటకు తీయలేదు. నల్గొండలో సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలింది.. ఇప్పటికీ చర్యల్లేవు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది. రూ.4 వేల పింఛన్ల మాట ఏమైంది" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# కాళేశ్వరం విచారణకు హాజరువుతా



హైదరాబాద్, మే 21: కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు వంద శాతం హాజరవుతానని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు.

తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.




దిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ధి పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది.




హయత్‌నగర్: హైదరాబాద్ శివారు హయత్‌నగర్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. కుంట్లూరులో డీసీఎం, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతులను కుంట్లూరుకు చెందిన పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్ రెడ్డి (24), చుంచు వర్షిత్ రెడ్డి (23)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన అలిమేటి పవన్ కల్యాణ్ రెడ్డిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్: తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కా లాంబా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా గాంధీ భవన్‌లోనే ధర్నా చేసినందుకు చర్యలు తీసుకున్నారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.


**అసలేం జరిగిందంటే..** పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల సునీతారావు ఆధ్వర్యంలో మహిళా నేతలు గాంధీభవన్‌లోని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళా కాంగ్రెస్ తీవ్రంగా శ్రమించిందని.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల విషయంలో మహిళా కాంగ్రెస్‌కు అన్యాయం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎన్నిసార్లు కలిసినా ముఖ్యమంత్రిని కలవండి అని చెబుతున్నారని తెలిపారు.

## మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్



కోదాడ: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలనకు హైదరాబాద్ నుంచి ఆయన బయల్దేరారు. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో మేళ్లచెరువులో దిగాల్సిన హెలికాప్టర్.. కోదాడలోనే అత్యవసరంగా ల్యాండ్ అయింది. వాతావరణం అనుకూలించకపోవడంతో కోదాడలో దిగినట్లు మంత్రి సిబ్బంది తెలిపారు. అనంతరం రోడ్డుమార్గంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు బయల్దేరివెళ్లారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానానికి తప్పిన ప్రమాదం




హైదరాబాద్, మే 21: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లుఫ్తాన్సా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం ఫ్రాంక్‌ఫర్డ్ బయలుదేరిన విమానం రన్ వే మీదకు వెళ్లిన వెంటనే ముందు టైరులో సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని పైలట్ వెంటనే గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం వారి సూచన మేరకు విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి మళ్లించారు. ఈ సమయంలో విమానంలో 190 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం టైర్‌ను ఎయిర్ పోర్టులోని సాంకేతిక సిబ్బంది పరిశీలిస్తున్నారు. మరోవైపు కొన్ని గంటల ఆలస్యంగా ఈ విమానం బయలుదేరుతోందని ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు.




పాకిస్థాన్ ప్రభుత్వం తన సైనిక బలగాల ప్రధానాధికారి ఆసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ పదోన్నతిపై భాజపా ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ స్పందించారు. వైఫల్యానికి కూడా రివార్డులుంటాయా అంటూ పాకిస్థాన్‌ను ఎద్దేవా చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'వైఫల్యానికి కూడా రివార్డులుంటాయనే దానికి ఇదే ఉదాహరణ. భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ చావుదెబ్బతింది. 9 ఉగ్రస్థావరాలను నేలకూల్చాం. 13 వైమానిక స్థావరాలు, జాతీయ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో పాటు వందలాది డ్రోన్‌లను ధ్వంసం చేశాం. ఆ దేశానికి చెందిన 70 మందికి పైగా సైనిక సిబ్బంది మరణించారు. మన దెబ్బ తట్టుకోలేక కాల్పుల విరమణకు అభ్యర్థించింది. అయినప్పటికీ.. పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించారు. పదే పదే వైఫల్యాలు ఎదురైనప్పటికీ ఆనందాన్ని ఆస్వాదించే యువరాజు ఒకరు మాత్రమే ఉన్నారు. అది ఎవరో మనందరికీ తెలుసు' అని మాలవీయ పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను మన బలగాలు నేలమట్టం చేశాయి. దీన్ని సహించలేని పాక్ సైన్యం మనపై ఎదురుదాడికి ప్రయత్నించింది. వీటిని మన బలగాలు తిప్పికొట్టి పాక్‌ను చావుదెబ్బ తీశాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మునీర్‌కు పదోన్నతి కల్పిస్తూ పాక్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మునీర్ పాకిస్థాన్ చరిత్రలో ఆ స్థాయి పొందిన రెండో వ్యక్తి అయ్యారు.

ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌తో ఇటీవల జరిగిన సైనిక సంఘర్షణలో కీలక పాత్ర పోషించిన కారణంగా ఆయనకు పదోన్నతి కల్పించినట్టు పాక్ ప్రభుత్వం ప్రకటించింది.

# మే 22...అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం




భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటారు. సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు, ఏదీ తక్కువ కాదు. అన్నీ సమానమే. అన్నీ ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధార పడతాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవ వైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకునే వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంను మే 22 న జరుపు కుంటారు. 2010ని అంతర్జాతీయ జీవ వైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. నాటినుండి ఏటా ఆ దినాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. నేడు భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవ వైవిధ్యం సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల పరిణామం. మన జీవన శైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. వివిధ కారణాల వల్ల ఎన్నో జీవ జాతులు అంతరించి పోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవ వైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో గతంలో ఉండేవి. కాలక్రమంలో చాలా అనేక జీవాలు కనుమరుగు అవుతున్నాయి. నేడు జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించి పోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికి పైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు మృగ్యమై పోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను స్వార్థ ప్రయోజనాల కోసం రూపు మాపడం జరిగింది. అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి మరీ అంతమొందించడం నిత్య కృత్యం అవుతున్నది. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణా రహితంగా వాడేలా చేస్తున్నది. దీంతో నేలను, దానిపై నివసించే విలువైన జీవ సంపదను కోల్పోవాల్సి వస్తున్నది. అత్యధిక కీటక నాశనులను ఉ త్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోతున్నాం. అంతే కాదు ఎన్నో జీవ జాతులు కాల క్రమంలో అంతరించి పోయాయి. భారత దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) అధికంగా ఉన్నచోట జీవ వైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువ మందే ఆదివాసులు నివసిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లో 80 శాతాని కంటే ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యు మార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్ప కాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవ జాతుల్లోనూ ప్రవేశ పెట్టకూడదు. తొందర పడితే ప్రస్తుతం మనుగడ లోని జీవజాతికే ప్రమాదం వాటిల్లు తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సృష్టిలో అన్నిటిలో ఏకత్వం ఎంత ఉందో, భౌతికంగా, మానసికంగా భిన్నత్వం కూడా అంతే ఉంది. వైవిధ్యమే సృష్టి లక్షణం అంటారు స్వామి వివేకానంద. వ్యవసాయ పద్ధతులే కావచ్చు, జీవన విధానమే కావచ్చు, ఆహారపు అలవాట్లే కావచ్చు, అన్ని సృష్టి చక్రానికి లోబడే ఉంటాయి. చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము జీవిస్తుంది, పామును గద్ద తింటుంది, గద్ద మరణించాక దాన్ని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా ఒక గొలుసుకట్టు విధానం, ఒక నిరంతర ఆవృత వృత్తం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా మిగితా అన్నిటి మీద ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం ఉంటుంది, మిగతా ప్రాణుల మీద పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా జగత్తులో అనేక వృత్తాలు ఉ ంటాయి. వాటిలో మనిషి ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనా నికి దారి తీస్తుంది, ఏ ఒక్క జీవి అంతరించినా, మానవ మనుగడ ప్రశ్నార్ధకమవుతుంది. అనారోగ్యాలకు చికిత్స, వైద్యం చేయడానికి జీవవైవిధ్యం చాలా ముఖ్యం. అనేక మొక్కలు, జంతువులు, శిలీంధ్రా లను మందుల తయారీకి వాడడం చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది జాతుల జీవరాశులు అంతరించి పోతున్నాయి. వాతావ ణ సమ తుల్యానికి, పర్యావరణ పరిరక్షణకు జీవరాసులను కాపాడు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇందుకోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భారతీయ పునరుజ్జీవన ఉద్యమ పితామహుడు రామ్మోహన్ రాయ్ - మే 22... రాజా రామ్మోహన్ రాయ్ జయంతి



భారత సంఘ సంస్కరణల చరిత్ర లోనే రామ్మోహన్ రాయ్ పేరు, సతీ సహగమనాన్ని రూపుమాపడంతో ముడిపడి చిరస్థాయిగా నిలిచి పోయారు. రామ్మోహన్ రాయ్, హిందూ పూజారుల అధికారాన్ని ధిక్కరించి, ఆ కాలములో సాధార ణమైన బహు భార్యత్వం నేరమని జనులకు నచ్చ చెప్పారు. రాజా రామ్మోహన్ రాయ్ ఆధునిక భారత పితామహుడు, పయనీర్ ఆఫ్ ఇండియా జర్నలిజం, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవన పితా మహుడు, ఆధునిక భారత నిర్మాత. రామ్మోహన్ రాయ్ (మే 22, 1772 %-% సెప్టెంబరు 27, 1833) భారత దేశంలో మొదటి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన విశేష ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యా రంగాల లోనే కాకుండా హిందూమతం పైన కూడా కనపడుతుంది. ఉపనిషత్తు ల్లోని నిరాకార తత్వాన్ని అంగీకరిం చి, మనవ సమాజంలో ఐక్యతను ఆకాంక్షించారు. అస్పృశ్యత, కులజాడ్యం పై చైతన్యం కలిగిం చారు. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా సతీసహ గమనాన్ని నిషేధిం చారు. వితంతు పునర్వివాహం, మహిళల కు ఆస్తి హక్కుల కోసం అతను పోరాడారు. అందరికీ విద్య ముఖ్యంగా స్త్రీ విద్య వల్ల దేశం పురోగతి మారుతుందని నమ్మారు. బాల్య వివాహ రద్దు చట్టం తెచ్చా రు. వితంతు పునర్వివాహాలు కోసం కృషి చేశారు, స్త్రీ పురుషులకు సమాన హక్కులు కోసం గట్టిగా పోరాడారు. ముఖ్యంగా ఆంగ్ల విద్యకు అనుకూలంగా ఉండి, దేశంలో ఆంగ్ల విద్యావిధానానికి కృషిచేశారు. రాజా రామ్మోహన్ రాయ్ బెంగాల్ లోని రాయ్ రాధా నగర్ లో 1772 మే 2 న జన్మించారు. ఆయన తండ్రి రమాకాంత్ వైష్ణవుడు, కాగా తల్లి తరిణి శాక్త మతానికి చెందింది. రామ్మోహన్ బెంగాలీ, పర్షియన్, అరబిక్, సంస్కృత భాషలను పదిహేనో యేడు వరకు అభ్యసిం చారు. యుక్తవయస్సులో కుటుంబ ఆచారాలతో సంతృప్తి పొందక, యాత్రలు సాగించడం మొదలు పెట్టారు. రామ్మోహన్ రాయ్ 1803 నుంచి 1814 వరకు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీలో, ఇంగ్లీష్ కోర్టులో బ్రాహ్మణ పండితులుగా పనిచేశారు. అదే సమయంలో గ్రీకు, లాటిన్ భాషలను నేర్చుకోవడం ప్రారంభించారు. 1803 నుంచి 1815 వరకు రాయ్ ముషీరాబాద్ లోని అప్పిలేట్ కోర్టు లో రిజిస్టర్ థామస్ వుడ్రాఫ్ కు మున్ని గా పని చేశారు. ఈ పదవికి రాజీనామా చేసిన తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ లో కలెక్టర్ జాన్ డిగిబ్ కోసం పని చేశారు. 1828 లో ఇంగ్లాండుకు వెళ్ళక ముందు ద్వారకా నాథ టాగూర్తో కలసి బ్రహ్మసమాజ్ ను స్థాపించా రు. బ్రహ్మసమాజ్ ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక, మత సంస్కరణ ఉద్యమంగా మారి బెంగాల్ లో సాంఘిక, వివేచనాత్మక సంస్కర ణలకు దారి తీసింది. అలా రామ్మోహన్ రాయ్, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఒక ముఖ్యుడిగా గుర్తించ బడ్డారు. తాము సంకల్పించిన సామాజిక, న్యాయ, మతపరమైన ఉద్యమా లలో రాయ్ మానవత్వాన్నే ప్రధానంగా తీసుకొన్నారు. ప్రజలకు తన ఉద్దేశం సమాజంలో ఉన్న మంచి సంప్రదాయాలను నిర్మూ లించడం కాదని, కేవలం వాటిపై సంవత్సరా ల పాటు నిరాదరణ వలన పేరుకు పోయిన కుళ్ళును తుడిచి వెయ్యడం అని చూపించు టకు కష్టపడ్డారు. ఉపనిషత్తులను, సూత్రాలను చదివారు. విగ్రహారాధ నను ఖండించారు. ఆఖండానందా న్ని పొందుటకు, అధ్యాత్మిక చింతన, భగవంతుని ధ్యానం ఉన్నత మార్గాలని ప్రతిపాదించారు. అచార సంబంధమైన సంస్కృత విద్య కంటే ఇంగ్లీషు విద్య మంచిదని భావించి, సంస్కృత పాఠశాలలకు ప్రభుత్వ నిధులను వ్యతిరేకించాడు. 1822 లో ఇంగ్లీషు పాఠశాలను ప్రారంభించారు. రాయ్ 1831లో మొగల్ సామ్రాజ్య రాయ బారిగా ఇంగ్లాండ్ ను దర్శించాడు. 1833 సెప్టెంబరు 27న మెదడు వాపు వ్యాధితో బ్రిస్టల్ లో మరణిం చారు. రాజా రామ్మోహన్ రాయ్ విదేశాల్లో మరణించిన మొదటి వ్యక్తి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# హనుమ అంటే గుర్తొచ్చేది అర్జానే - వైశాఖ బహుళ దశమి హనుమాన్ జయంతి సందర్భంగా



పౌరాణిక చిత్రాలలో హనుమంతుని వేషం ధరించి, తెలుగు ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటుడు అర్జా జనార్ధన్ రావు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన దేహ దారుఢ్య రూపం, నటన అలా ఆంజనేయుని ప్రతిరూపంగా ఉ ండేవి. హనుమంతుడే ప్రత్యక్షంగా కనిపిస్తున్నా డా అన్నంతగా, ఆయన ఆ పాత్ర పోషణలో లీనమై నటించే వాడు. అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 - నవంబర్ 4, 2007) ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. అర్జా జనార్ధన రావు 1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955) గా ఎన్నిక చేసింది. అయన శబ్ద గ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్టుగా పనిచేశాడు. లవ కుశ (1963)బీ శ్రీకృష్ణావతారం (1967)బీ వీరాంజనేయ (1968)బీ శ్రీ రామాంజ నేయ యుద్ధం (1974)బీ ముత్యాల ముగ్గు (1975)బీశంకరా భరణం (1979)బీ త్యాగయ్య (1981)బీ శ్రీ ఆంజనేయ చరిత్ర (1981)బీ దేవాంతకుడు (1984)బీ తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభావాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్లూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్. మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయ కుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం.

బాపు-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజ నేయ యుద్ధం. గతంలో గబ్బిట వెంకటరావు రాసిన పద్యనాటకం లోని పద్యాలను యథాతథంగా వాడడంతో సంభాషణలు కూడా అతని చేత రాయించారు. ఎన్టీఆర్ రాముడిగా, అర్జా జనార్ధనరావు ఆంజనేయుడుగా, బి.సరోజదేవి సీతగా, ధూళిపాళ్ల యయాతిగా నటించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇందులో ఆంజనే యుడు ఆలపించే రెండు ఆర్ద్రమైన పాటలను వినూత్నంగా ఉంటుం దని రఘురామయ్య చేత పాడించారు. వాటిలో మొదటిది 'రామ నీలమేఘ శ్యామా కోదండరామా' కాగా, రెండవది 'శరణు శరణయా జానకిరామా, కరుణ జూపవా మారుతిపై సాకేత సార్వభౌమా' అనే పాట. ఈ రెండవ పాటకు కె.వి. మహ దేవన్ ఒక హిందీ పాట బాణీని అనుకరించడం వింతగా చెప్పుకున్నారు. అందుకు కారణం...మహదేవన్ ఎప్పుడూ ముందుగా ఇచ్చే బాణీకి పాట స్వరపరచ లేదు. కవి రాసిన ఎటువంటి పాటకైనా అద్భుతంగా బాణీలు కట్టటం మహదేవన్ నైజం. అందుకు భిన్నంగా 'సాకేత సార్వభౌమా' పాటకు మహదేవన్ అనుకరించిన హిందీ పాట దోస్తీ లోనిది. 1964లో రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మాత తారాచంద్ బరజాత్యా సత్యన్‌బోస్ దర్శకత్వంలో నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం 'దోస్తీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'చాహూంగా మై తుఝ్హే సాంఝ్ సవేరే...ఫీర్ భి కభీ ఆబ్ నామ్ కో తేరే ఆవాజ్ మై న దూంగా' మహదేవన్ అనుకరిం చడాన్ని విశేషంగా చెప్పుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు చిత్రసీమలో ప్రథమ నేపథ్య గాయకుడు ఎమ్మెస్

## వైశాఖ బహుళ దశమి హనుమాన్ జయంతి సందర్భంగా




"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉ ండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యంలో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరా కాండ వినిపించడం సర్వ సాధారణమే. అంతేకాక, ఆంజనే య, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించ డం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అనగానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావదాం ధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించి న ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చు కున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువ దించారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్స రంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబా దులో తుది శ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు

## .. మావోయిస్టు ఉద్యమంలో ఒక కీలక అధ్యాయం



నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు భారతీయ విప్లవ రాజకీయ చరిత్రలో ఒక కీలక నేతగా గుర్తింపు పొందిన వ్యక్తి. జీవితాన్ని అజ్ఞాత రాజకీయాలకు అంకితం చేసిన ఆయన, అర్ధ శతాబ్దానికి పైగా మావోయిస్టు ఉద్యమానికి వ్యూహాత్మక నేతగా నిలిచాడు. ఆయన మరణం, మావోయిస్టు ఉద్యమానికి ఒక తలకిందుల మలుపుగా భావించ బడుతోంది. ఆంధ్ర ప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో జన్మించిన కేశవరావు, తన తండ్రి బడిపంతులు కావడంతో చిన్నతనంలోనే చదువుపట్ల ఆసక్తి కలిగి ఉన్నాడు. విద్యార్థి దశ నుంచే విప్లవ భావజాలాన్ని ఆకర్షణగా భావించిన ఆయన, వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్, ఎంసీఈలో ఎంటెక్ పూర్తిచేశాడు. 1984లో విద్యార్థి జీవితంలోనే పీపుల్స్ వార్ గ్రూప్ సిద్ధాంతాలతో మమేకమై ఉద్యమంలోకి అడుగు పెట్టాడు. ప్రారంభ దశలోనే నక్సలైట్ ఉద్యమ స్ఫూర్తి నాయకుడు కొండపల్లి సీతారామయ్య ప్రభావం అతనిపై గాఢంగా పనిచేసింది. పీపుల్స్ వార్ వ్యవస్థాపకుడిగా పేరొందిన కొండపల్లి సిద్ధాంతాలతో కేశవరావు దీర్ఘకాలం సహకారం కలిగి పనిచేశాడు. ఈ సమయంలోనే ఆయన మావోయిస్టు ఉద్యమంలో తానేర్పరచుకున్న స్థానం బలపడింది. ఉద్యమ జీవితం ప్రారంభంలోనే ప్రజాసేవ, భూసంస్కరణ, సమానత్వం వంటి అభ్యుదయ లక్ష్యాల కోసం పోరాడే నేతగా గుర్తింపు పొందిన ఆయన, పీపుల్స్ వార్ గ్రూప్‌లో కీలక పాత్ర పోషించాడు. కాలక్రమేణ ఆ సంస్థలోని సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో చేరి, భద్రతా వ్యూహాల రూపకర్తగా ఎదిగాడు. గెరిల్లా యుద్ధ వ్యూహాలు, మొబైల్ వార్ ఫేర్ పద్ధతులు, అడవుల్లో రహస్యంగా శిక్షణా శిబిరాల ఏర్పాటు వంటి వ్యవస్థలను రూపొందించి ఉద్యమాన్ని మిలిటరీంగా శక్తిమంతం చేశాడు. 1990లో మావోయిస్టు మిలిటరీ కమిషన్‌లో చేరిన కేశవరావు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా ఆర్మ్‌డ్ స్ట్రగుల్ వ్యూహాలకు రూపకర్తగా నిలిచాడు. అడవుల్లో గెరిల్లా యుద్ధ పద్ధతులు, ఐఈడీల వినియోగం, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ నిర్మాణం వంటి అంశాల్లో ప్రత్యేకమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార?ండ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అడవుల్లో మావోయిస్టు శక్తుల పునర్వ్యవస్థీకరణలో కీలక పాత్ర పోషించాడు. 2004లో మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిశన్‌జీ నేతృత్వంలోని మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ)తో పీపుల్స్ వార్ విలీనం అయ్యింది. దీంతో సీపీఐ (మావోయిస్టు) పార్టీ ఏర్పడింది. ఈ విలీనంలో బసవరాజు కీలక పాత్ర పోషించాడు. తదనంతరం కేశవరావు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో కొనసాగుతూ రాజకీయ, సైనిక వ్యూహాల రూపకర్తగా ప్రసిద్ధి పొందాడు. ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి విరమించిన అనంతరం, బసవరాజు ఆ పదవిని చేపట్టి, మావోయిస్టు ఉద్యమానికి అత్యున్నత నేతగా బాధ్యతలు నిర్వహించాడు. భారత ప్రభుత్వం, కేంద్ర హోం శాఖ, ఎన్ఐఏ లకు బసవరాజు చాలా కాలంగా మోస్ట్ వాంటెడ్ నేత. అతని అరెస్ట్‌కు లేదా సమాచారం కోసం కోటి రూపాయలకు పైగా బహుమతి ప్రకటించ బడింది. చత్తీస్‌గఢ్‌లో 2010లో జరిగిన 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల హత్య కేసు, 2018లో విశాఖపట్నం జిల్లా అరకులో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమా హత్య కేసుల వెనుక బసవరాజు కీలక మేధస్సుగా ఆరోపణలు వచ్చాయి. చెలామణి క్షేత్రాల్లో పేలుళ్లకు అవసరమైన ఐఈడీల తయారీ, ఆయుధాల సమీకరణ, విదేశీ సంబంధాల సృష్టి వంటి అంశాల్లోనూ బసవరాజు పాత్ర ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటాయి. చాలా సంవత్సరాలుగా బసవరాజు అజ్ఞాత జీవితం గడుపుతూ, ప్రభుత్వ వ్యవస్థకు సవాలుగా మారాడు. ఎక్కడ ఉన్నాడు? బ్రతికే ఉన్నాడా? అనే ప్రశ్నలు గత పదేళ్లుగా మావోయిస్టు వర్గాలు, ప్రభుత్వ వర్గాలలోనూ విస్తృతంగా చర్చకు వచ్చాయి. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో నారాయణపూర్ అడవుల్లో భద్రతా దళాల నిర్వహించిన భారీ ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో బసవరాజు మరణించినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించింది. ఆయనతోపాటు మరో 27 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిపింది. ఈ ఘటన మావోయిస్టు ఉద్యమానికి వ్యూహాత్మకంగా తీవ్రమైన దెబ్బగా భావించ బడుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతి చెందినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధృవీకరించి ట్వీట్ చేశారు. ఈ ఘటన మావోయిస్టు ఉద్యమానికి తీవ్రమైన లోటుగా భావించ బడుతోంది. బసవరాజు మృతి, మావోయిస్టు పార్టీ భవిష్యత్తుపై ప్రభావం చూపనున్నదన్నది విశ్లేషకుల అభిప్రాయం. నంబాల కేశవరావు జీవితం విప్లవ రాజకీయాల పట్ల నిబద్ధత, ఉద్యమ పట్ల త్యాగబుద్ధి, వ్యూహాత్మక మేధస్సు కలగలిపిన ప్రత్యేక చరిత్ర. ఆయన మృతి మావోయిస్టు ఉ ద్యమంలో శక్తి నష్టం కలిగించినా, ఉద్యమాన్ని ఆవిర్భవింపజేసిన అసమానతలు, ఆదివాసీల దుస్థితి, సామాజిక అన్యాయ వ్యవస్థ వంటి కారణాలు మాత్రం ఇంకా సజీవంగానే ఉన్నాయి. మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించే చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం పై అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, తగు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# చురకలు
## సంపాదకీయం

### 'గోల్డ్'గుట్టల్లో లిక్కర్ గుట్టు..
### ప్రభుత్వానికి ఎప్పుడో చిక్కిన బంగారం లెక్కలు?

ఏపీ లిక్కర్ స్కాంలో రోజుకొక ఆసక్తికర విషయం వెలుగుచూస్తోంది. దాదాపు రూ.3, 200 కోట్ల విలువైన స్కాం జరిగిందని ప్రచారం జరుగుతుండగా, ఈ డబ్బులో ఎక్కువ మొత్తం బంగారం రూపంలో దాచారనే విషయం తాజాగా బయటపడింది. వాస్తవానికి ఈ సమాచారం ప్రభుత్వానికి దర్యాప్తు అధికారులకు ఎప్పుడో తెలిసినా నిందితుల అరెస్టు తర్వాతే ఆ గుట్టు విప్పారని అంటున్నారు. ప్రధానంగా మాజీ సీఎం జగన్ కు అత్యంత సన్నిహితుడిగా చెబుతున్న బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇంట్లో తనిఖీల సందర్భంగానే లిక్కర్ స్కాంపై పూర్తి సమాచారం పోలీసులకు లభ్యమైనట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కీలక పత్రాలను మాయం చేయాలని భావించిన వాసుదేవరెడ్డి అతి జాగ్రత్తే లిక్కర్ స్కాంను బయటపెట్టిందని అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి మద్యంలో కుంభకోణానికి పాల్పడుతున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ ఆరోపించినా, కూటమి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే వాసుదేవరెడ్డి మూలంగా కీలక పత్రాలు లభించినట్లు ప్రచారం జరుగుతోంది. స్కాం వివరాలు ఎవరికీ తెలియకుండా చేయాలని భావించిన వాసుదేవరెడ్డి విజయవాడలో తన కార్యాలయం ఖాళీ చేస్తూ పోలీసులకు దొరికిపోయారని చెబుతున్నారు. ఒకటో రెండో ఫైల్స్ దాచేస్తే స్కాం గుట్టు దాయడం సాధ్యం కాదని భావించిన వాసుదేవరెడ్డి విజయవాడలో తన కార్యాలయం మొత్తాన్ని ఖాళీ చేయాలని భావించడమే ప్రభుత్వానికి కీలక పత్రాలు లభించినట్లు చేసిందని అంటున్నారు. తొలుత వాసుదేవరెడ్డిపై కీలక పత్రాల మాయం కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ పత్రాలను చూసి ఆశ్చర్యపోయినట్లు చెబుతున్నారు. వాసుదేవరెడ్డి నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాల్లో వందల కిలోల బంగారం కొనుగోలు చేసిన బిల్లులు ఉన్నట్లు తాజాగా ప్రచారం జరుగుతోంది. సాధారణంగా బంగారాన్ని గ్రాముల్లో కొనుగోలు చేస్తుంటారు. గరిష్ఠంగా పది, ఇరవై గ్రాములు కొనాలంటేనే ఎన్నో లెక్కలు చెప్పాల్సివుంటుంది. కానీ, వాసుదేవరెడ్డి వద్ద లభ్యమైన పత్రాల్లో బంగారం కిలోల లెక్కన కొనుగోలు చేసినట్లు బిల్లులు ఉన్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడంతో ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించినట్లు చెబుతున్నారు. కాగా, కేంద్ర సర్వీసులకు చెందిన వాసుదేవరెడ్డిని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలు డిప్యుటేషన్ పై రాష్ట్రానికి తెచ్చారు. ఆయనకు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీతోపాటు మరికొన్ని కీలక పోస్టులను ఆయనకు కట్టబెట్టారు. అయితే ఇప్పుడు ఆయన వల్లే జగన్ కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడిందని చర్చ జరుగుతోంది. లిక్కర్ స్కాంలో కీలక నిందితులను అరెస్టు చేసిన సిట్.. అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డిని మాత్రం ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాసుదేవరెడ్డి కూడా అప్రూవర్ గా మారిపోయారా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన ప్రభుత్వానికి సహకరిస్తుండటం వల్లే రాష్ట్రం నుంచి రిలీవ్ చేసి తిరిగి తన మాతృ సంస్థకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారంటున్నారు. మొత్తానికి కిలోల లెక్కన కొనుగోలు చేసిన బంగారమే లిక్కర్ కేసు డొంకను కదిలించిందని ప్రచారం జరుగుతోంది.

# చిరంజీవి హన్మంతుడు - వైశాఖ కృష్ణ దశమి హన్మాన్ జయంతి

**అశ్వథామ బలిర్వ్యాస : హనుమాన్ శ్చ విభీషణ: కృప : పరశు రామశ్చ సప్తేతే చిరజీవిన: మార్కండేయస్తు అష్టమ: ప్రోక్త :**

అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులుగా భావిస్తారు. ఒక కల్పం... నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో "మార్గళి" మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్షమందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు



సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్యమవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు ఆయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ఠుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాథ అందరికీ తెలిసిందే. హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువబడే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు. భగవద్దాసులలో సాటిలేని ఆంజనేయుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది. రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు. అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు, నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు అయిన చిరంజీవి ఆంజనేయుని నమ్ముకొని, భక్తి శ్రద్ధలతో, హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# దళిత జన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ - మే 22... భాగ్యరెడ్డి వర్మ జయంతి

అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితో ద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగాణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 - ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు. మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు,1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు. ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు. 1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు. భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొనసాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి. ప్రధానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు. 1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితులైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు. 1917లో విజయవాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది. 1933 కల్లా ఆది - హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు. భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని



పేరు పెట్టుకున్నాడు. 1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్య రెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది. భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసి ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు. **రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# తెలుగు నేల కీర్తి.... సుందర రామ మూర్తి - మే 22...వేటూరి వర్ధంతి



వేటూరి పుట్టుక తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిద్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. అలుపెరుగని, అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రిక కు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. 1962లో నాటి ప్రధాని నెహ్రూ శ్రీశైలం విచ్చేసిన సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ చేశారు. ఆంధ్ర జనతా పత్రికలో ఎడిటర్‌గా ఎదిగి, భద్రాచలం సమీపంలోని పాల్వంచ వద్ద జరిగిన ఒక బహిరంగ సభలో నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పొరపాటుగా మాట్లాడిన అంశాన్ని బాక్స్ ఐటమ్‌గా ఇచ్చి సంచలనం సృష్టించిన ధైర్యశాలి వేటూరి. ఆయన కలం నుంచి జాలువారి, ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిన 'సిరికాకుళం చిన్నది' గేయ రూపకాన్ని సినీ దర్శకుడు విశ్వనాథ్ విని, తొలిసారిగా ఓ సీత కథ చిత్రంలో వేటూరికి అవకాశం కల్పించారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మెదటి సారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 - మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్య కాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఆయన సొంతం. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. 1974 నుంచి 1800 తెలుగు సినిమాలకు ఆరు వేల పాటలను అందించి, తనదైన ప్రత్యేకతను చాటు కున్నారు. గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. వేటూరి ఉత్తమ సాహిత్యానికి నంది అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఆరుసార్లు అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 23 వ కాన్వొకేషన్‌లో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 2007 లో జంధ్యాల మెమోరియల్ అవార్డును అందుకున్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ కళాక్షేత్రం విజయవాడ జాతీయ పురస్కారాలలో మాతృ దేవోభావ చిత్రంలోని "రాలిపోయే పువ్వా" ఉత్తమ సాహిత్యానికి జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకుంది. 2006 లో, తెలుగుకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదాను భారత ప్రభుత్వం ఇవ్వకపోతే తాను జాతీయ అవార్డును తిరిగి ఇస్తానని ప్రకటించారు. 2008 లో, భారత ప్రభుత్వం తెలుగును శాస్త్రీయ భాషగా ప్రకటించింది. 2006లో ఉప్పొంగెలే గోదావరి చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 2008 లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# అకాల వర్షాలతో అన్నదాతల్లో గుబులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతల్లో గుబులు రేపుతున్నాయి. తరచుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి, మొలకెత్తుతోంది. పలు కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు నెలకొంటున్నాయి. ఐకేపీ అధికారులు పత్తాలేకుండా పోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కరవైంది. కొనుగోలు కేంద్రాల్లో క్రమసంఖ్య ప్రకారం ధాన్యాన్ని తూకం వేయాలని కలెక్టర్ చేసిన సూచనలను సైతం పలుచోట్ల పట్టించుకోవడం లేదు. కొన్ని కేంద్రాల్లో రెండంకెల ఎకరాల భూములున్న మోతుబరి రైతుల పెత్తనం సాగుతోంది. ఐకేపీ నిర్వాహకులు సైతం క్రమ సంఖ్య పాటించకుండా వారికే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట ఆకాశం మేఘావృతమైతే ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్లను కప్పేందుకు కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులో



ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రం ఇది. ఇక్కడ ధాన్యం తూకాలు నత్తనడకన సాగడంతోపాటు రవాణా ఇబ్బందులు నెలకొన్నాయి. దాదాపు నాలుగు రోజులుగా లారీలు రాక తూకం వేసిన ధాన్యం బస్తాలు నిల్వలు పేరుకుపోయాయి. ఈ నెల 17న ఒక లారీ రావడంతో బస్తాలను పంపించారు. మరో మూడు లారీల బస్తాలను మిల్లులకు చేర్చాల్సి ఉంది. ఇదే కేంద్రంలో తూకం వేయాల్సిన ధాన్యం కుప్పలు ఇంకా భారీగా కనిపిస్తున్నాయి.

ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత రైతు బాధ్యత తీరిపోతుంది. తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు రైసుమిల్లుల్లో చేర్చాలని, అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతే అందుకు లారీల గుత్తేదారు బాధ్యుడవుతాడని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో అందుకు భిన్నంగా ఉంది. ధాన్యం బస్తాలు మిల్లులకు చేరే వరకు రైతులదే బాధ్యతలంటూ నిర్వాహకులు చెబుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**32 కేంద్రాలు మూసివేత**

జిల్లాలో ఈ నెల 17 వరకు 242 కొనుగోలు కేంద్రాల ద్వారా 28,529 మంది రైతుల నుంచి రూ.459.18 కోట్ల విలువ చేసే 1,95,767.23 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అందులో 1,89,256.03 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చగా 6,511.20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించాల్సి ఉంది. 19,297 మంది రైతులకు రూ.263.71 కోట్లను జమ చేశారు. కొనుగోళ్లు పూర్తయిన 32 కేంద్రాలను మూసివేశారు.

# లెక్కలు వేశారు.. చికిత్సలు మరిచారు

ముదిగొండ మండలం వల్లభి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో జనవరి-ఏప్రిల్ మధ్య 118 మంది కుక్క కాటుకుగురయ్యారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో వీధికుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఆర్నెల్ల క్రితం జరిగిన ఘటన ఇది. నిత్యం ఏదో ఒక గ్రామంలో ప్రజలు కుక్కకాటు బారినపడుతున్నారు. ముదిగొండ, మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: కొంతకాలంగా పల్లెల్లోని వీధుల్లో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఒక్కసారిగా మీదకొచ్చే శునకాలు.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా రక్తమోడేలా గాయపరుస్తున్నాయి. గుంపులుగా తిష్ఠ వేస్తుండటంతో రాత్రిపూట ఒంటరిగా వెళ్లాలంటేనే బెంబేలెత్తే పరిస్థితి. వీధి కుక్కల సంతతి నివారణకు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు అధికారుల్ని వేడుకుంటున్నారు.

**తూతూమంత్రంగా సర్వే**

గతేడాది ఆగస్టులో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లోని శునకాల్ని కూడా లెక్కించింది. జిల్లాలోని 589 పంచాయతీల్లో 22,350 ఉన్నట్లు తేలింది. గణనను ఒకేరోజుకు పరిమితం చేయడంతో పూర్తిస్థాయిలో ప్రక్రియ జరగలేదు. కుక్కల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

**కానరాని నియంత్రణ**

జిల్లాలో కుక్కల సంతతి నియంత్రణ చర్యలు సక్రమంగా చేపట్టడం లేదు. వీధికుక్కల్ని పట్టి ఏడాదికో సారి యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి. కొన్నేళ్లుగా ఇదెక్కడా కానరావటం లేదు. నిబంధనల ప్రకారం వీధి కుక్కలకు హాని కలిగించొద్దు. కానీ, వాటి సంతతిని శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించాలి. ఇందుకు కు.ని. శస్త్రచికిత్సలే ఏకైక మార్గం. ఇది ఖర్చుతో కూడుకున్న పని. పైగా గ్రామపంచాయతీల్ని నిధుల కొరత వేధిస్తోంది. ఉన్నతాధికారులైనా స్పందించి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**వ్యర్థాలతో బెడద**

గ్రామాల్లో చికెన్ సెంటర్లు, కోళ్లఫారాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. చనిపోయిన కోళ్లు, దుకాణాల్లో వెలువడే మాంసం వ్యర్థాలను రహదారుల వెంట పారబోస్తున్నారు. ఆయాచోట్ల తిష్ఠ వేసే శునకాల మందలు.. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్రవాదారులపై దాడిచేస్తున్నాయి. ఒక్కోసారి వ్యర్థాలు లభించకుంటే చిన్నారులపైకి తెగబడుతున్నాయి. గుంపులుగా దాడిచేసి గొర్రె, మేక పిల్లలు, దూడలను లాక్కెళ్తున్నాయి.

గ్రామ పంచాయతీలు: 589
గత సర్వేలో లెక్కించిన శునకాలు: 22,350
కుక్కకాటు బాధితులు: 9,691

వీధి శునకాల సమస్యపై జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత స్పందిస్తూ.. 'కుక్కలకు కొన్ని గ్రామాల్లో కు.ని. చికిత్సలు చేయించాం. మిగిలిన చోటా ప్రక్రియ చేపడతాం' అని అన్నారు.

'ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్కకాటు టీకాలు నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్కకాటుకు గురైతే వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లి టీకా వేయించుకోవాలి'. డా.కళావతిబాయి, డీఎంహెచ్ఓ

# పదేళ్లుగా నిరుపయోగం.. రూ.కోట్లు వృథా



కరీంనగర్ : అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది కరీంనగర్ నగరపాలక సంస్థ పరిస్థితి. ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి దుకాణ సముదాయం నిర్మించినా నిరుపయోగంగా ఉంది. రూ.5 కోట్లు ఖర్చు చేసి మున్సిపల్ అతిథి గృహం మొదటి అంతస్తులో 26 దుకాణాలు నిర్మించారు. అయితే పదేళ్లుగా అవి ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. ఒకసారి అద్దెకివ్వడానికి ప్రకటన జారీ చేయడంతో ఔత్సాహికులు ఆసక్తి చూపించారు. అయితే అద్దె ఖరారులో సమస్యలు రావడంతో వెనక్కి తగ్గారు. అప్పటినుంచి ఇప్పటివరకు అధికారులు సైతం ఆ వైపు ఆలోచన చేయడంలేదు.

**భారీ అద్దెతో వెనుకడుగు** దుకాణాలకు సంబంధించిన అద్దె భారీగా నిర్ణయించడంతో అవి నిర్మించినప్పటి నుంచి ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం టవర్ సర్కిల్‌లో జరిగే స్మార్ట్‌సిటీ పనులకు సంబంధించిన ఏజెన్సీ ప్రతినిధులు, కార్మికులు దీన్ని వినియోగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో దుకాణాలు ఖాళీగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ సొమ్ము వృథా చేస్తున్నారని, ఆదాయం వచ్చే అవకాశమున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో భవనాన్ని కూల్చి ఈ స్థలాన్ని లీజుకు ఇవ్వాలని భావించినా.. ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వలేదు. ఇటీవల కలెక్టర్, కమిషనర్ పరిశీలించారు.

**అధ్వానం.. చెత్తా చెదారం**

మున్సిపల్ అతిథి భవన సముదాయంలోని మొదటి అంతస్తులో దుకాణాలుండగా.. కింద పార్కింగ్ కోసం స్థలం వదిలిపెట్టారు. టవర్‌సర్కిల్, మార్కెట్ ప్రాంతానికి వచ్చే వాహనాలను ఇందులో పార్కింగ్ చేస్తున్నారు. అయితే ఇందులో చుట్టుపక్కల వ్యాపారులు, ప్రజలు మూత్రవిసర్జన చేస్తుండటం, చెత్తా చెదారం పడేస్తుండటంతో దుర్గంధంగా మారింది.

ప్రధాన రహదారి గుండా డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు ప్రవహిస్తోంది. పై అంతస్తు దుమ్ము, ధూళితో నిండి ఉంది.

**ఆధునికీకరణకు అంచనాలు**

మున్సిపల్ అతిథి గృహం ఆధునికీకరణకు అంచనాలు తయారు చేసేందుకు ఆదేశాలిచ్చాం. ఎంతమేర ఖర్చు వస్తుందో తెలుస్తుంది. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటాం. సుడా వైపు నుంచి కూడా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. అంచనా వ్యయం పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్, నగరపాలిక

**అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం**

అభివృద్ధి చేసేందుకు భవనాన్ని అప్పగిస్తే నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయాన్ని కలెక్టర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. నరేందర్‌రెడ్డి, ఛైర్మన్, సుడా కరీంనగర్

# నిర్లక్ష్యపు నిప్పు.. కావాలి కనువిప్పు



కరీంనగర్ : హైదరాబాద్ చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. కరీంనగర్ రాంనగర్ చౌరస్తాలోని ఓ కిరాణ దుకాణంలో మార్చి 5న అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లింది. విద్యుదాఘాతం ఘటనకు కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఈ ఘటనలు చూసైనా జిల్లావాసులు మేల్కొవాల్సి ఉంది. నగరంలో అనేక వాణిజ్య సముదాయాలు ఇరుకుగా ఉన్నాయి. వాటి పక్కనే ఉన్న స్తంభాలకు ఇరవైకి పైగా కనెక్షన్లు ఇస్తున్నారు. చిన్నపాటి నిప్పురవ్వ వచ్చినా తీగలకు మంటలు అంటుకొని అన్ని దుకాణాలకు వ్యాపించే అవకాశముంది. నగరంలో కొన్ని వాణిజ్య సముదాయాల వద్ద అగ్నిమాపక పరికరాలు కనిపించడంలేదు. కరీంనగర్‌లో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

**కారణాలు ఇలా..**

వ్యాపార సముదాయాల్లో విద్యుత్తు వినియోగం ఎక్కువగానే ఉంటుంది. సామర్థ్యానికి మించి అధిక లోడ్‌ను వినియోగించడంతో అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయి. జిల్లాలో జరిగిన ప్రమాదాలు ఎక్కువ శాతం షార్ట్‌సర్క్యూట్‌తోనే జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. వ్యాపార కేంద్రం దుకాణం మూసే ముందు కరెంటు సరఫరా బంద్ చేయకపోవడం, నాణ్యత లేని తీగలు, కాలం చెల్లిన విద్యుత్తు పరికరాలు వినియోగించడం కారణాలు. సరైన వెలుతురు, గాలి లేకపోవడం మరో కారణమని అధికారులు చెప్పారు.

అగ్నిమాపక వాహనం వెళ్లలేకుండా..

పెద్ద వాహనాలు వెళ్లలేని చోట సైతం బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారు కొందరు వ్యాపారులు. ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ వాహనం వెళ్లడం గగనమవుతుంది. టవర్ సర్కిల్, అన్నపూర్ణ కాంప్లెక్స్ ప్రాంతాల్లోని భవనాలకు ఆనుకొని దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన స్తంభాలు నేటికీ అలాగే కొనసాగుతున్నాయి. ఒక్కో స్తంభానికి 25పైగా కనెక్షన్ తీగలు అనుసంధానం చేసి ఉన్నాయి. వీటితో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.

కరీంనగర్‌లో పెద్ద ప్రమాదం జరిగితే మానకొండూర్, చొప్పదండి అగ్నిమాపక వాహనాలు రావలసి ఉంటుంది. నగరంలో 4500 లీటర్ల సామర్థ్యం కలిగిన పెద్ద వాహనం అందుబాటులో ఉంది. చిన్న ప్రమాదమైతే మిస్ట్-జీప్ వాహనాన్ని ఉపయోగిస్తున్నారు. దీని సామర్థ్యం 2500 లీటర్లు. ఇందులో నీటితో పాటు గ్యాస్ ఉంటుంది.

రక్షణ చర్యలు పాటించాలి జిల్లాలో అందరూ అగ్ని ప్రమాద నివారణ చర్యలు పాటించాలి. నాణ్యమైన విద్యుత్తు పరికరాలను వినియోగించాలి. బహుళ అంతస్తుల్లో రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. వాణిజ్య, వ్యాపార సముదాయాలు మూసివేసే సమయంలో కరెంటు సరఫరాను పూర్తిగా నిలిపివేయాలి. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

# భవితకు మార్గదర్శి.. ఎన్‌సీసీ



హుజూరాబాద్ : ఎన్‌సీసీ క్యాడెట్లు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారు. సాయుధ దళాల్లో చేరేలా ఆర్మీ, ఎన్‌సీసీ అధికారులు వారిని తీర్చిదిద్దుతున్నారు. తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ సౌజన్యంతో 9వ తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ మండలం సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ జాతీయస్థాయి ముందస్తు నాయకత్వ శిబిరాన్ని నిర్వహించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన సుమారు 350 క్యాడెట్లు హాజరుకాగా.. నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కర్నల్ సునీల్ అబ్రహం, కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కర్నల్ జయంతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 25 వరకు శిబిరం కొనసాగనుంది.

**ప్రత్యేక తరగతులు..**

శిబిరంలో మొత్తం 7 బృందాలుగా విభజించారు. అత్యవసర పరిస్థితులు వస్తే ఎలా ఎదుర్కోవాలనే విషయాలను చక్కగా వివరిస్తున్నారు. ఆయుధ వాడకంపై సాధన చేయిస్తున్నారు. శత్రువును ఎలా కనుక్కోవాలి, ఎలా గమ్యాన్ని చేరుకోవాలనే వివరాలను మ్యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో క్యాడెట్లతో ఫైరింగ్ చేయిస్తున్నారు. ఉదయం సుమారు గంటన్నర పాటు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నిత్యం శ్రమదానం చేస్తూ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

**ప్రతి పనికీ ఫలితం: సునీత, సిరిసిల్ల**

ఎన్‌సీసీ శిక్షణలో చాలా విషయాలు నేర్చుకున్నా. క్రమశిక్షణతో చేసిన ప్రతి పనికి తప్పకుండా ఫలితం దక్కుతుంది. నేను ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నా. మాలో ఉన్న ప్రతిభను అధికారులు గుర్తించి వెలికి తీస్తున్నారు. ఎన్‌సీసీలో చేరకముందు ఎవరితో మాట్లాడకపోయేదాన్నికాదు. ఇప్పుడు అందరితో మాట్లాడటమే కాదు.. నా జూనియర్స్‌కు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నా.

**ఆత్మస్థైర్యం పెరుగుతుంది: నివేదిక, వరంగల్**

ఎన్‌సీసీతో ఆత్మస్థైర్యం కలుగుతుంది. ఈ సంవత్సరం రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొన్నా. మనలో ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ శిబిరం చాలా ఉపయోగపడుతుంది. ఎక్కడైనా వేదిక మీద మాట్లాడాలంటే భయం ఉండేది. ఇప్పుడు నిర్భయంగా మాట్లాడగలుగుతున్నా.

**ఆయుధ శిక్షణ ఇస్తున్నారు: తన్మయి, సింగాపూర్**

కమ్యూనికేషన్ స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్, టీం వర్క్, క్రిటికల్ థింకింగ్ వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఆయుధాల గురించి చెప్పడమేకాదు, శిక్షణ ఇస్తున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది.

**బృందాలుగా విభజించి..** లెఫ్టినెంట్ కల్నల్ జయంత, కమాండింగ్ అధికారి, కరీంనగర్

శిబిరం ప్రారంభం నుంచి ఏ రోజు ఏ కార్యక్రమాలను నిర్వహించాలనే ప్రణాళికను సిద్ధం చేసుకొన్నాం. వివిధ రాష్ట్రాల నుంచి క్యాడెట్లు శిబిరానికి వచ్చారు. వారిని బృందాలుగా విభజించాం. సాయుధ దళాల్లో చేరేందుకు ఈ శిబిరం చాలా ఉపయోగపడుతుంది. ఆర్మీ, ఎన్‌సీసీ అధికారులతో తరగతులను నిర్వహిస్తున్నాం.

# నిరంతర వెలుగులకు నూతన కేంద్రాలు

ఖమ్మం : "భవిష్యత్తులో 20 వేల గ్రీన్ పవర్ ఉత్పత్తే లక్ష్యం. ఎంత డిమాండ్ ఉన్నా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తాం. ఇందుకుగాను ప్రతి నియోజక వర్గంలో అవసరాన్ని బట్టి 3 నుంచి 6 సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే ప్రారంభిస్తున్నాం."

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపనలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఉమ్మడి జిల్లాలో మున్ముందు గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ అవసరాలు అంతకంతకూ పెరగనున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టు నాణ్యమైన సరఫరా జరగాలంటే నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం తప్పనిసరి. సంబంధిత ప్రతిపాదనలు ఎన్పీడీసీఎల్ సంస్థ నుంచి ప్రభుత్వానికి అందాయి. ఏఏ నియోజకవర్గాల్లో ఎన్ని కేంద్రాలు నిర్మించాలనే అంచనాలను అధికారులు ఇప్పటికే రూపొందించారు. ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరవుతున్నాయి. ఆ వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో నూతనంగా 24 ఉపకేంద్రాలు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతిపాదనలకు ఆమోదం లభించి నిధులు మంజూరవగా.. మొత్తం నాలుగు విడతల్లో వీటిని నిర్మించనున్నారు. ఆ వివరాలు.. 1. తొలిదశలో ఖమ్మం గ్రామీణ డివిజన్ తరుణీ హాట్(ఏదులాపురం), వెంకటగిరి, అనంతనగర్, ఖమ్మం టౌన్ డివిజన్



కబేళా ఏరియా, వైరా డివిజన్ మాటూరు, సత్తుపల్లి డివిజన్‌లోని అన్నారుగూడెం, లింగాలలో ఉప కేంద్రాలు నిర్మిస్తారు. రూ.9 కోట్లు మంజూరయ్యాయి.

2.రెండో విడతగా రూ.1.14 కోట్లతో ఖమ్మం డివిజన్‌లోని కామంచికల్లులో సబ్ స్టేషన్ నిర్మాణం జరగనుంది.

3.రూ.9 కోట్ల వ్యయంతో వైరా డివిజన్ శాంతినగర్(వైరా), గొల్లపూడి, ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం, చిరునోములలో కేంద్రాల్ని నిర్మించనున్నారు.

4.చివరగా నాలుగో విడతలో సత్తుపల్లి డివిజన్‌లో మూడు, ఖమ్మం టౌన్ డివిజన్‌లో నాలుగింటి నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నారు. తొలి, రెండు విడతల ఉపకేంద్రాల నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తవగా.. మూడో విడతకు సంబంధించి ప్రక్రియ కొనసాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడింటికి భట్టి శంకుస్థాపనలు చేయగా, ఖమ్మం జిల్లాలో 24 చోట్ల నిర్మించేందుకు టెండర్లు జరుగుతున్నాయి.

**కొత్తగూడెం నియోజకవర్గంలో..**

పాల్వంచ పట్టణ అవసరాలకు కలెక్టరేట్ ప్రాంగణంలో రూ.1.82 కోట్లతో సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. కలెక్టరేట్‌తో పాటు పాల్వంచ మున్సిపాలిటీ వాటర్ వర్క్స్, మంచికంటినగర్, గాంధీనగర్ వద్ద 11 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేయనున్నారు. మరోదాన్ని ఇదే పట్టణంలోని శ్రీనివాసకాలనీలో రూ.2.19 కోట్లతో నిర్మించనున్నారు. పాల్వంచ మండలంలోని జగన్నాథపురం, యానంబైలు సబ్ స్టేషన్లపై లోడు తగ్గించే లక్ష్యంతో.. పాండురంగాపురంలో రూ.3.43 కోట్లతో మరో సబ్ స్టేషన్ నిర్మించనున్నారు.

'ప్రభుత్వ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాల్ని వేగంగా చేపడుతున్నాం. జిల్లా కేంద్రం కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణాలను నాలుగు నెలల్లో పూర్తిచేస్తాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. పాత, కొత్త కేంద్రాల అనుసంధానం మరో కీలకాంశం. తద్వారా నిరంతర విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం కానుంది. 'జి.మహేందర్, ఎస్ఈ, భద్రాద్రి కొత్తగూడెం

# గోదావరి పుష్కరాలకు ముందస్తు సన్నద్ధత

భద్రాచలం : గోదావరి పుష్కరాలు 2027 జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్నాయి. పవిత్ర నదీ తీరంలో జరిగే సంబరాలకు ఏర్పాట్లు అట్టహాసంగా చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఉన్నత స్థాయి అధికారులు ఇప్పటికే రెండుసార్లు ప్రాథమిక సమీక్షలు జరిపారు.

**భక్తులకు సత్రాల నిర్మాణం**గోదావరి పుష్కరాలపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నదీ తీరాల్లోని స్నాన ఘాట్‌ల వివరాలు సేకరించారు. గత పుష్కరాలు 2015లో జరిగాయి. అప్పట్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎదురైన అనుభవాలను పరిశీలించారు. వాటిని పరిగణనలోకి తీసుకుని, వచ్చే మహోత్సవాలకు ఎక్కడెక్కడ, ఎలాంటి పనులు చేపట్టాలో సమాలోచన లు చేశారు. ఏర్పాట్లపై ఇప్పట్నుంచే దృష్టిపెట్టాలని, రెండేళ్లలో శాశ్వత నిర్మాణాల్ని పూర్తిచేయాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ సూచనలతో భక్తుల వసతికి సత్రాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోం ది. ప్రతిపాదనల్నీ సిద్ధం చేస్తున్నారు. కావాల్సిన స్థలాల్ని అధికారులు ఎంపిక చేస్తున్నారు.

**అదనపు ఘాట్‌లు**2003లో జరిగిన పుష్కరాల్లో భద్రాచలంలో రెండు ఘాట్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2015లో మరో రెండు అదనంగా నిర్మించారు. గత పుష్కరాల్లో 50 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరిం చారు. కొద్దినెలల క్రితం జరిగిన మహా కుంభమేళాకు భక్తజనం పోటెత్తా రు. ఈనేపథ్యంలో రెండేళ్ల తర్వాత జరగనున్న గోదావరి పుష్కరాలకు సుమారు కోటి మంది తరలివస్తారనేది అధికారుల అంచనా. ఆ సమయంలో సాధారణంగానే నదికి వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. అప్పటికల్లా ఏపీలోని పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్ తోడవుతుంది. వర్షాకాలం, ఆపై రద్దీ కారణంగా ఎక్కడా ప్రమాదాలకు తావులేకుండా కొత్త ఘాట్‌లు నిర్మించాలని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**నిధులకు భరోసా** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో ఈ నెల 15న సరస్వతి నది పుష్కరాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. వేడుకలకు రూ.35 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కాళేశ్వరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు రూ.200 కోట్లను సీఎం ప్రకటించారు. వచ్చే రెండేళ్లలో గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పుష్కర ఏర్పాట్లపై సన్నద్ధత ప్రారంభించింది. పుష్కరాలకు ప్రభుత్వం భారీగానే నిధులు విదిల్చుతుందని రామాలయం అధికారులు భావిస్తున్నారు. నదీ తీరం నుంచి రామాలయం వరకు ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు.

# వారు తవ్వేస్తున్నారు.. వీరు వదిలేస్తున్నారు

శంకరపట్నం: గ్రామాల్లోని చెరువులు, కుంటలు, గుట్టలు, ప్రభుత్వభూముల్లో అక్రమ తవ్వకాలు జరిపి మట్టి రవాణా చేస్తున్నా.. నియంత్రించే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ దందాను అడ్డుకునే వారు కరవయ్యారు. మానకొండూర్ పరిధి శంకరపట్నం మండలంలోని కాచాపూర్, కల్వల, గద్దపాక, అర్కండ్ల, కేశవపట్నం, తాడికల్ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో పొక్లెయిన్ యంత్రాలతో తవ్వకాలు చేస్తూ మట్టి రవాణా సాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ దందా సాగుతున్నా.. అధికారులు చూసి చూడనట్టు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు వస్తే చాలు తెల్లవారుజామునే పొక్లెయిన్ యంత్రాలు, ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి.



**గుట్టలను సైతం వదలట్లేదు**

ఈనెల 17న గద్దపాక, కల్వల గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరికలు చేశారు. అయినప్పటికి ఆదివారం కాచాపూర్ చెరువులో కొందరు ట్రాక్టర్లలో రవాణా సాగించారు. రైతుల వ్యవసాయ పొలాల్లోకి, గ్రామాల్లోని ఇళ్ల నిర్మాణాల పేరిట డబ్బులు దండుకొంటున్నారు. స్థానిక గ్రామాలతో పాటు కల్వల, కాచాపూర్ గ్రామాల్లోని చెరువుల నుంచి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని గుట్టల ప్రాంతంలో సైతం మట్టి తవ్వకాల తరలింపుతో నగదు దండుకొంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామస్థులు మండిపడుతున్నారు.

**కేసులు నమోదు చేస్తాం**

సమాచారం అందగానే వెళ్లి పరిశీలిస్తే అక్కడ వాహనాలు కనిపించలేదు. చెరువులు, కుంటల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. మట్టి రవాణాకు వినియోగించే వాహన యజమానులకు జరిమానా విధిస్తాం. కవిత, డీఈఈ

# సర్వే సాగక.. కర్షకుల కలత తీరక

సిరిసిల్ల: సర్వేయర్ల కొరత కారణంగా జిల్లాలో భూ కొలతల సమస్య రైతులను వేధిస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు 15 మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా.. 8 ఖాళీలు ఉన్నాయి. ఖాళీలున్న చోట పక్క మండలాల వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ అధికారులు రహదారులు, రైల్వే, ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పనుల బాధ్యతలు చూస్తున్నారు. ఏళ్ల తరబడి వీటికే ప్రాధాన్యత ఇవ్వడంతో రైతుల భూముల సర్వేలో జాప్యం జరుగుతోంది.

భూ వివాదాలకు అవకాశం లేకుండా, కొత్త చట్టంలో రీసర్వే నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీతోపాటు, అధునాతన పరికరాలు కేటాయించి, సర్వేశాఖను పూర్తిస్థాయి సామర్థ్యంతో సేవలందించే విధంగా సన్నద్ధం చేయాల్సిన అవసరముంది.

భూ భారతి చట్టం అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 17 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో శిక్షణకు 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎంపికైనవారికి ఈనెల 26 నుంచి జులై 26 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో 19 మంది లైసెన్సుడు సర్వేయర్లు ఉన్నారు.

జిల్లా వివరాలు



సర్వేకు వచ్చిన దరఖాస్తులు: 12,581
అనుమతి పొందినవి : 7069
తిరస్కరించినవి : 4934
పెండింగ్‌లో ఉన్నవి : 578

బదిలీ కాని దస్త్రాలు

దీనికితోడు జిల్లా ఆవిర్భావం తర్వాత చాలా వరకు దస్త్రాలు బదిలీ కాలేదు. అలాగే అటవీ, రెవెన్యూ భూముల వివాదాలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులో రైతుల భూములకు హద్దులు పక్కగా ఉండాలని నిర్ణయించడంతో.. సర్వేయర్ల ఆవశ్యకత పెరిగింది. ఈ విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న లైసెన్సుడ్ సర్వేయర్లకు అనుమతులు ఇస్తూనే.. కొత్తవారికి శిక్షణనిచ్చేలా ప్రణాళికలు చేస్తోంది.

**నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు**

నిజాం కాలంలో షెత్వార్ పేరిట భూముల సర్వే జరిగింది. రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పట్టాభూముల వివరాలతో కాస్రా-పహాణి తయారు చేశారు. అప్పటినుంచి వాటినే రెవెన్యూశాఖ పరిగణనలోకి తీసుకుంటుంది. రెవెన్యూ సర్వేలాండ్ రికార్డులోని టీపన్(కొలతల పుస్తకం) ఆధారంగా కొలతలు చేపడుతున్నారు. దీని ద్వారా హద్దులు నిర్ణయిస్తున్నారు. వీటిలో స్పష్టతలేక తరచూ భూముల వివాదాలు నెలకొంటున్నాయి. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో పేర్కొంది.

**ఏడాదిగా పరిష్కారం కాలేదు**

సర్వే దరఖాస్తు పత్రంతో విజయ్, మర్తన్‌పేట

గ్రామంలో మాకు పలు సర్వే నంబర్లలో 11.10 ఎకరాల భూమి ఉంది. పక్కవారితో హద్దుల సమస్య రావడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని కోసం గతేడాది మేలో సర్వే కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసి ఏడాదవుతున్నా.. సమస్య పరిష్కారం కాలేదు.

# అన్నీ మృత్యు కుహరాలే



హైదరాబాద్ : చార్మినార్‌కు అతి సమీపంలోని కృష్ణా ముత్యాల దుకాణంలో అగ్ని ప్రమాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. తక్కువ వెడల్పుతో మెట్లు, ఒకే గుమ్మం, చుట్టూ గాలి కూడా దూరలేని విధంగా నిర్మాణాలు, ఏళ్ల నాటి విద్యుత్తు తీగలతో పనిచేస్తోన్న వ్యాపార కేంద్రాలు ఎంత వరకు శ్రేయస్కరం అని జనాల్లో ఆందోళన మొదలైంది. కింది అంతస్తులో చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలో పై అంతస్తులో వారిని బలి తీసుకున్నాయి. దట్టమైన పొగ ఇంటి నిండా వ్యాపించడంతో ఊపిరి పీల్చుకోలేక 17 మంది చనిపోయారు. రెండేళ్ల కిందట సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ అదే జరిగింది. ఈ నేపథ్యంలో చార్మినార్ చుట్టుపక్కల ఉన్న వెయ్యికిపైగా పురాతన కట్టడాల్లో నిర్వహిస్తున్న దుకాణాల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**రద్దీ మార్కెట్లే..** అఫ్జల్‌గంజ్, బేగంబజార్ నుంచి మొదలుపెడితే మూసీకి అటువైపున ఉన్న మదీనా మార్కెట్, పత్తర్‌గట్టీ, లాడ్‌బజార్, దాని చుట్టుపక్కలున్న వేర్వేరు మార్కెట్లలో వందేళ్లకు పైబడిన భవనాలు వెయ్యికిపైగా ఉన్నట్టు జీహెచ్ఎంసీ చెబుతోంది. దుకాణాలన్నీ ఒకదానికొకటి ఆనుకొని ఉండటంతో మంటలు సులువుగా వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది.

**నగరంలో 70వేలు**

ప్రమాదం జరిగిన భవన విస్తీర్ణం 77 గజాలు. రెండు ముత్యాల దుకాణాలు, పై అంతస్తుల్లో ఇళ్లున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు లోపలున్న బాధితులు మెట్ల మార్గం నుంచి బయటకు రాలేకపోయారు. నగరంలో 19లక్షల నిర్మాణాలు ఆస్తిపన్ను పరిధిలో ఉండగా, ఇళ్లతోపాటు వ్యాపార కేంద్రాలు కలిసి ఉన్నవి 70వేలు. వాటన్నింటినీ తనిఖీ చేసి, అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

**భద్రత కోసం నిర్మించిన భవనమే కారణమా?**

గుల్జార్‌హౌజ్ వద్ద దొంగతనాలకు అవకాశం లేకుండా భవనాలను నిర్మించడమే ప్రమాద తీవ్రతకు కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గాలి దూరకుండా, కిటికీలు, షట్టర్లు నిర్మించడంతో ప్రమాదంలో తప్పించుకునే వీలు లేకుండా చేసింది. గుల్జార్‌హౌజ్‌లో ముత్యాల వ్యాపారం జరిగే ప్రతి భవనమూ ఇదే తరహాలో నిర్మించారు. ఆదివారం సహాయక చర్యలు చేపట్టడానికి తొలుత వెనకాడాల్సి వచ్చిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఘాట్‌లో విహరిస్తూ.. భక్తితో తరిస్తూ!



మహబూబాబాద్: భక్తిభావంతో నిండిన పుష్కర ఘాట్.. ఆధ్యాత్మికతతో విరాజిల్లుతున్న నదీతీరం.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తుల సందడి.. కేవలం పుష్కర స్నానమే కాకుండా.. పడవలో ప్రయాణిస్తూ.. హెలికాప్టర్‌లో విహంగ వీక్షణం చేస్తూ.. ఎద్దులబండిపై ప్రయాణిస్తూ.. స్వామి సన్నిధిలో తరిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో విశేషాలివిలా.. ఎద్దులబండి ప్రయాణం దూర ప్రాంతాల నుంచి ప్రైవేటు, సొంత వాహనాల్లో వస్తున్న జనం.. పార్కింగ్ ప్రాంతాల నుంచి సరదాగా ఎద్దులబండి ఎక్కి ప్రయాణం చేస్తున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుటూ.. ఫొటోలు తీసుకుంటూ.. ఆనంద పడుతున్నారు. బండ్ల యజమానులకు ఒక్కొక్కరు రూ.50 చెల్లిస్తున్నారు.

**కాళేశ్వర, ముక్తీశ్వరుడికి మొక్కులు..**

పుష్కర స్నానం, ఇతరత్రా పూజాది కార్యక్రమాలు, నదిలో, ఒడ్డున ఆనంద జ్ఞాపకాల మదిలో తేలియాడిన వారందరూ శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ఇళ్లకు తిరుగు పయనమవుతున్నారు.

**సరదాగా పడవలో..**

పుష్కర జ్ఞాపకం మధురానుభూతిగా మిగలాలనే ఆసక్తితో చాలా మంది పడవలో ప్రయాణిస్తూ కేరింతలు కొడుతున్నారు. ఒక్కొక్కరు రూ.100 చెల్లించి దాదాపు నదిలో 2 కి.మీ పొడవునా ప్రయాణిస్తున్నారు. సుమారు 6 పడవల్లో రోజుకు వెయ్యి మంది విహరిస్తున్నారు.

**విహంగ వీక్షణం**

సర్కారు హెలికాప్టర్ జాయ్ రైడ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక రైడ్ సుమారు 7 నిమిషాల పాటు నిర్వహిస్తున్నారు. విహంగ వీక్షణం చేస్తూ గోదావరి పరివాహక ప్రాంతం చూస్తూ ఆనందపడుతున్నారు. ఒక్కొక్కరు రూ.4500 చెల్లిస్తున్నారు.

**పిండ ప్రదానాలు**

తమ కుటుంబాల్లో చనిపోయిన వంశ వృక్షం పేరున పుష్కర సమయంలో పిండ ప్రదానాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరికి చెందిన కుంచం తాండవ వెంకటేశ్వరరావు తమ కుటుంబంలో మృతి చెందిన 33 మంది, సోమవరపు గంగాధరరావు 28మంది పేరున పిండ ప్రదానాలు చేయించారు.

**ఆదియోగి శివుడు**

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ప్రతిష్ఠించిన ఆదియోగి శివుడిని విగ్రహం మాదిరిగా నది ఒడ్డున శివుడు, నంది విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులందరూ అక్కడికి వచ్చి దర్శించుకుంటున్నారు.

**జ్ఞాన సరస్వతిని స్మరిస్తూ**

నది ఒడ్డున ఏర్పాటు చేసిన 17 అడుగుల జ్ఞాన సరస్వతీ మాత, రెండు వైపులా కొలువుదీరిన చతుర్వేద మూర్తులను దర్శించుకుంటున్నారు. పిల్లలు తమకు చదువు బాగా వచ్చేలా జ్ఞానాన్ని అందించాలని కోరుతూ.. గుర్తుగా ఫొటోలు తీసుకుంటున్నారు.

**గొప్ప క్షేత్రం.. కాళేశ్వరం**

పవిత్రమైన త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కర స్నానాలు చేసి తరించాలని నటకిరీటి రాజేంద్రప్రసాద్ భక్తులను కోరారు. ఆయన పుణ్యస్నానం చేశాక కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

**హైకోర్టు న్యాయమూర్తి పూజలు**

కాళేశ్వర క్షేత్రంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె పుష్కర పుణ్యస్నానం ఆచరించేందుకు ఆదివారం కాళేశ్వరం వచ్చారు. ఆమెకు కలెక్టరు రాహుల్‌శర్మతోపాటు, రాజగోపురం వద్ద అర్చకులు మర్యాద పూర్వక స్వాగతం పలికారు.

**పుష్పగిరి పీఠాధిపతి రాక**

పుష్కరాల నాలుగో రోజున పుష్పగిరి పీఠాధిపతి శ్రీఅభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయంలో స్వామి వారికి జలాభిషేకాలు నిర్వహించారు.

# ఇలా చేద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

హైదరాబాద్: నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు నగరవాసులను బెంబేలెత్తిస్తున్నాయి. 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరి చేసిన నేపథ్యంలో అంతకంటే తక్కువ ఎత్తున్న భవనాల్లో భద్రతా ప్రమాణాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదాల సమయంలో సహాయక చర్యల్లో ఇబ్బందులతో పాటు మరణాలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఫైర్ స్మోక్ డిటెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి.

అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందరినీ అప్రమత్తం చేసే హారన్ స్విచ్ బోర్డులు ప్రతి అంతస్తులో ఉండాలి.

ప్రతి అంతస్తులో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రధానంగా మీటర్ల దగ్గర, ఎలక్ట్రిక్ ఉపకరణాల వద్ద ఫైర్ బాల్స్ ఉండాలి.

ప్రతి అంతస్తు వద్ద ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలి.

మంటల్లో చిక్కుకుంటే ఇంట్లో దుప్పట్లను నీటిలో తడిపి ఒంటికి చుట్టుకొని అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయొచ్చు.

మంటలు అంటుకున్నప్పుడు విలువైన వస్తువుల కోసం చూడకుండా మొదట ప్రాణాలు కాపాడుకోవాలి. ఒక వేళ పొగలో చిక్కుకుంటే కంగారుపడొద్దు. పొగ గది పైభాగంలో ఎక్కువగా, కింది భాగంలో తక్కువగా ఉంటుంది. ముఖానికి తడి రుమాలుతో గానీ టవల్‌ను చుట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస పీలుస్తూ నేలపై పాకుతూ అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయాలి.



# తోడుకున్నోళ్లకు 'లెక్క'లేనంత

పెద్దపల్లి: మట్టి.. ఇసుక.. సహజ వనరులు ఏవైనా తరలింపునకు అనుమతించే క్రమంలో ఓ లెక్క ఉంటుంది. పరిమాణాన్ని బట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో చెరువు మట్టి విషయంలో ఈ నిబంధనను విస్మరించారు. ఏకంగా ట్రిప్పుల చొప్పున లెక్కలు వేసి అనుమతులిచ్చేశారు. దీంతో 'తోడుకున్నోడికి తోడుకున్నంత' అన్న చందాన దోపిడీ సాగుతోంది.

**ఎందుకీ వెసులుబాటు!** జిల్లాలో అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ ట్రిప్పులు తీసుకెళ్లడం.. వివాదం కోర్టుల వరకు వెళ్లడం.. ఆ తర్వాత తరలించిన మట్టికి కొలతలు వేసి, జరిమానా విధించడం పరిపాటిగా మారింది. గతేడాది కొత్తపల్లి చెరువు నుంచి అనుమతించిన దాని కంటే ఎక్కువ తరలించారు. చివరికి జరిమానా చెల్లించే పరిస్థితి రాగా రాజకీయ పార్టీల జోక్యం పెరగడంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ట్రిప్పునకు రూ.2700గా ధర నిర్ణయించారు.

**ఎన్నెన్నో సందేహాలు**

'ట్రిప్పు' అంటే ఎంత పరిమాణం అనేది ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. టిప్పర్ సామర్థ్యం ఎంత? అందులో ఎంతవరకు అనుమతిస్తారన్నది పరిగణనలోకి తీసుకోలేదు. 10 టైర్ల టిప్పర్‌లో 20 టన్నులు, 12 టైర్ల టిప్పర్‌లో 25 టన్నుల వరకు మట్టిని తరలించే అవకాశముంటుంది. చెరువులో మట్టిని ఎంత లోతు వరకు తవ్వొచ్చనే నిబంధన లేదు. నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం చెరువులో సాధారణంగా మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వడానికి అనుమతి ఉండదు. భారీ యంత్రాలతో అధిక లోతులో తవ్వుతున్నారు. ఓదెల మండలం కొలనూరు అప్పమయ్య చెరువులో 2-3 మీటర్ల మేర తవ్వుతున్నారు. చెరువు వద్ద లస్కర్ మినహా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అధికారులు పర్యవేక్షించడం లేదు. సదరు లస్కర్ కూడా ట్రిప్పుల సంఖ్య రాసుకునే రెవెన్యూ అధికారి వద్దే కాలక్షేపం చేస్తున్నాడు.

వాహనాల్లో సామర్థ్యానికి మించి మట్టి తరలింపుతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయి. తూకం వేసేందుకు ఇసుక మాదిరిగా



చెరువుల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయలేదు. రవాణా శాఖ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. సుల్తానాబాద్-శ్రీరాంపూర్ రోడ్డు పక్కనే ఉన్న కొలనూరు చెరువు మట్టిని సుల్తానాబాద్, పెద్దపల్లి మీదుగా ఇటుక బట్టీలకు తరలించుకునే అవకాశముండగా మడిపల్లి కాలనీ, అంకంపల్లి, మూలసాల క్రాస్‌రోడ్డు, ఉప్పరపల్లి, కొత్తపల్లి, పెద్దబొంకూర్‌ల మీదుగా తరలిస్తున్నారు.

**ప్రశ్నించిన వారిపై కేసులు**

జిల్లాలోని 33 చెరువుల నుంచి మట్టి రవాణాకు అధికారులు అనుమతించగా ప్రస్తుతం 10 చెరువుల నుంచి తరలిస్తున్నారు. మట్టి తరలింపుపై ప్రశ్నించిన వారిని బెదిరించడం, కేసులు పెట్టడం పరిపాటిగా మారింది.

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

కొలనూరు అప్పమయ్య చెరువులో అనుమతించిన మేరకే మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, చెరువులో నీరు ఊరేటంత లోతులో మట్టి తీస్తే విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం. ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ, సుల్తానాబాద్

# పెట్రోలు బంకుల్లో సదుపాయాలేవీ..!

సిరిసిల్ల : కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు ఉచితంగా వివిధ సౌకర్యాలు కల్పించాలి. కాగా క్షేత్ర స్థాయిలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి బంకులో ఇంధనం నాణ్యతను పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉండాలి. రక్షిత తాగునీరు, శౌచాలయాలు, అత్యవసర సమయంలో ఫోన్ చేసుకునే సదుపాయం మొదలైనవి కల్పించాలి. వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. జిల్లా వ్యాప్తంగా 85 పెట్రోలు బంకులు ఉండగా చాలాచోట్ల సదుపాయాలు కనిపించడం లేదు. చాలా బంకుల్లో గాలి నింపే యంత్రాలు పని చేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. గత్యంతరం లేకపోవడంతో వాహనదారులు డబ్బులు చెల్లించి వాహనాల్లో గాలి నింపించుకుంటున్నారు. మండు వేసవిలో తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉండగా అవేమీ కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు పర్యవేక్షిస్తే మేలు**



బంకుల్లో సేవా లోపం ఉంటే ఫిర్యాదు చేసేందుకు తప్పని సరిగా రిజిస్టర్లు అందుబాటులో ఉండాలి. అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి ఇంధనం నాణ్యత పరీక్షిస్తూ ఉండాలి. అగ్నిమాపక పరికరాలు(ఫైర్ సేఫ్టీ) సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకోవాలి. వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలను పర్యవేక్షించాలి. కాగా క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి.

**నోటీసులు జారీ చేస్తాం**

జిల్లావ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలు పాటించకుంటే నోటీసులు జారీ చేస్తాం. వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. వసంతలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

# పర్యావ‘రణం’..!

మిర్యాలగూడ : మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా.. చివరకు నిలబడాల్సింది భూమి మీదే. భూమిని మనం తల్లిలా భావిస్తాం. అలాంటి భూమాతకు అవసరం, అభివృద్ధి పేరుతో అనేక రకాలుగా విఘాతం కలిగిస్తున్నాం. నింగి, నేల, నిప్పు, గాలి, నీరు అనే పంచ భూతాలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుంది. వీటిలో ఏది లోపించినా జీవుల జీవనం అస్తవ్యస్తమవుతుంది.

**వనరులన్నీ ఖతం..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కాలంలో అనేక అభివృద్ధి పనులు, పరిశ్రమల ఏర్పాటు, రహదారుల విస్తరణ చేపట్టారు. వీటి కోసం చెట్లు, అడవుల నరికివేత, కొండలను పిండి చేసి మైదానాలుగా మార్చడం వంటి చర్యలు చేపట్టారు. మరోవైపు భూమి లోపలి వనరులైన భూగర్భ జలాలు, ఖనిజాలు, సున్నపురాయిని వెలికితీయడం వంటి చర్యలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి. పర్యావరణ అసమతుల్యం ఏర్పడి భూతాపం పెరగడం, వర్షాలు సక్రమంగా కురవకపోవడం వంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నివాస స్థలాలు, భవన నిర్మాణాల కోసం సైతం వనరుల వినియోగం విపరీతంగా పెరిగింది.

**పాతాళానికి గంగ..**

ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు ఏటా పాతాళానికి పోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భూగర్భ జలాల లభ్యత కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ యాదాద్రి జిల్లాలో మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. గతేడాది మార్చిలో యాదాద్రి జిల్లాలో 9.94 మీటర్ల లోతున భూగర్భ జలాలు లభ్యం కాగా ఈ ఏడాది మార్చిలో 12.05 మీటర్లకు పడిపోయాయి. నల్గొండ జిల్లాలో గుండ్లప



ల్లి, మునుగోడు, మర్రిగూడ మండలాల్లో భూగర్భ జలాలు మరింత కిందకు వెళ్లగా, సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, మద్దిరాల, చివ్వెంల, ఆత్మకూరు ఎస్ మండలాల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

**మొక్కలు నాటుదాం**

ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెట్లను ఎడాపెడా నరకడం, అడవులను మైదానాలుగా పలు అభివృద్ధి పనులకు ఉపయోగించడం, ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగించడం తదితర కారణాలతో పర్యావరణ కాలుష్యం ఏర్పడి భూమిపై మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనిని నివారించాలంటే ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడిచి పెట్టి తరచూ మొక్కలు నాటాలి. అవిరెండ్ల సందీప్‌కుమార్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

**కాటేస్తున్న కాలుష్యం...**

పదేళ్ల కాలంలో పరిశ్రమల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటిలో పలు పరిశ్రమల నిర్వహణ నిబంధనల ప్రకారం చేపట్టకపోవడంతో వీటి నుంచి వెలువడే కాలుష్యం భూమి, నీరు, గాలిని కలుషితం చేస్తుంది. మరోవైపు ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో నిత్యం 365 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఉమ్మడి జిల్లా జనాభా సుమారు 37.48లక్షలు. ఈలెక్కన ఒక మనిషి ఏటా 3,748 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు.


# ఎంపికైతే.. రూ.కోటి

భానుపురి : ఇంటింటికి సౌర వెలుగులు విరబూయనున్నాయి. ప్రతి గ్రామంలో అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తోంది. సౌరశక్తిలో ఆదర్శంగా నిలిచిన జిల్లాలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రూ.కోటి నజరానా ప్రకటించింది. ఇంటింటికీ సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవడానికి పంచాయతీల మధ్య పోటీతత్వం పెంచింది. దీనికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ) సభ్యులు 5 వేల జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేయనున్నారు. వచ్చే ఆరునెలల్లో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఉత్తమంగా నిలిచిన వాటికి నగదు పురస్కారం అందించనుంది.

**కాలుష్యం తగ్గించడానికి**

కేంద్ర ప్రభుత్వం పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల కింద సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రాయితీ ఇస్తోంది. దీంతో సౌర విద్యుదుత్పత్తిని విస్తరించేందుకు గ్రామాల మధ్య పోటీ పెంచింది. కలెక్టర్ ఛైర్మన్‌గా, రెడ్కో అధికారి కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జడ్పీ సీఈవో, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, పీఆర్ ఈఈ, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 5 వేల జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆరునెలల్లో ఇళ్ల పైకప్పులపై అత్యధికంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్తు ఉత్పత్తి చేసిన గ్రామాలను



జిల్లాస్థాయి కమిటీ ‘మోడల్ సోలార్ విలేజ్’గా గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నిధులతో గ్రామంలోని ప్రభుత్వ భవనాల పైకప్పులపై సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. కేంద్రం అందించే ప్రోత్సాహకంతో సౌర విద్యుత్తు తప్ప ఇతర అభివృద్ధికి నిధులు వాడుకొనే అవకాశం లేదు.

**అవగాహన..**

ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర విద్యుత్తుపై అవగాహన కల్పిస్తారు. ప్యానెళ్ల ఏర్పాటుకు 2 కిలోవాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్స్‌కు రూ.78 వేల రాయితీ ఉంటుంది. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల్లో రుణం తీసుకొనేలా ప్రోత్సహిస్తారు. స్వశక్తి సంఘాల సహకారంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎంపిక..**ఐదు వేల జనాభా కలిగిన గ్రామాలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎంపిక చేస్తారు. సోలార్ పలకల ఏర్పాటుకు ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి. రెడ్కో అనుమతి పొందిన సంస్థలు మాత్రమే ప్యానెళ్లు తీసుకోవాలి. పాండు రంగారావు, రెడ్కో, ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

# ఆత్మలకూ రేషన్ బియ్యం



చొప్పదండి : చొప్పదండిలోని ఓ వ్యక్తి మరణించి ఆరేళు అవుతుంది. ఆయన తండ్రి సైతం నాలుగేళ్ల కిందట మృతి చెందారు. అయినా నేటికీ వారిద్దరి పేర్ల మీద కుటుంబ సభ్యులు రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అయిదేళ్ల కిందట ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అయినా ఆ కుటుంబం నెలనెలా రేషన్ బియ్యం లబ్ధి పొందుతూనే ఉంది. చొప్పదండికి చెందిన గంగారెడ్డి అనే వ్యక్తి ఆరేళ్ల కిందట, భూమయ్య అనే వ్యక్తి 2022లో, లక్ష్మి అనే వృద్ధురాలు మూడేళ్ల క్రితం మృతి చెందారు. కానీ నేటికీ వీరి పేర్ల మీదుగా బియ్యం పంపిణీ జరుగుతోంది.

సాధారణంగా రేషన్ దుకాణం పరిధిలో ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి పేరును తొలగిస్తారు. ఓ కుటుంబంలోని సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం వస్తే రేషన్ కార్డు రద్దు చేస్తారు. కానీ నాలుగైదేళ్లుగా ఈ ప్రక్రియ సరిగా జరగకపోవడంతో వారి పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. సంబంధిత కుటుంబాలు ప్రతి నెలా బియ్యం అందుకుంటూనే ఉన్నాయి. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సైతం వీటిపై దృష్టి సారించడంలేదని తేటతెల్లమవుతోంది. వారి పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది.

**ఇలా జరగాల్సింది..**

గతంలో జిల్లా, మండల రెవెన్యూ అధికారులు రేషన్ డీలర్ల నుంచి ఎప్పటికప్పుడు మృతుల, ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వివరాలు అడిగేవారు. కానీ కరోనా విపత్తు సమయం నుంచి ఆ వివరాలు అడగకపోవడంతో వారి పేర్లు, కార్డులు అలాగే కొనసాగుతున్నాయి. ఆ వివరాలు సమర్పిస్తే డీలర్‌కు వచ్చే కోటా బియ్యం తగ్గిపోవడంతో కమీషన్ తగ్గిపోతుంది.

గ్రామపంచాయతీల్లో మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నప్పుడు.. అక్కడి నుంచి మృతుల వివరాలు సేకరించి, రేషన్‌తోపాటు పింఛన్లు తొలగించేవారు. కానీ ప్రస్తుతం ఈ ప్రక్రియ మొత్తం మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో వివరాలు తెలియకుండా పోతోంది.

**మృతుల వివరాలు తొలగిస్తాం**

మృతుల వివరాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సేకరించి వారి పేర్లను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఈ-కేవైసీ ప్రక్రియను కూడా శతశాతం పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.
నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

**పూర్తికాని ఈ-కేవైసీ ప్రక్రియ**

రేషన్‌కార్డులో మృతుల వివరాలు తొలగించేందుకు, పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ విధానానికి శ్రీకారం చుట్టింది. రేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరూ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని మొదట్లో హడావుడి చేశారు. రెండుసార్లు గడువు కూడా పెంచారు. అయినా ఇంకా చాలామంది చేసుకోలేదు.

వేలిముద్రలు పడని కొంతమందికి వెసులుబాటు కల్పించారు. వారు ఓటీపీ చెబితే సరిపోతుంది. దీనిని ఆసరాగా తీసుకొని మృతుల కుటుంబాలు చనిపోయిన వారి పేరిట బియ్యాన్ని తీసుకుంటున్నాయి. చొప్పదండి మండలంలో 33 రేషన్ దుకాణాల్లో కనీసం వందకు పైగా మృతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా జిల్లా పరిధిలో 566 రేషన్ దుకాణాలు ఉండగా సుమారు 20 వేల వరకు మరణించిన వారి పేర్లు ఉండే అవకాశాలున్నాయి.

# ఆరంభానికి మీనమేషాలు.. అవస్థల్లో రోగులు




వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి ఏడాది కావస్తోంది. ప్రారంభించటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా పాత భవనం సరిపోక అవస్థలు తప్పడంలేదు. 2024 మేలోనే ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత శాసన సభా సమావేశాలు జరుగుతున్నాయని, ఎన్నికల కోడ్ కారణంగా దాటవేశారు. ఈనెల 23న ప్రారంభిస్తారన్న మరోసారి ప్రచారం జరిగింది. అది కూడా వాయిదా పడింది.

**డాక్టర్లు కూర్చునేందుకూ స్థలం లేదు**

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి ఉపయోగంలోకి తెస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం కొనసాగుతున్న పాత ఆసుపత్రిలో డాక్టర్లకు కూర్చోవడానికి కూడా సరియైన స్థలం లేదు. దీనికితోడు రోగులు, వారితోపాటు వచ్చే సహాయకులు తలదాచుకోవాలంటే సరైన వసతి లేక చుట్టు పక్కల ప్రాంతాలను, హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రత్యేక వైద్య సేవలకు వీలు: కొత్తగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తే జిల్లా వాసులకు మెరుగైన సేవలు అందుతాయి. బస్‌స్టాండ్ రోడ్డు మార్గంలో ఉన్న ఆసుపత్రిని ఇక్కడికి తరలిస్తారు. ప్రధానంగా ప్రత్యేక వైద్య సేవలు అందుతాయి. ఇక్కడ ఐసీయూ, వెంటిలేటర్లు గదులను ఏర్పాటు చేస్తారు. ఎముకలు, పిల్లలు, నేత్రవ్యాధులకు సంబంధించిన ప్రత్యేక సేవలను అందజేస్తారు.

**ఈనెలలో ప్రారంభిస్తాం**

జనరల్ ఆసుపత్రి భవనాన్ని ఈనెల చివర్లోగా ప్రారంభించి అన్ని రకాల సేవలను అందజేస్తాం. ఇక్కడ రోగులకు అన్ని అధునాతనమైన సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేక వైద్య సేవలు ఇక్కడ కొనసాగుతాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరమైతేనే హైదారబాద్‌కు సిఫారసు చేస్తాం. డాక్టర్ రాంచంద్రయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్.

**అన్ని సదుపాయాలు ఉన్నాయంటున్నారు**

ప్రస్తుతం కొనసాగుతున్న ఆసుపత్రిలో సౌకర్యాలు లేక రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. భవనంలో అన్ని సదుపాయాలను కల్పించారని చెబుతున్నారు. ఇంక ఆలస్యం ఎందుకు. వెంటనే ప్రారంభించాలి. డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు.

# హరిత లక్ష్యం.. కార్యాచరణ సిద్ధం



కోరుట్ల : ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014 నుంచి పట్టణాల్లో, గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని అయిదు పట్టణాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో వన మహోత్సవం చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా వన నర్సరీలను ఏర్పాటు చేసి ఏటా కూలీలతో ప్రత్యేకంగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. జిల్లా అధికారులు ప్రతి పట్టణంలో విస్తృతంగా మొక్కలు నాటించేందుకు ప్రత్యేక లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పట్టణ ప్రగతి నర్సరీల్లో లక్షల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. లక్ష్యం అందుకునేందుకు సరిపడా మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో మొత్తం 7,81,200 మొక్కలను నాటాలని లక్ష్యం కేటాయించారు. పట్టణ నర్సరీల్లో 5,35,300 మొక్కలు అందుబాటులో ఉన్నట్లు బల్దియా అధికారులు తెలిపారు.

**పట్టణ నర్సరీల్లో విరివిగా పెంపకం**

గతంలో పట్టణాల్లో నర్సరీలు అందుబాటులో ఉండేవి కావు. చుట్టుపక్కల గ్రామాల్లోని పల్లె వన నర్సరీల్లో పెంచిన మొక్కలు తీసుకువచ్చి నాటేవారు. ఇవి సరిపోకపోవడంతో ప్రైవేటు నర్సరీల నుంచి లక్షల రూపాయలను వెచ్చించి మొక్కలను కొనుగోలు చేసి తెచ్చి పట్టణ ప్రజలతో నాటించేవారు. నాలుగేళ్ల క్రితం ప్రతి పట్టణంలో పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి వన నర్సరీలను ఏర్పాటు చేశారు. అందులోనే ఆయా పట్టణాల్లోని రోడ్లకిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో నాటేందుకు, ఇళ్లలో ప్రజలతో నాటించేందుకు కావాల్సిన పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. పట్టణ నర్సరీల్లో ఏడాదంతా మొక్కలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. నాణ్యమైన మొక్కల కోసం పురపాలక సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు.

**వివిధ రకాలు సిద్ధం**

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పురపాలికల్లోని పట్టణ నర్సరీల్లో కేటాయించిన లక్ష్యం సాధించేందుకు కావాల్సిన అన్ని రకాల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇప్పటికే నర్సరీల్లో వేల సంఖ్యలో మొక్కలు ఏపుగా పెరిగి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఇంటికి 2 నుంచి 5 వరకు పూల, పండ్ల మొక్కలను ఏటా పంచుతున్నారు. రహదారులకు ఇరువైపులా నాటేందుకు నాలుగు, అయిదు అడుగుల ఎత్తు గల మొక్కలను ప్రత్యేకంగా పెంచుతున్నారు. మల్లెపువ్వు, గులాబి, మందార, గోరింటాకు, చామంతి, తులసి, పారిజాతం, కోనోకార్పస్, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, కానుగ, బాదాం, మారేడు, సెల్లోఫాం, టేకొమా, టేకు, నీలగిరి ఇలా సుమారు 35 రకాల మొక్కలను విరివిగా పెంచుతున్నారు.

# కరెంట్ దొంగలపై కన్ను..!

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న విద్యుత్తు చౌర్యంపై డిటెక్షన్ ఆఫ్ పెరిఫెరల్ ఆఫ్ ఎనర్జీ(డీపీఈ) విభాగం అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. చౌర్యం నియంత్రణ విభాగంతో పాటు స్థానిక విద్యుత్తు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నప్ప టికీ.. అక్కడక్కడా కొందరు ఇంకా అక్రమంగా విద్యుత్తును వినియోగించుకుంటూ చౌర్యానికి పాల్పడుతున్నారు.

విద్యుత్తు చౌర్యంపై మార్చి 2024 నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా డీపీఈ అధికారులు 2,703 కేసులు నమోదు చేసి రూ.4.61 కోట్లు, స్థానిక విద్యుత్తు అధికారులు 1217 కేసులు నమోదు చేసి రూ.15 లక్షల జరిమానా విధించారు.

ప్రతి నెలా రూ.10 లక్షల జరిమానా విధించే లక్ష్యం ఉన్నప్పటికి విస్తృతంగా తనిఖీలు చేపట్టి లక్ష్యానికి మించి జరిమానా విధించడం, కేసులు నమోదు చేయడం గమనార్హం.

వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంహౌజ్‌లు నిర్మించి పలువురు, ఉద్యానవనాలు అభివృద్ధి చేసి, గొర్రెలు, చేపల పెంపకం చేపట్టి ఉచిత వ్యవసాయ



కనెక్షన్ల నుంచి విద్యుత్తు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాత్కాలిక అవసరాల కోసం, ఇటుక బట్టీల కోసం అక్కడక్కడా విద్యుత్తు లైన్‌కు కొండీలు తగిలిస్తున్నారు.

**విద్యుత్తు చౌర్యం ఇలా...**

కొందరు డొమెస్టిక్ విద్యుత్తు కనెక్షన్ తీసుకుని కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారు. రెండింటి యూనిట్ ధరకు భారీగా వ్యత్యాసం ఉంది. మీటరు ఉన్నప్పటికీ అది తిరగకుండానే లూప్ ద్వారా విద్యుత్తు వినియోగించడం గమనార్హం. ఈ కేసుల్లో భారీగా బ్యాక్ బిల్లింగ్ పేరిట జరిమానా విధిస్తున్నారు. విద్యుత్తు లైన్‌కు కొండీలు తగిలించి వినియోగించడం, మీటర్‌లోని సాఫ్ట్‌వేర్‌ను పనిచేయకుండా ఎంతో కొంత బిల్లు వచ్చే విధంగా మీటర్‌ను సెట్ చేయడంతో విద్యుత్తు భారీగా చౌర్యం జరుగుతోంది. అనుమతి పొందిన కిలో వాట్ కన్నా ఎక్కువగా వినియోగిస్తున్న వారి నుంచి డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. డొమెస్టిక్ కనెక్షన్ ఒక కిలోవాట్ అధిక వినియోగానికి రూ.1000, కమర్షియల్‌కు రూ.2000, పరిశ్రమలకు రూ.1500 వసూలు చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**

విద్యుత్తు చౌర్యం చేయడం నేరం. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కనెక్షన్ పొంది మీటర్లు బిగించిన తదుపరి విద్యుత్తును వినియోగించాలి. చౌర్యం రుజువు అయిన పక్షంలో కేసును బట్టి జైలు, భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్తు చౌర్యాన్ని నియంత్రించేందుకు నిరంతరాయంగా తనిఖీలు చేపడుతున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో 3,920 కేసులు నమోదు చేసి రూ.4.76 కోట్లు జరిమానా వసూలు చేశాం. శ్రీనివాసులు, డీఈ, జిల్లా విద్యుత్తు చౌర్యం నియంత్రణ విభాగం

# నిధులు రావు.. సమస్యలు తీరవు

ఆసిఫాబాద్: ఉపరితల బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అడుగడుగునా అవస్థలతో సహవాసం చేస్తున్నారు. రోడ్లులేక, తాగునీటి ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రెండేళ్ల నుంచి డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) నిధులు రావడం లేదు. మరోవైపు వచ్చిన సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులు సైతం నేతలు తమకు నచ్చిన చోట, కాసులు మిగిలే ప్రదేశాల్లో చేపడుతున్నారు. ఉపరితల బొగ్గు గనుల ఏర్పాటుతో జిల్లాలో 25 పైగా గ్రామాలు చెల్లాచెదురయ్యాయి. కొన్ని గ్రామాలకు మాత్రమే సింగరేణి పునరావాసం కల్పించింది. గ్రామం ఉన్న ప్రాంతంలో గని తవ్వితేనే పునరావాసం కల్పిస్తున్నారు. గ్రామం పక్కనుంచే తవ్వకాలు సాగుతున్నా, వందల మీటర్ల లోతు నుంచి బొగ్గును వెలికితీసే క్రమంలో వెలువడే వ్యర్థాలు, పేలుళ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నా, పునరావాసం గురించి అధికారులు పెదవి విప్పడం లేదు. కొన్నిచోట్ల రెండు, మూడు సార్లు సైతం గ్రామాలు గనుల తవ్వకాలతో మరోచోటుకు తరలిపోయే పరిస్థితి ఏర్పడింది.

**తీరని వేదన..**

తిర్యాణి, ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల సరిహద్దులో ఉన్న కైరిగూర ఉపరితల గని 1600 హెక్టార్లలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ గనిని ఆనుకునే తోయగూడ, చందుగూడ, కొలాంగూడ, గోండుగూడతోపాటు, మరో అయిదు గ్రామాలు ఉన్నాయి. గనుల్లో పేలుళ్లకు పెంకుటిల్లు పగుళ్లు తేలుతున్నాయి. మరమ్మతులు చేసుకుని నివాసాలు



ఏర్పాటు చేసుకుంటున్నారు. దాదాపు ఆరువందల జనాభా ఈ గ్రామాల్లో ఉంది. పాత దంతన్‌పల్లి, గోవర్‌గూడతోపాటు గని పక్కనే ఉన్న మరో నాలుగు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. వీరంతా పక్కనే ఉన్న చెలమల నీరు తెచ్చుకుంటున్నారు. ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉల్లిపిట్ట డోర్లి, ఇందిరానగర్, దంతన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. రెబ్బెన మండలంలోని సోనాపూర్‌లో అయిదేళ్ల కిందట సింగరేణి తవ్వకాలు చేపట్టడంతో.. 45 కుటుంబాలు మరోచోట స్థలం కొని ఇళ్లు నిర్మించుకున్నారు. విద్యుత్తు, తాగునీరు, పాఠశాల వసతిని కల్పించారు. తాజాగా మళ్లీ ఈ గ్రామం వద్ద గోలేటి ఉపరితల గని ఏర్పాటులో భాగంగా తవ్వకాలు చేపట్టనున్నారు. దీంతో మళ్లీ నిరాశ్రయులుగా మారనున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరిహారం చెల్లింపుల్లో ఓ సర్పంచి చేతివాటం ప్రదర్శించి, బాధితులకు మంజూరైన చెక్కులను తన ఖాతాలో వేసుకున్నారు.

ఇళ్లకు బీటలు వారుతున్నాయి పూసం తిరుపతి, మడావి హనుమంత్‌రావు, తోయగూడ-తిర్యాణి పేలుళ్లతో ఇళ్లకు బీటలు వస్తున్నాయి. ఏటా మరమ్మతులు చేసుకుంటున్నాం. గని చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యల్లోని గ్రామాల్లో ఒక్కో చేతి పంపే తాగునీటి అవసరాలు తీర్చుతోంది. మా ఇద్దరికీ కిడ్నీ ఆపరేషన్లు జరిగాయి. మరికొందరు కిడ్నీ వ్యాధులతో బాధపడు తున్నారు.

జిల్లాకు వచ్చిన డీఎంఎఫ్‌టీ నిధులు: రూ.125 కోట్లు
చేపట్టిన పనులు: 2,586సీఎస్‌ఆర్ నిధులు: రూ.3 కోట్లు

చురకలు



# నకిలీ బిల్లు.. పన్నుకు చిల్లు

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 14న 52 క్వింటాళ్ల వరి ధాన్యం విక్రయానికొచ్చింది. క్వింటా మద్దతు ధర రూ.2 వేలకు పైగా ఉండగా గరిష్ఠంగా రూ.1,611 కనిష్ఠంగా రూ.1,471 పలికింది. ధరలు పతనం కావడంతో వ్యాపారులు అన్నదాతల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. దొంగ బిల్లులతో మార్కెట్ ఫీజు (సెస్)కు ఎగనామం పెడుతున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.

**తక్కువ ధరకు కొనుగోలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీలో 25,524 హెక్టార్లలో వరి సాగైంది. ఇందులో ఒక్క నంద్యాల జిల్లాలోనే 23,044 హెక్టార్లలో సాగు చేశారు. వరి ధాన్యం మద్దతు ధర ఏ-గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300లుగా నిర్ణయించారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు. అక్కడ నేరుగా బియ్యం మిల్లులకు పంపించి క్వింటాపై రూ.వెయ్యి వరకు లాభం పొందుతున్నారు.

**అవుకు కేంద్రంగా దందా**

మార్కెటింగ్‌కు శాఖకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ, కమలాపురం పేరుతో ఓ వ్యాపారి నకిలీ బిల్లులు సృష్టించి వరి ధాన్యాన్ని హైదరాబాదు, నెల్లూరు, కర్ణాటక



తరలించి వ్యాపారం చేసుకుంటున్నారు.

అవుకు మండలానికి చెందిన ఓ వ్యాపారి అవుకు, బనగానపల్లి, బేతంచెర్ల కేంద్రాల మీదుగా దాటేస్తున్నారు. ఇప్పటి వరకు 10 లారీలు నకిలీ బిల్లులతో తరలించినట్లు అధికారులు గుర్తించారు.

**సరిహద్దు దాటిస్తున్నారు**

రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది.

ఉదాహరణకు ధాన్యం క్వింటా రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. ఈ లెక్కన నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించి ఎక్కడికైనా తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు.

పాణ్యం, నంద్యాల, శిరివెళ్ల, రుద్రవరం, బండిఆత్మకూరు, తుంగభద్ర తీర ప్రాంతం నుంచి వరి ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప, తెలంగాణలోని హైదరాబాద్, మిర్యాలగూడ, చెన్నై వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**తనిఖీలు తకరారు**

నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ (చెక్ పోస్టులు) కేంద్రాలు ఉన్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. వారి స్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైన సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నారు. ఇలా ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

గత రెండు నెలలుగా రాత్రి వేళల్లో నిత్యం 30-40 వరకు ధాన్యం లారీలు వెళ్తున్నాయి. ఎలాంటి ఫీజు చెల్లించకుండానే సరిహద్దులు దాటుతున్నాయి. ఎక్కువగా పాణ్యం, కర్నూలు తనిఖీ కేంద్రాల మీదుగానే వెళ్తున్నాయి. పాణ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు నన్నూరు టోల్ ప్లాజా దగ్గర ఉంది. ఏ సమయానికి వస్తారో.. ఏ సమయానికి వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల చెక్ పోస్టులో నకిలీ బిల్లులలో వరి ధాన్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలింది.

# అందిస్తే సారం.. అందకుంటే నిస్సారం

గరివిడి : జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు సమయం సమీపిస్తోంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులు తున్నాయని, ఈ నెలాఖరుకు రాష్ట్రానికి చేరే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా. అదే జరిగి వర్షాలు కురిస్తే జూన్‌లో పంటల సాగు మొదలవుతుంది. రైతులు భూసారం తెలుసుకుని సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయి. అవసరమైన భూసార పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను విశ్లేషించి రైతులకు అందించాల్సి ఉంది. జిల్లాలో 2024-25 ఖరీఫ్‌లో సేకరించిన 21,200 మట్టి నమూనాలను మినహాయించి మిగతా భూముల్లో 2025- 26 ఖరీఫ్‌నకు 28,392 నమూనాలను సేకరించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 27,930 నమూనాలను సేకరించారు. వాటిలో ఫలితాలు వచ్చినవి 7,517 మాత్రమే. లక్ష్యం ప్రకారం ఇంకా ఫలితాలు రావాల్సిన నమూనాలు 20,875 వరకు ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోగా అందించాలి.

**అయిదేళ్లూ పట్టించుకోలేదు..**

వైకాపా హయాంలో జిల్లాలో భూసార పరీక్షల జోలికి పోలేదు. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మట్టి పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో గత సీజన్‌లో పరీక్షలు ఆలస్యమయ్యాయి. సేకరించిన 21,200 నమూనాల ఫలితాలను ఇటీవలే రైతులకు అందించారు. భూసార వివరాలతో కార్డును ముద్రించి ఇచ్చారు. వీటి ఆధారంగా పంటలు సాగు చేయొచ్చు.

కార్డుల రూపంలో అందజేత..: ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పరీక్షలు జరుగుతున్నాయి. రైతుసేవా కేంద్రాల సిబ్బంది పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు భూసార పరీక్ష కేంద్రంలో 12 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఫలితాలను ఎస్‌హెచ్‌సీ పోర్టల్‌లో పొందుపర్చుతున్నారు. ఫలితాల విశ్లేషణ పత్రాలను రైతులకు కార్డుల రూపంలో అందిస్తారు. పొలంలో ఉన్న పోషకస్థాయిలకు అనుగుణంగా ఎరువులను సూచిస్తారు. బి.భానులత, ఏడీ, భూసార పరీక్ష కేంద్రం, విజయనగరం

# కొండను తొలచి... దారిని పూడ్చి



కదిరి : ఎనభై ఏళ్ల కిందట తమ పూర్వీకులు డి.పట్టా పొందారంటూ కదిరికి చెందిన కొందరు వ్యక్తులు కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండను తొలగిస్తూ, ప్రధాన రహదారిని పూడ్చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కదిరికి చెందిన ఓ వ్యక్తికి 1941 కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వేనం: 1504లో 3.31 ఎకరాల పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమిలో పంటలు సాగుచేసిన దాఖలాలు లేవు. భూముల విలువ పెరగడంతో డి.పట్టా పొందిన వ్యక్తి వారసులు 2023లో కదిరికి చెందిన వైకాపా నాయకుడి సిఫార్సుతో రెవెన్యూ అధికారులు ఆ భూమికి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీని) అందజేశారు. దీని ఆధారంగా పట్టా పొందిన వ్యక్తి తమ వారసులకు గిఫ్ట్ డీడ్‌గా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ పత్రాలు ఆధారంగా మూడు వారాల కిందట ప్రైవేటు సర్వేయర్లతో భూమిని కొలతలు వేయించుకుని ప్రధాన రహదారి మొదలుకొని కదిరి లక్ష్మీనరసింహస్వామి కొండను ఆక్రమించుకుంటూ ఆరెకరాల వరకు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు.

**అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన**

1941లో 3.31 ఎకరాల భూమిని సాగుకోసం డి.పట్టా పొందారు. పట్టా ఇచ్చే సమయంలో యూఏడబ్ల్యూగా ఉన్న ఈ భూమిని ఆ తరువాత సాగుకు అనువైనదిగా మార్చేశారు. యూఏడబ్ల్యూ కింద ఉన్న భూమికి డి.పట్టాలు ఇవ్వకూడదని కొందరు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. డి.పట్టా పొందిన రైతులు 84 నాలుగేళ్లపాటు భూమిలోకి వెళ్లలేదు. దశాబ్దాల పాటు ఆ భూమిని అనుభవంలోకి తీసుకోని కారణంగా పట్టా పొందిన వ్యక్తి హక్కు కోల్పోయి ఉంటారని వారు చెబుతున్నారు. పట్టా పొందిన వ్యక్తి వారసులు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతిలేకుండా కొండను, భూమిలోని బండలను పేలుస్తూ పునాదిరాళ్లు, కంకరను అమ్ముకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రోడ్డును ఆక్రమిస్తూ కొండలోని మట్టిని తరలిస్తూ భూమిని చదును చేస్తున్నారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు.

**కదిరికొండ ఆక్రమణను అడ్డుకోండి**

కదిరి ప్రాంతవాసులు పవిత్రంగా భావించే కదిరి లక్ష్మీనరసింహస్వామి కొండ (లఘువమ్మ) ఆక్రమణలకు గురికాకుండా అధికారులు అడ్డుకోవాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సమీపంలోని లఘువమ్మకొండ సమీపంలో భూమిని చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. కొండతో పాటు రాయచోటి ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. సిబ్బందిని పంపి అక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని హెచ్చరించాం. ఆ భూమిలోకి ప్రవేశించిన వ్యక్తుల వద్ద ఉన్న రికార్డులను తీసుకుని తహసీల్దారు కార్యాలయానికి రావాలని సూచించాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

**తవ్వుతున్న ప్రదేశం పరిశీలిస్తాం..**

పెద్దిరెడ్డి, మైనింగ్‌శాఖ అధికారి

అనుమతిలేకుండా బండరాళ్లను పేల్చి పునాదిరాళ్లు, కంకరగా మార్చడం నేరం. ప్రైవేటు భూమి అయినా నిబంధనలు వర్తిస్తాయి. సంబంధిత అధికారుల అనుమతి లేకుండా మట్టిని తవ్వడం, తరలించే వారిపై చర్యలు తప్పవు. కుమ్మరవాండ్లపల్లి వద్ద కొండను తవ్వుతున్న ప్రదేశాన్ని పరిశీలించాలని సిబ్బందిని ఆదేశిస్తాం. నిబంధనలు ఉల్లంఘించినట్లు రుజువైతే చర్యలు తప్పవు.

# షార్‌లో.. నిశబ్దం



శ్రీహరికోట : సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) రోదసీలోకి విజయవంతంగా రాకెట్లను పంపుతూ దశాబ్దాలుగా తన ప్రత్యేకత చాటుతోంది. ప్రయోగాల్లో అతితక్కువ సంఖ్యలో మాత్రమే వైఫల్యాలు చూసింది. ప్రధానంగా జీఎస్‌ఎల్‌వీ ప్రయోగాల్లో క్రయోదశ లోపాలు మింగుడుపడలేదు. తాజాగా ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ-సీ61తో కలిపి ఈ విభాగంలో మూడువరకు వైఫల్యాలు ఎదురయ్యాయి. ఆదివారం జరిగిన ప్రయోగంలో సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తడం షార్ యాజమాన్యాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. కారణం వీటిని షార్‌లోనే అభివృద్ధి చేస్తుంటారు. దీంతో శాస్త్రవేత్తలు అంతర్మథనంలో పడ్డారు.

**అతిపెద్ద కర్మాగారం**

శ్రీహరికోటలో అతిపెద్ద ఘన ఇంధన కర్మాగారం ఉంది. ఇక్కడ 1200 పైగా ఘన ఇంధన మోటార్లను ఇప్పటివరకు తయారు చేశారు. ఇందులోనూ సాలిడ్ మోటార్లు ఉన్నాయి. ఎప్పుడూ లోపాలు తలెత్తలేదు. ఆదివారం ప్రయోగంలో మాత్రమే సాంకేతిక లోపం ఏర్పడింది. ఘన ఇంధన తయారీలో అల్యూమినియం పౌడర్‌ను ఇంధనంగా, అమ్మోనియం ఫర్ క్లోరైడ్‌ను ఆక్సీకరణగాను, హైడ్రాక్సిల్ టెర్మినేటెడ్ పాలీబుటాడియన్‌ను జిగురు పదార్థాన్ని 18 రకాల రసాయనాల సమ్మేళనం తర్వాత ఇంధనాన్ని బౌల్‌తో అత్యంత సురక్షితంగా క్యాస్టింగ్ భవనానికి తీసుకెళ్లి ఘన ఇంధన మోటారు తయారు చేస్తారు. ఈ ప్రక్రియలో సున్నితమైన పరికరాలను వినియోగించి, భద్రత అధికారుల పర్యవేక్షణలో నిర్దిష్టమైన ప్రణాళికలతో మోటార్లను తయారు చేస్తున్నారు. అనంతరం స్థిర పరీక్షలు నిర్వహిస్తారు. సాంకేతికంగా అన్ని పరీక్షలు ముగిసిన తర్వాత రాకెట్‌లో అనుసంధానిస్తారు.

**అనుమానాలెన్నో...!**

ఘన ఇంధన మోటార్లు తయారీకి గతంలో నెలల వ్యవధి పట్టేది. కొన్నాళ్లుగా రోజుల వ్యవధిలోనే తయారు చేస్తున్నారు. పూర్తిస్థాయి తనిఖీలు, పర్యవేక్షణ లేకుండానే మోటార్లు తయారవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే పీఎస్‌ఎల్‌వీ-సీ61 మూడోదశలో సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఘన ఇంధన మోటార్లు ఇలా..**

షార్‌లోని సాలిడ్ ప్రొపెలెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్(స్ప్రాబ్)లో మొదటగా మీటర్ డయా వ్యాసంతో ఎస్1, పీఎస్0 జనరిక్, పీఎస్0 ఎక్సెల్ వర్షన్ మోటారు రూపకల్పన చేశారు. ఇది ఎస్‌ఎల్‌వీ, ఏఎస్‌ఎల్‌వీకి వినియోగించారు. అనంతరం పీఎస్‌ఎల్‌వీ ప్రయోగాలకు 2.8 డయా మీటర్ల వ్యాసంతో పీఎస్1, మరికొంత కాలానికి పీఎస్‌ఎల్‌వీలోని మూడోదశలో వినియోగించే పీఎస్3 మోటార్లను ఇక్కడే స్ప్రాబ్‌లో రూపకల్పన చేస్తున్నారు.

# సాగుతోన్న.. సాగరమాల పనులు

కోట : కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా చేపట్టిన 34.88 కి.మీ. ఆరు వరుసల సాగరమాల రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకు రూ.961.20 కోట్లతో చేపట్టిన ఈ పనులు రెండేళ్లుగా కొలిక్కి రావడం లేదు. పనులు గత ఏడాది డిసెంబరుకే పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటికి 25% మాత్రమే పూర్తిచేశారు. స్వయంగా కలెక్టర్ పరిశీలించి గుత్తేదారులకు సహకారం అందిస్తున్నా పరుగందుకోవడం లేదు.నాయుడుపేట నుంచి కోట మండలం రుద్రవరం, ఊనుగుంటపాళెం, చెందోడు, గూడలి, నెల్లూరుపల్లి, కొత్తపాళెం, సిద్ధవరం మీదుగా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. 1,300 మంది రైతుల నుంచి 730 ఎకరాల భూములు సేకరించగా 630 ఎకరాలకు పరిహారం ఇచ్చారు. మరో వంద ఎకరాలకు చెల్లించాల్సి ఉండగా రైతులు పలుచోట్ల అడ్డుకొంటున్నారు. ఈక్రమంలోనే అధికారులు వారితో మాట్లాడి పలుచోట్ల పరిహారం ఇప్పించారు.

**అదనంగా కల్వర్టులు, వంతెనల నిర్మాణానికి ప్రతిపాదన**

ముందుగా 67 వంతెలు, కల్వర్టులు, చప్టాలు నిర్మించేందుకు అంచనాలు వేయగా 2023, 2024లో వచ్చిన భారీ వర్షాల కారణంగా పొలాలు ముంపునకు గురయ్యాయి.

దీంతో ఇరిగేషన్ అధికారులు వంద సంవత్సరాల వర్షపాతం వివరాలు తీసుకొని అదనంగా మరో 97 కల్వర్టులు, వంతెనలకు ప్రతిపాదించడం, డిజైన్ మార్పుల నేపథ్యంలో ప్రతిబంధకం ఏర్పడింది.

**వేగవంతం చేస్తున్నాం: ప్రసాద్, నేషనల్ హైవే అధికారి**

సాగరమాల రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నాం. రైతుల పరిహారం సమస్యతోపాటు మట్టి నిల్వల సమస్యలున్నాయి. డిజైన్ మార్పులతో కొంతవరకు జాప్యం జరిగింది. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

# గుండె దడ

నంద్యాల : " దీబగుంట్లకు చెందిన మద్దమ్మకు ఉదయం ఛాతీనొప్పి రావడంతో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికొచ్చారు. ఆమెకు గుండె సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రథమచికిత్స చేసిన అనంతరం కర్నూలుకు రెఫర్ చేశారు. వృద్ధుడైన ఆమె భర్త ఇద్దరు చిన్నపిల్లలతో కర్నూలులోని సర్వజన ఆసుపత్రికి చికిత్సకు 108లో వెళ్లారు."గుండెజబ్బుతో బాధపడుతూ జిల్లా కేంద్రం ఆసుపత్రికొస్తున్న రోగులను బయటకు పంపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యం అందక కర్నూలు లేదా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

**నిత్యం 30 మంది వరకు**



నంద్యాల సర్వజన ఆసుపత్రిలో రోజూ ఓపీ 1000 నుంచి 1200 వరకు ఉంటోంది. గుండె సమస్యలతో బాధపడే వారు 30 మంది వరకు వస్తున్నారు. యాంజియోగ్రామ్, స్టంట్, బైపాస్ సర్జరీ చేయించడానికి కర్నూలు లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోజూ 10 నుంచి 15 మంది గుండె సంబంధిత రోగులు చికిత్స పొందుతున్నారు. అత్యవసర సమయంలో రోగులు కర్నూలుకు వెళ్లాలంటే 80 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఇలాంటి వారు నిత్యం 5 నుంచి 8 మంది వరకు ఉంటున్నారు.


**క్యాథ్‌ల్యాబ్** ఆసుపత్రిలో కార్డియాలజీకి సంబంధించిన వైద్యుల పోస్టుల కేటాయింపు జరగలేదు. ప్రస్తుతం ఉన్న జనరల్ ఫిజీషియన్ వైద్యులు కనీసం యాంజియోగ్రామ్ చేయాలన్నా క్యాథ్‌ల్యాబ్ ఉండాలి. ఎలాంటి వసతులు ఆసుపత్రిలో లేకపోవడంతో రోగులకు నాణ్యమైన సేవలు అందడం లేదు. పూర్తిస్థాయిలో గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణకు 2డీ ఏకో వంటివి చేయడం లేదు. కొన్ని వైద్య పరికరాలు ఉన్నప్పటికీ పక్కన పెట్టేశారు. దీంతో రోగులకు గుండె వైద్యం ఏమాత్రం అందడం లేదు. **పోస్టుల కేటాయింపు లేదు-డా.వెంకటేశ్వర్లు, ఆర్ఎంవో, జీజీహెచ్, నంద్యాల** ప్రస్తుతం న్యూరో, యూరో, యూరాలజీ, నెఫ్రాలజీ సేవలు మాత్రమే ఉన్నాయి. కార్డియాలజీ సేవలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం రోగులను కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నాం.

# రామా.. కనవేమిరా!

నెల్లిమర్ల : జిల్లాకు జీవనాడి అయిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు రెండడుగులు ముందుకు.. నాలుగడుగులు వెనక్కిలా ఉన్నాయి. రెండు దశాబ్దాలైనా ఇప్పటికీ దీని నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదు. 2005లో అప్పటి ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రూ.220 కోట్లతో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టింది. 2008 నాటికి లక్ష్యంగా పెట్టుకుంది. పరిహారం, పునరావాసం సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ రూ.281 కోట్లు ఖర్చు చేయగా, అందులో భూసేకరణకే రూ.201 కోట్లు వెచ్చించారు. అంటే కేవలం రూ.80 కోట్ల పనులే జరిగాయి.

**ముంపు గ్రామాల పరిస్థితేంటి?**

గత ప్రభుత్వం ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా ఏటీ.అగ్రహారం, కోరాడపేట, పడాలపేటను గుర్తించి, భూసేకరణ చేపట్టి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఏటీ.అగ్రహారంలో 300 ఎకరాలు, కోరాడపేటలో 180 ఎకరాలకు ప్రభుత్వ ధర ప్రకారం ఎకరాకు రూ.1.50 లక్షల చొప్పున చెల్లించారు. ఏటీ.అగ్రహారంలోని 592 మంది నిర్వాసితులను పీడీఎఫ్ సభ్యులుగా గుర్తించి, ఒక్కొక్కరికీ రూ.6.75 లక్షల పరిహారం, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికీ పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండానే పనులు ప్రారంభించారు.



కోరాడపేటకు నెల్లిమర్లలో 16 ఎకరాల ఇళ్ల స్థలాలు, పడాలపేటలో 30 ఎకరాల భూమి, 10 కుటుంబాలకు పీడీఎఫ్ పరిహారం ఇవ్వాలి.

**సారిపల్లికి ప్యాకేజీ ..**

ప్రాజెక్టు నిర్వహణకు సారిపల్లి గ్రామానికి చెందిన 2100 ఎకరాల భూమి సేకరించారు. ఈ గ్రామంతో పాటు కుదిపి, నీలంరాజుపేటలకు చెందిన 1400 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5.50 లక్షలు పీఏఎఫ్ (ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్) పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదించారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు.

**రూ.3 కోట్లు కోర్టులో జమ**

ప్రాజెక్టుకు సంబంధించిన సర్ప్లస్‌వేర్ నిర్మాణానికి 15.41 ఎకరాలు సేకరించారు. ఇందుకు 58 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.3 కోట్ల నిధులను కోర్టులో జమ చేశారు. సకాలంలో వారు తీసుకోకపోవడంతో ఇలా జమచేశామని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇటీవల ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణ పనులకు రూ.68 కోట్లు మంజూరు చేసింది. వీటితో గుర్ల అనందపురం వద్ద బ్యారేజీ, రిజర్వాయర్‌కు మళ్లింపు కాలువ పనులు చేస్తున్నారు. **గడువులోగా పూర్తి చేస్తాం.. :** తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తాం. ప్రస్తుతం బ్యారేజీ, మళ్లింపు కాలువ పనులు జరుగుతున్నాయి. నిధులు రాగానే నిర్వాసితుల ప్యాకేజీ అందిస్తాం. అప్పలనాయుడు, ప్రాజెక్టు ఈఈ

# గుజ్జు పరిశ్రమల్లో కొనుగోళ్లు ప్రారంభం

చిత్తూరు : వేసవిలో అందరి దృష్టి మామిడి పైనే. మధుర ఫలానికి జిల్లా పెట్టింది పేరు. జిల్లాలో మామిడి వ్యాపారం మొదలైంది. చిత్తూరులోని యార్డుకు బేనీషా, కాదర్, పుల్లేర, తోతాపురి(బెంగళూర) లైన్ కాయలు చేరుకుంటున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన ఎగుమతిదారులు, వ్యాపారులు రెండ్రోజుల్లో చిత్తూరుకు చేరుకోనున్నారు. ఆవెంటనే ఇతర రాష్ట్రాలకు టేబుల్ రకాలు ఎగుమతి కానున్నాయి. ఆదివారం బేనీషా, కాదర్, పుల్లేరా, తోతాపురి లైన్ కాయలు చేరుకున్నాయని, నాలుగు రోజుల్లో వ్యాపారం జోరందుకోనున్నదని మండీల యజమానులు, వ్యాపారులు వెల్లడించారు.



**సహకరించని వాతావరణం**

జిల్లాలో ఆరు మామిడి గుజ్జు(పల్ప్) పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి. చిత్తూరు, గుడిపాల, పూతలపట్టు ప్రాంతాల్లోని పరిశ్రమల్లో సందడి ప్రారంభమైంది. మామిడి కాయలను యార్డులు సహా ఆయా కంపెనీలకు రైతులు తరలిస్తున్నారు. మిగిలిన పరిశ్రమలు త్వరలో సీజన్‌ను ప్రారంభించనున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయలను నెలాఖరు నుంచి కొనుగోలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా దిగుబడులు తగ్గాయి. ఈ పంట సైతం పెనుగాలులతో కూడిన వర్షంతో కాయలు నేల రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తిరుపతి జిల్లాలోని పాకాల, దామలచెరువు, పుత్తూరు సహా చిత్తూరు, పెనుమూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు తదితర ప్రాంతాల్లో కాయలు భారీగా నేల రాలాయి. కొన్నిచోట్ల ఏనుగులు మామిడి చెట్లు విరిచేశాయి. ఇలా అన్ని విధాలా మామిడి రైతుకు కన్నీళ్లు తప్పలేదు. మరోవైపున ఈ ఏడాది మామిడికి మంచి ధర లభిస్తుందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు.

# కాసులిస్తే 'కట్ట'దిట్టం

శ్రీశైలం : శ్రీశైలం ఆనకట్ట భద్రతకు నిధుల కొరత వెంటాడుతోంది. 15 ఏళ్ల కిందట వరద పోటెత్తడంతో కట్ట దిగువభాగం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురయ్యాయి. మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోవడం శాపంగా మారింది. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు కేంద్రం అమలు చేస్తున్న డ్రిప్ పథకం కింద పైసా రాలేదు. ఒకట్రెండు రోజుల్లో పరిశీలనకు సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రతినిధులు వస్తున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వారిచ్చే నివేదికలతో అయినా ప్రభుత్వాల్లో కదలికొస్తేనే శ్రీశైలం జలాశయం భద్రతకు భరోసా లభిస్తుంది.

**పనికొచ్చే పనులకు పైసా ఇవ్వలే**

2009లో పోటెత్తిన వరదలకు ఆనకట్ట కుడివైపు కొండచరియలు, అప్రోచ్‌రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఆనకట్ట స్పిల్‌వే ఎదురుగా ఉన్న ఏప్రాన్ ముందు దృఢమైన బండపరుపు కొంతవరకు కొట్టుకుపోయింది. వీటిని పునరుద్ధరించాలని అప్పట్లోనే నిపుణులు సూచనలు చేసినా పట్టించుకోలేదు. ః కుడిగట్టు కొండ చరియలకు (ఆనకట్టకు పక్కన) ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. పునరుద్ధరణకు ఇంతవరకు చిల్లిగవ్వ విడుదల చేయలేదు. ః అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ జరిగితేనే మరమ్మతులకు అవసరమైన వస్తువులు, యంత్ర సామగ్రిని ఏప్రాన్ వద్దకు తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది.

**రూ.100 కోట్లు అవసరం**

2009 వరదలకు తీవ్రస్థాయిలో దెబ్బతిన్న శ్రీశైలం ఆనకట్ట భద్రత, పునరుద్ధరణ కోసం రూ.100 కోట్లయినా అవసరం అవుతుంది. కుడిగట్టు వైపు అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణకే రూ.43.60 కోట్లు అవసరమని ఇంజినీర్లు మూడేళ్ల కిందటే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



ఆనకట్ట దిగువన ఏప్రాన్ బలోపేతం, విస్తరణ కోసం మరో రూ.41.30 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. స్పిల్‌వే రక్షణ, కుడి, ఎడమ వైపు కొండ చరియలను సరిచేయడానికి నిధులు అవసరమని కోరారు.

**డ్రిప్.. ఉఫ్**

దేశంలోని అన్ని ఆనకట్టల భద్రత కోసం కేంద్ర జల వనరుల శాఖ 2020లో ఆనకట్టల పునరుద్ధరణ, మెరుగుదల ప్రాజెక్టు (డ్రిప్) పథకాన్ని అమలు చేసింది. శ్రీశైలం ఆనకట్టకు ఇచ్చేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది.

ప్రపంచ బ్యాంకు నిధులొస్తాయని 2020లో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కింద అకౌంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ నిపుణుల కమిటీ ప్రతినిధులు 2021, 2022లో రెండుసార్లు శ్రీశైలం ఆనకట్టను సందర్శించి నివేదికలు సిద్ధం చేశారు. వాటి ప్రకారం ఆనకట్ట ఇంజినీర్లు ప్రతిపాదనలు సమర్పించారు. ఇంతవరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.

# పర్యావరణ హితం.. ఉపాధికి ఊతం



అనంతపురం : నగర, పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణకు అడుగులు పడుతున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు స్వయం ఉపాధికి ఊతమిస్తూనే పర్యావరణ హితానికి నాంది పలుకుతున్నారు. ఇంధన రహిత వాహనాలతో ఉపాధికి ఊతమిస్తున్నారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాలను బ్యాంకు ద్వారా కంతుల వారీగా చెల్లించే విధానానికి శ్రీకారం చుట్టారు. నగరం, పట్టణాల్లోనే ఎక్కువగా డిమాండ్ ఉండటంతో జనాభా ప్రాతిపదికన లక్ష్యం నిర్దేశించారు. మహిళలు, వారి కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ర్యాపిడో సంస్థతో సీఎం చంద్రబాబు, మెప్మా మిషన్ డైరెక్టరు తేజ్ భరత్ సమక్షంలో ఇటీవల అవగాహన ఒప్పందం చేసుకున్నారు. వారికి మాత్రమే కొన్ని ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు కల్పించారు.

సొంతంగా ఆటోలు, ద్విచక్రవాహనం నడపడం కంటే ఇలా సంస్థకు అనుసంధానంగా ఉంటే సుస్థిరమైన, స్థిరమైన ఉపాధి పొందుతారనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అర్హులైన వారిని ఎంపిక చేసే బాధ్యతను అనంతపురం నగరంతోపాటు ఇతర పట్టణాల్లో మెప్మా విభాగం సిబ్బందికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే గుంతకల్లులో ఒక లబ్ధిదారు ఆటో పొంది ఉపాధి పొందుతున్నారు.

**ప్రయోజనం ఇలా..**

మూడు నెలల పాటు ర్యాపిడో మొబైల్ అప్లికేషన్స్ ఛార్జీలు రూ.3 వేలు మాఫీ చేశారు. ద్విచక్రవాహనం, ఆటో ద్వారా రోజుకు 9 గంటలు లాగిన్‌తో ర్యాపిడో ఫ్లాట్‌ఫాం వాడుకొని 300 రైడ్ అభ్యర్థనల్లో కనీసం 150 అభ్యర్థనలు పూర్తి చేస్తే నెలకు రూ.1,000 నెలవారీ ఈఎంఐ మద్దతు అందిస్తారు.

రుణం మొత్తం చెల్లించేలోపు ద్విచక్రవాహనం అయితే రూ. 27వేలు, ఆటోకు రూ.50 వేల వరకు ప్రయోజనం ఒనగూరుతుంది.

బ్యాంకు రుణం మహిళల పేరుతో ఇస్తారు. బీ సదరు మహిళకు డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే కుటుంబంలో డ్రైవింగ్ లైసెన్సు ఎవరికైనా ఉంటే బ్యాంకు ద్వారా రుణం పొందొచ్చు.

ద్విచక్రవాహనం రూ.1.21 లక్షలు రూ.1.23 లక్షలు, ఆటో రూ.3.35 లక్షలు, రూ.3.60 లక్షల మోడల్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

బ్యాంకు రుణాన్ని నెలకోసారి చొప్పున ద్విచక్ర వాహనానికి 3 నుంచి 5 సంవత్సరాలు, ఆటోకు 5 నుంచి 7 సంవత్సరాల్లో చెల్లించవచ్చు. రోజుకు ద్విచక్ర వాహనంతో 100 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.14,600, ఆటో ద్వారా రోజుకు 130 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.17 వేలు వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చితే ఉపాధి పొందవచ్చు. ఇంకా ఎక్కువ సమయం, కిలోమీటర్లు వెళితే ఆ మేరకు ఉపాధి పొందొచ్చు.

# 517 చెరువులు.. 5.609 టీఎంసీలు



అనంతపురం : మూడు నెలలుగా భానుడి ఉగ్రరూపంతో విలవిల్లాడిన ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వరుణుడు ముందస్తుగా కరుణించడంతో చల్లని గాలులు వీస్తున్నాయి. వారం పది రోజుల్లో రుతు పవనాలు జిల్లాలో ప్రవేశిస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. ఆ లోపే అకాల వర్షాలు కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. అనేక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పారుతున్నాయి. చెరువులకు కొత్త నీరు చేరుతుండటంతో 'జలకళ'లాడుతున్నాయి. ఎగువన కర్ణాటకలోనూ అకాల వర్షాలొస్తున్నాయి. ఆ నీరు సైతం దిగువన ఉమ్మడి అనంత జిల్లాలోకి ప్రవేశిస్తోంది. దీంతో ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు వేగంగా చేరుతోంది.

**1.23 లక్షల ఎకరాల ఆయకట్టు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,484 చెరువుల కింద 1,22,529 ఎకరాల ఆయకట్టు ఉంది. అనంత జిల్లాతో పోల్చితే శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా చెరువులు ఉన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు జిల్లాల్లోనూ 49 చెరువులు పూర్తిగా నిండి మరువ పారుతున్నాయి. మరో 30 చెరువుల్లోకి 75 శాతం మేర నీరు చేరాయి. 66 చెరువులు యాభై శాతం నిండాయి. ఇరవై ఐదు శాతం నిండిన చెరువులు 372 ఉండగా.. అసలు చుక్కనీరు చేరని చెరువులు 967 ఉండటం విశేషం. ఉమ్మడి జిల్లాలో మొత్తం 517 చెరువుల్లో 5.609 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నీటి ఎద్దడితో సతమతం అవుతున్న తరుణంలో వాన నీరు చెరువుల్లో నిల్వ ఉండటంతో భూగర్భ నీటిమట్టం పెరుగుతోంది. అనంత జిల్లాలో నీటి మట్టం సగటున 11.15 మీటర్లకు చేరింది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.67 మీటర్లలో ఉంది. ఇక అనంత జిల్లాలో ఏప్రిల్‌లో 11.9 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 64.95 మి.మీ. నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.26 మి.మీ.కిగాను 40.71, ప్రస్తుత నెల్లో 15.51 మి.మీ.కి 69.84 మి.మీ. కురిసింది. రెండు జిల్లాల్లోనూ భూగర్భ నీటిమట్టం కొద్దిమేర పెరిగింది.

**అనంతలో ఎక్కువ..**

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా చూస్తే ఎక్కువగా అనంత జిల్లాలోనే వాన పడింది. వంద శాతం నిండిన చెరువులు 35 ఉంటే.. శ్రీసత్యసాయి జిల్లాలో 14 ఉన్నాయి. అనంత జిల్లా పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, పెద్దవడుగూరు, రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ, యాడికిలో ఒక్కొక్క చెరువు, విడపనకల్లు, బెళుగుప్పలో రెండ్రెండు, గుత్తిలో నాలుగు, పామిడిలో ఆరు, గుంతకల్లు, వజ్రకరూరులో ఏడు చెరువుల ప్రకారం నిండాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తనకల్లు, ముదిగుబ్బ, కొత్తచెరువులో ఒక్కొక్క చెరువు, ధర్మవరంలో ఐదు, నల్లచెరువులో ఆరు చెరువులు భర్తీ అయినట్లు ఆన్‌లైన్ నివేదిక చెబుతోంది.

# అక్రమాలు నిగ్గు తేల్చండి




చిత్తూరు : జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వద్ద సీసీగా బాధ్యతలు నిర్వర్తించిన సురేంద్రరెడ్డి అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.. వైకాపా హయాంలో అన్నీ తానై వ్యవహరించి ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన నేపథ్యంలో ఆయనపై అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని విశ్రాంత ఎంపీడీవో కనకరాజుల నాయుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సారథ్యంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు రంగంలోకి దిగి విచారణ చేపట్టనున్నారు. సురేంద్రరెడ్డి ప్రస్తుతం జీడీనెల్లూరులో ఏవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. జడ్పీలో అన్నీ తానై వ్యవహరించి ప్రశ్నించిన ఉద్యోగులను సస్పెండ్ చేయించడం.. జిల్లాలో దూరప్రాంతాలకు బదిలీ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఆరోపణలు వచ్చిన, బదిలీ అయిన, సస్పెండ్ అయిన తదితర కారణాలను ఎదుర్కొంటున్న ఉద్యోగులకు సంబంధించి 300 పైగా దస్త్రాలు కనిపించకపోవడం, కొందరు ఉద్యోగుల ఎస్ఆర్‌లు తదితర ముఖ్యమైన దస్త్రాలు మాయమవడం వెనుక అతడి హస్తం ఉందని నాటి సీఈవో గ్లోరియా విచారణలో తేలడంతో అతడిని ఇక్కడి నుంచి పంపేశారు. జడ్పీ కార్యాలయంలో ఏవోలు, సిబ్బంది ఆయా విభాగాల్లో ఏమి చేస్తున్నారు, వారితో ఎవరు మాట్లాడుతున్నారని తెలుసుకునేందుకు ప్రతి సెక్షన్‌లో, ఆవరణంలో 36 నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. జీడీనెల్లూరు వెళ్లినా తన మొబైల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీ అనుసంధానం చేసుకుని పర్యవేక్షిస్తూ అడ్డంగా దొరికిపోవడంతో అతడిపై తీవ్ర చర్యలకు ఉపక్రమించారు. సస్పెన్షన్ వరకు వెళ్లడంతో హుటాహుటిన వాటిని తొలగించాడు. ఆపై జరిగిన విచారణలో అతడు దాచిపెట్టిన 300 పైగా దస్త్రాలు, ఎస్ఆర్‌లు తిరిగి అప్పగించడంతో అందరూ నివ్వెరపోయారు.

**మళ్లీ వచ్చేందుకు యత్నం..?**

జడ్పీ కార్యాలయం నుంచి వెళ్లిపోయిన అతడు మరోసారి అదే పోస్టులో పనిచేయాలని ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని సమాచారం. సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందేందుకు సీనియారిటీ జాబితాలో ఉన్నాడు. అతడు ఎక్కడ పనిచేసినా అక్కడ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులతో ఘర్షణ పడేవాడని సమాచారం. అతడిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పీఆర్ కమిషనర్ కృష్ణతేజ తాజాగా ఆదేశించడంతో నాటి వైకాపా హయాంలో జడ్పీలో ఇంకెన్ని అక్రమాలు వెలుగు చూస్తాయనేది వేచిచూడాల్సిందే.

# పెన్నాలో పంటల సాగు

తాడిపత్రి : గత వైకాపా ప్రభుత్వంలో పెన్నానదిలో భారీగా ఆక్రమణలు జరిగాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలువురు నదిని ఆక్రమించి హద్దులు వేసి ఇసుకను అమ్ముకుని లక్షలు గడించారు. ఈకోవలోనే నది ఆక్రమించి పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో సుమారు 64 కి.మీ.ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. తాడిపత్రిలో 24 కి.మీ.లు కిలోమీటర్ వెడెల్పులో నది విస్తరించి ఉంది. కొన్నాళ్లుగా ఆక్రమణలు జరగడంతో ప్రస్తుతం నది వంద మీటర్లు కూడా లేని పరిస్థితి ఉంది. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె, నందలపాడు, చిన్నపొలమడ గ్రామాల్లో భారీగా పంటలను సాగు చేశారు. ప్రధానంగా మామిడి, సపోటా, వరి, అల్లనేరేడు తదితర పంటలను సుమారు ఏడు వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వాస్తవానికి మూడు మండలాలకు సంబంధించి వెయ్యి ఎకరాలకు పైగానే ఉంటుందని ఆయా మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిని ఏళ్ల తరబడి ఇటు నాయకులు, అటు అధికారులు చూస్తున్నా ఎటువంటి చర్యలు లేవని వారు వాపోయారు.



మరోవైపు ఇసుక మాఫీయా కూడా చెలరేగిపోతోంది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నదిలో తవ్వకాలు చేపడుతున్నారు. ఒక వైపు నదిలో తవ్వకాలు, మరో వైపు పంటల సాగుతో నది ఉనికి కోల్పోతోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

**నోటీసులు అందించాం**

రజాక్‌వలి, తహసీల్దార్, తాడిపత్రి

తాడిపత్రి పరివాహక ప్రాంతంలో పెన్నానది ఆక్రమించిన విషయం తెలిసిందే. దీనిపై లోకాయుక్తా కూడా చర్యలు తీసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా తాము కూడా నదిని ఆక్రమించి సాగు చేస్తున్న వారు, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. నదిలోని ఆక్రమణలను అరికట్టి వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

# చేతులు కలిపారు.. కొండను కరిగించారు

రేణిగుంట : రహదారికి మట్టి అమ్మకాల పేరిట కొండలనే మాయం చేస్తున్నారు అక్రమార్కులు. గతంలో వైకాపా నేతలు అక్రమంగా తవ్వకాలు జరిపి అమ్మకాలు చేపడితే ఇప్పుడు అదే వర్గంతో చేతులు కలిపారు స్థానిక నేతలు. రేణిగుంట మండలం కరకంబాడి కేంద్రంగా పెద్దఎత్తున దందా జరుగుతున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కరకంబాడి సమీపంలోని మల్లెమడుగు వెనక శేషాచల కొండలున్నాయి. స్థానికంగా జాతీయ రహదారుల పనులు ఊపందుకోవడంతో 2022 నుంచి వైకాపా నేతలు పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టి మట్టి విక్రయించారు. కొద్దికాలంగా స్థానిక నేతలు కొండపై పెత్తనం తీసుకున్నారు. ఇందులో అప్పటికే బలంగా పాతుకుపోయిన వైకాపా నేతలతో కలిసి దందా కొనసాగించాలని నిశ్చయించారు. ఏకంగా కొండనే కనుమరుగు చేసేశారు. గతంలో స్థానిక రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కందకాలను సైతం పూడ్చివేసి పనులు సాగిస్తున్నారు. ముఖ్యంగా



రోడ్డుపై టిప్పర్ల హల్‌చల్‌తో ప్రజలు హడలిపోతున్నారు. స్థానిక దారులు ధ్వంసమవుతున్నాయి. వాటి అతివేగంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి.

**తెరవెనుక ఆ ఇద్దరు...**

మట్టి తవ్వకాల వెనుక నియోజకవర్గ నేతకు చెందిన ఇద్దరు అనుచరులు ఉన్నట్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఏఅధికారులూ ఇటువైపు రాకుండా సామదాన దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. మట్టి తరలింపుపై సంబంధిత అధికారులను వివరణ కోరగా తవ్వకాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బదులిచ్చారు.

**నెలకు రూ.1.80 కోట్ల అక్రమ సంపాదన**

రోజూ రాత్రివేళల్లో పెద్దఎత్తున టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. దీంతో ఒకప్పుడు కొండ ఉండగా ఇప్పుడు అక్కడ లోయలు కనిపించేలా ఆ ప్రాంతం తయారైంది. టిప్పర్‌కు రూ.10 వేలకు పైగానే వసూలు చేస్తుండగా సగటున రోజుకు సుమారు రూ.6 లక్షలు నెలకు రూ.1.80 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు అంచనా.

# తీపి తక్కువ.. పోషకాలెక్కువ

ఆళ్లగడ్డ: బాల్యం బక్కచిక్కుతోంది..పోషకాహార లేమితో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఆహారం ఆరోగ్యకరంగా, బలవర్ధకంగా ఉండేలా చర్యలు చేపట్టింది. వచ్చే నెల నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,558 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 6 నెలల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 2,71,588 మంది వరకు ఉన్నారు. వీరిలో 3-6 ఏళ్ల చిన్నారులకు అల్పాహారంగా ఉడికించిన కోడిగుడ్డు, 100 ఎం.ఎల్. పాలు, మధ్యాహ్నం పప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లు ఇస్తున్నారు.

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నుంచి మూడేళ్ల పిల్లలను ఒకే సమూహంగా పరిగణించేవారు. ప్రస్తుతం వారిని 6 నుంచి 12 నెలలు, 12 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులుగా రెండుగా విభజించారు.

3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో రెండు మార్లు ఎగ్‌ఫ్రైడ్ రైస్ అందించనున్నారు. ఉదయం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు అందించే బాలామృతంలో తీపి శాతాన్ని తొలగించనున్నారు. ఈ మార్పును అమలు చేసే కార్యక్రమంలో భాగంగా మొదట ప్రతి జిల్లాకు ఓ కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బి.క్యాంప్ ప్రాజెక్టులోని ఒక కేంద్రాన్ని ఎంపిక చేశారు.

చురకలు



# నెగ్గేనా.. తగ్గేనా?

ఎలమంచిలి : ఎలమంచిలి మున్సిపాలిటీలో మంగళవారం అవిశ్వాస సమావేశం నిర్వహించడానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. నర్సీపట్నం రెవెన్యూ అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై అవిశ్వాసం తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్‌కు వైకాపా కౌన్సిలర్లు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఈనెల 22న మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం నిర్వహణకు కౌన్సిలర్లకు లేఖలు పంపారు. ఎలమంచిలి మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు ఉండగా ఒకరు తెదేపా, ఒకరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు. మిగిలిన 23 మంది వైకాపాకు చెందినవారు. ఛైర్‌పర్సన్‌గా రమాకుమారి అప్పట్లో వైకాపా బీఫామ్‌తో ఎన్నికయ్యారు. ఇటీవల ఆమె ఆ పార్టీని వీడి భాజపాలో చేరారు. అప్పటి నుంచి వైకాపా కౌన్సిలర్లు ఆమెను పదవి నుంచి తప్పించాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల వీరిలో వైకాపాకు చెందిన 18 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ అధికారులకు వినతులు ఇచ్చారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన చ్చిన రోజునే రమాకుమారి వర్గీయులు వైకాపాకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లను ఊటీలో శిబిరానికి తరలించారు. అప్పటి నుంచి వారు విహారయాత్రల్లో ఉన్నారు. మరో వైకాపా కౌన్సిలర్ ఆమెకు బంధువు. తెదేపా కౌన్సిలర్ ఇప్పటికే మద్దతు




ఇస్తున్నారు. ఇలా ఎనిమిది మంది ఆమెకు మద్దతుగా ఉన్నట్లు తెలిసింది. అవిశ్వాసంలో వైకాపా కౌన్సిలర్లు గెలవాలంటే మూడింట రెండువంతుల మెజార్టీ ఉండాలి. 25 మందిలో 17 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఉండాలి. ఇప్పుడు వైకాపా వద్ద 14 మంది ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సమావేశానికి వైకాపా కౌన్సిలర్లు హాజరవుతారా? లేదా? అనేది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

**మున్సిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు:** ఉదయం పది గంటలకు అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నామని కమిషనర్ ప్రసాదరాజు చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ముందస్తు చర్యగా బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ధనుంజయరావు చెప్పారు.

# పొలాల్లో సాగునీటి గలగల!

అచ్యుతాపురం : అప్పులు చేసి.. పెట్టుబడులు పెట్టి.. ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేసే రైతాంగానికి కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సాగుకు అవసరమయ్యే వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు కనెక్షన్ల కోసం నిధులు విడుదల చేసింది. తద్వారా జిల్లాలో వందల మందికి మేలు జరగనుంది.

విద్యుత్తు బోర్ల కింద జిల్లాలోని పలుప్రాంతాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు కురిసినా కురవకపోయినా, ఉన్నంతలో సాగు చేపట్టేందుకు ఇవి ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ప్రస్తుతం రోజూ పగటి వేళల్లో తొమ్మిది గంటలపాటు సాగుకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, ఆరుతడితోపాటు కొబ్బరి, మామిడి, జీడి తదితర పంటలను అధికంగా బోర్లే ఆదుకుంటున్నాయి. జిల్లాలో మొత్తం 45,235 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటికింద దాదాపు 90 వేల ఎకరాల వరకు పంటలు సాగవుతున్నాయి. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లు వ్యవసాయ కనెక్షన్ల జారీకి ముందుకురాలేదు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం ముందుకొచ్చింది. మండువేసవిలో రైతులకు తీపికబురు చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 50 వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయనుంది. జిల్లాలో 500 కనెక్షన్లకు అవకాశం లభించనుంది. ఇవన్నీ గడిచిన మూడు నెలలకు సంబంధించినవి మాత్రమే. ఇందుకోసం సుమారు 165కు పైగా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. ఆ మేరకు దాదాపు రూ. 4.2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.



దరఖాస్తు చేసుకున్న రైతుకు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో మూడు కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఆ మేరకు గరిష్ఠంగా మూడు స్తంభాల వరకు ఉచితంగా ఇస్తారు. పరిమితి దాటితే అదనంగా వేసే స్తంభాల భారానికి రైతులే ఫీజు చెల్లించాలి. ఇలాంటి పరిస్థితి ఎక్కడోగానీ వచ్చే అవకాశం ఉండదు. ఒక్కో రైతు 5 హార్స్‌పవర్ మోటార్లను వినియోగించుకునే అవకాశం ఉంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో వందల మంది రైతులకు ఎంతో మేలు జరగనుంది.

**నెలరోజుల్లో పూర్తి**

ప్రస్తుతం వచ్చిన ఆదేశాల ప్రకారం జిల్లాలో 500 మంది రైతులకు కొత్తగా కనెక్షన్లు ఇవ్వనున్నాం. ఇవన్నీ కూడా ఫిబ్రవరి నుంచి గడిచిన రెండు మూడురోజుల కిందట వరకు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందిన రైతులకు సంబంధించినవే. దీని ద్వారా వారందరికీ లబ్ధి చేకూరనుంది. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను నెలరోజుల్లో పూర్తి చేసి విద్యుత్తు కనెక్షన్లు ఇస్తాం.

జి.ప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ

# అందని జీతాలు.. ఉక్కిరిబిక్కిరిలో జీవితాలు



విశాఖపట్నం : ఉక్కు ఉద్యోగులకు పూర్తిస్థాయిలో జీతాలందక నానా పాట్లు పడుతున్నారు. తమ మొర ఆలకించాలని యాజమాన్యానికి విన్నవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారీ ప్యాకేజీ ప్రకటించింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని, మూడు బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)లు అందుబాటులోకి తెచ్చి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు ముడిసరకు, బ్యాంకు రుణాలు, ఇతర నిర్వహణ పరమైన అంశాలకు కొన్ని నిధులు సర్దుబాటు చేశారు. కానీ, కీలకమైన మానవ వనరులకు జీతభత్యాలు చెల్లించడం విస్మరించారన్న విమర్శలొస్తున్నాయి.


**ప్యాకేజీ నిధులు ఇలా:** ఎన్డీఏ కూటమి స్టీలు ప్లాంటుపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో రూ.11,400 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించింది. ఈ నిధులు, ఉక్కు ఉత్పత్తుల అమ్మకాల సొమ్ములతో తొలుత బ్యాంకుల్లో ఉన్న అప్పులను రూ.18 వేల కోట్ల నుంచి రూ.11,500 కోట్లకు తగ్గించారు. గుత్తేదారులకు, ముడిసరకు నిమిత్తం చెల్లింపులు చేశారు. ఆ బకాయిలను రూ.17 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లకు తీసుకొచ్చారు. మరో వైపు 1,200 మంది ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా వారికి రూ.450 కోట్ల వరకూ చెల్లించారు. కానీ, ఉద్యోగుల జీతాలకు, ఇతర చెల్లింపులకు సంబంధించి రూ.1,400కోట్లు పెండింగ్ పెట్టారు.

**ఇలాగైతే ఎలా?:** బ్లాస్ట్ ఫర్నేస్-3ని మే నెలాఖరుకు లేదా జూన్ మొదటి వారంలో ప్రారంభించాలని ప్రణాళికలు చేస్తున్నారు. ప్యాకేజీ నిధులు ఇంత ఖర్చు చేస్తున్నా.. ఇప్పటి వరకు కోకోవెన్, సింటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించలేదు. యంత్రసామగ్రి, విడిభాగాలకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. ఇందులో సుమారు 50 కూలింగ్ ప్లేట్స్ మార్చాల్సి ఉంది. ఇవి జర్మనీ నుంచి దిగుమతి చేసుకోవాలి. ఇవన్నీ సరి చేయకుండా హడావుడిగా బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభించడం సాధ్యమేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉక్కులో కొన్ని పోస్టులు ఖాళీగా ఉండటంతో కీలక నిర్ణయాలు తీసుకునే అధికారులు కరవయ్యారు. ఇవన్నీ అధిగమిస్తేనే పూర్తిస్థాయి ఉత్పత్తి సాధ్యమవుతుందని కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

**ఏప్రిల్ కూడా కలిపితే..**

ప్లాంటులో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 10,500కు చేరింది. ప్రతి నెలా వీరికి సుమారు రూ.70 కోట్లు జీతభత్యాలుగా చెల్లించాల్సి ఉంది. గతేడాది సెప్టెంబర్ నెలకు సంబంధించి 50 శాతం, అక్టోబర్ (35%), నవంబరు (35%), డిసెంబరు (35%), ఈ ఏడాది జనవరి (25%), ఫిబ్రవరి (25%), మార్చిలో 25శాతం చొప్పున 230 శాతం జీతాలు పెండింగ్‌లో ఉంచారు. మరికొన్ని రోజులు గడిస్తే ఏప్రిల్ నెల జీతాలివ్వాలి. అవి కూడా కలిపితే 330 శాతం ఇవ్వాల్సి ఉంటుంది. 'పిల్లలకు ప్రస్తుతం పరీక్షలు ముగిశాయి. తర్వాతి తరగతుల్లో చేరేందుకు ఫీజులు చెల్లించుకోవాలి. ఒక నెల జీతమైనా ఇవ్వండి' అంటూ మొత్తుకుంటున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న రెండు బీఎఫ్‌ల నుంచి ఉద్యోగ, కార్మికులు ప్రస్తుతం రోజుకు 14 వేల టన్నుల ఉత్పత్తి తీస్తున్నారు.

# ఈ-వ్యర్థం వదిలించుకుందాం...



గాజువాక : పర్యావరణానికి హాని చేస్తున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వ్యర్థాల) సేకరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19 నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగరాల్లో పకడ్బందీగా వీటిని సేకరించాలని నిర్ణయించింది. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సేకరించిన వ్యర్థాలను రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) చేస్తారు. విశాఖ జిల్లాలో గాజువాకలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ముందు ప్రజల్లో అవగాహన**

'స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'ఈ-చెక్ థీం' పేరుతో ఈ-వ్యర్థాల (ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల) సేకరణ జరగనుంది. ముందు ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల నష్టాలను వివరిస్తారు. పబ్లిక్ హెల్త్, యూసీడీ విభాగాలు ఈ విషయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళతాయి.

**వాటితో నష్టాలివీ..**

ఈ-వేస్ట్‌లో ఉన్న లెడ్, మెర్క్యూరీ, కాడ్మియం వంటి విష పదార్థాలు నేల, నీటిలోకి చేరి పర్యావరణానికి హాని కలిగిస్తాయి.

ఈ వ్యర్థాలను బహిరంగంగా దహనం చేయటం వల్ల హానికరమైన వాయువులు విడుదలై గాలిలో కలిసి ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతాయి. శ్వాసకోశ వ్యాధులు, న్యూరో, చర్మ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలు పెరుగుతాయి.

**మిస్డ్ కాలు ఇస్తే చాలు**

ఇంట్లో ఈ వ్యర్థాలు పేరుకుపోతే.. ఇంటికి వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వాలి. సిబ్బంది రావడం ఆలస్యమైతే గృహ యజమానులు కేవలం 90307 27277 నెంబరుకు మిస్డ్‌కాల్ చేస్తే వారే వచ్చి ఈ-వ్యర్థాలను తీసుకెళతారు. స్క్రాప్ క్యూ సంస్థ ఈ సేకరణలో భాగస్వామ్యమవుతోంది.

**ఈ వ్యర్థాలు అంటే..**

వాడి పారేసే చరవాణులు
పాత కంప్యూటర్లు
ట్యాబ్‌లు, కేబుళ్లు
బ్యాటరీలు, బల్బులు
టీవీలు, ఇతర కిచెన్ ఎలక్ట్రానిక్స్ వస్తువులు

ట్రిపుల్ ఆర్ విధానంలో..

సేకరించిన ఈ-వ్యర్థాలను రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) చేస్తారు. దీనికోసం గాజువాకలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చినగంట్యాడలోని ఈ కేంద్రానికి ప్రజలు నేరుగా తెచ్చి సిబ్బందికి అందించవచ్చు. ఈ ఆర్.ఆర్.ఆర్. సెంటర్లలో చెత్త నుంచి తిరిగి సంపద సృష్టిస్తారు. తగరపువలస, ఎండాడ, కె.ఆర్.ఎం.కాలనీ, జగదాంబ, మద్రిపాలెం జ్యోతినగర్, చినగంట్యాడలో ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

# నేతలు చక్రం తిప్పితే 'అక్రమం సక్రమమే'!!



విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన భూసమీకరణ పథకాన్ని అడ్డం పెట్టుకొని జిల్లాలో కొందరు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. అనర్హులు కూడా దర్జాగా పరిహార స్థలాలు కొట్టేశారు. నాడు 'ఒక సెంటు' ఇళ్ల కోసం భూసమీకరణ చేపట్టగా డీ పట్టాదారులకు ఎకరాకు 900 గజాలు, ఆక్రమణదారులకు 450 గజాలు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేలా నిర్ణయించారు. చాలా మందికి ఆ స్థలాలతో సంబంధం లేకపోయినా 'ఆక్రమణదారులు'గా అవతారమెత్తారు. అంతే కాదు...రోడ్లకు సమీప స్థలాలు దక్కించుకున్నారు. అర్హులకు మాత్రం కొండలపై స్థలాలు కట్టబెట్టారు. ఇన్ని అవకతవకలు చోటుచేసుకున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. భూసమీకరణ ముసుగులో జరిగిన అక్రమాల గుట్టును రట్టు చేయాల్సిన అవసరం ఉంది.

'ఒక సెంటు' స్థలాల భూ సమీకరణలో పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాల్లో అధికంగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. స్థానిక నాయకులు కొందరు వారనుకున్న స్థలాలపై కన్నేసి దక్కించుకున్నారు. ఇలా సుమారు 30 ఎకరాలు తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు సమాచారం. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో 11 వేల గజాల స్థలాన్ని అక్రమార్కులు కొట్టేశారు. ఇక్కడ 64.63 ఎకరాలు సమీకరించారు. రైతులకు పరిహారంగా అభివృద్ధి చేసిన ప్లాట్లకు 21 ఎకరాలు గుర్తించారు. డీపట్టాదారులుగా 59 మందిని, ఆక్రమణదారులుగా మరికొందరిని పేర్కొన్నారు వాస్తవానికి ఆక్రమణదారులుగా పేర్కొన్న వ్యక్తుల్లో కొందరు అర్హులు కాకపోయినా వారి పేరున 7,305 గజాలు కట్టబెట్టారు. ఇందుకు స్థానిక నేత ఒకరు చక్రం తిప్పారు. 'ఆక్రమణదారుల్లో అర్హులను పక్కన పెట్టేశారు. వెనక్కి తగ్గకపోతే పట్టా భూములకు కూడా పరిహారం అందదని బెదిరించి మరీ లాక్కున్నారు' అనే చర్చ సాగుతోంది. ఆ నేతకు చెందిన అత్త పేరున 450 గజాలు, బావమరిది పేరుతో 2,750, భార్య పేరుతో మరో 450, ఒక సమీప బంధువు పేరున 739, మరొకరి పేరున 2,466, ఇంకొకరి పేరున 450 గజాలు కేటాయించారు. జెర్రిపోతులపాలెం ప్రధాన రోడ్డుకు సమీపంలో మరో స్థానిక నేత 2,400 గజాల వరకు అలాగే తన పరం చేసుకున్నారు. అదే గ్రామంలోని ఓ రైతుకు చెందిన స్థలాన్ని గ్యాస్ పైపులైను కోసం తీసుకోగా అతనికి చెక్కును అందజేశారు. అందులోని కొంత స్థలాన్ని ఒక సెంటు స్థలాలకు అప్పగించగా పరిహారం అతనికి దక్కకుండా నేతల పేరుతో కొట్టేసినట్లు సమాచారం.

# తవ్వుకో.. దోచుకో మట్టి తవ్వకాలు

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పదిహేను రోజుల క్రితం బాదనహాళ్ శివారు కల్లగుడి సమీపంలో తవ్వకాలు చేసి మట్టి తరలించారు. స్థానికుల ఫిర్యాదుతో తవ్వకాలను ఆపేశారు. వారం గడవక ముందే మరో ప్రాంతంలో తవ్వకాలను కొనసాగిస్తున్నారు. బాదనహాళ్ రైల్వే ట్రాక్ సమీపాన తవ్విన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతం చుట్టూ ముళ్ల కంపలు పెద్దఎత్తున పెరగడంతో లోపలికి వెళ్లేందుకు వీలుకాని పరిస్థితి. నేరుగా వెళ్లేందుకు సరైన దారి లేకపోయినా పడమర వైపు నుంచి కర్ణాటకలోని మాచనహళ్లికి వెళ్లే వైపు చదును చేసి దారి ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి వేళల్లోనే దందా సాగుతోంది. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రెండు, మూడు రోజులుగా సుమారు వంద టిప్పర్లకు పైగా మట్టిని తవ్వి తరలించినట్లు తెలుస్తోంది. **ఇసుక వస్తుందని...** బాదనహాళ్ సమీపంలో లభించే మట్టిలో ఎక్కువ శాతం ఇసుక లభిస్తోంది. దీన్ని నేరుగా వినియోగించడానికి పనికి రాదు. దీంతో మాచనహళ్లి సమీపంలో మట్టి నుంచి ఇసుక తయారు చేసే కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడి వరకు దారిని ఏర్పాటు చేసుకుని.. కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. **పరిశీలించి చర్యలు తీసుకుంటాం-మునివేలు, ఇన్‌ఛార్జి తహసీల్దార్, డి.హీరేహాళ్** ఇటీవల కల్లగుడి సమీపంలో తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో నిలుపుదల చేశాం.

# బాలికా.. చదువుకో ఎంచక్కా!

అనకాపల్లి: బాలికల కోసం ప్రత్యేకంగా నిర్మించిన టైప్-4 కేజీబీవీ వసతిగృహాలు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. వైకాపా హయాంలో విఘ్నాలతో ప్రారంభానికి నోచుకోని ఈ హాస్టళ్లను కూటమి సర్కారు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. వీటితో దూరాభారం వల్ల అమ్మాయిలు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉండదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 19 చోట్ల టైప్-4 వసతిగృహాలున్నాయి. వీటిలో 12 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా వాటిని జూన్ నాటికి పూర్తిచేయనున్నారు.

అమ్మాయిలు అయిదో తరగతి వరకు బాగానే చదువుకుంటున్నారు. ఆరో తరగతికి వచ్చేసరికి మూడు నుంచి ఆరు కి.మీ. దూరానున్న ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి రావడంతో కొంతమంది బడి మానేస్తున్నారు. ఈ సమస్యను గుర్తించి 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం ఈ ప్రత్యేక వసతి గృహాలను మంజూరు చేసింది. దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ఆడపిల్లలకు ఆయా పాఠశాలల ఆవరణంలోనే హాస్టల్ సదుపాయం కల్పించేలా నిర్మాణాలు చేపట్టింది. తీరా వాటిని ప్రారంభించే సమయంలో ప్రభుత్వం మారి వైకాపా సర్కారు గద్దెనెక్కింది. అంతే వీటిని పట్టించుకోకుండా అయిదేళ్లు వృథాగా వదిలేసింది. నాడు-నేడు పథకంలో అవసరం లేని చోట్ల




కూడా రూ. కోట్లు ఖర్చుపెట్టేశారు గాని నిర్మించి సిద్ధంగా ఉన్న బాలికల వసతిగృహాలను వాడుకలోకి తేలేకపోయారు. తాజాగా వీటన్నింటినీ వచ్చే విద్యాసంవత్సరంలో వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వీటి నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, ఇతర సామగ్రితోపాటు మానవ వనరులను సిద్ధం చేస్తోంది.

**ఆరుగురు సిబ్బంది..** ఒక్కో హాస్టల్‌కు ముగ్గురు వంట మనుషులు (కుక్), ఒక వార్డెన్, ఒక కాపలాదారు (చౌకీదార్), పార్ట్‌టైం టీచర్ ఒకరు చొప్పున నియమిస్తున్నారు. టైప్-3 కేజీబీవీ అంటే వసతి, విద్య ఒకేచోట ఉంటుంది. టైప్-4 అంటే వసతి మాత్రమే ఉంటుంది. సమీప పాఠశాలలో విద్య నేర్చుకుంటారు. వసతిగృహంలో చదువు బాధ్యతల కోసం ఒక పార్ట్‌టైం టీచరు ఉంటారని అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడుకు తెలిపారు.

ఒక్కో హాస్టల్‌లో వంద మందికి వసతి.. అనకాపల్లి జిల్లాలో మాకవరపాలెం, బుచ్చెయ్యపేట, జె.నాయుడుపాలెం (రోలుగుంట), డి.ఎర్రవరం (నాతవరం), దార్లపూడి (ఎస్.రాయవరం), రాంబిల్లి, కోటపాడు జిల్లా పరిషత్తు పాఠశాలలు, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టైప్-4 కేజీబీవీలను ఇదివరకే నిర్మించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, పాడేరు, హుకుంపేట మండలాల్లో నిర్మాణాలు పూర్తిచేయగా మరో అయిదుచోట్ల పనులు జరుగుతున్నాయి. ఒక్కో వసతిగృహంలో వందమంది ఆడపిల్లలు వసతి పొందడానికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నారు. ఒక్కో గదిలో నాలుగు పడకలు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలో ఆరు నుంచి 10 తరగతులు, సమీప జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివే అమ్మాయిలు ఇందులో ప్రవేశాలు పొందడానికి అవకాశమిస్తారు. గత అయిదేళ్లు నిరుపయోగంగా ఉండడంతో ఈ భవనాలు పాడైపోయాయి. వాటన్నింటిని మరలా ఇప్పుడు బాగుచేయిస్తున్నారు. పిల్లలకు వండిపెట్టడానికి అవసరమైన సామగ్రిని ఇటీవలే సరఫరా చేశారు.

# గిరిజనుల్లో క్షయ విజృంభణ

విశాఖపట్నం: అంటువ్యాధుల్లో ఒకటైన 'క్షయ'ను సకాలంలో గుర్తిస్తే నివారణ సులభం. గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపం, అవగాహన లేకపోవడం తదితర కారణాలతో మహమ్మారి విజృంభిస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సహకారంతో గీతం వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.రాజ్యలక్ష్మి నేతృత్వంలో జరిగిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ప్రాజెక్టులో భాగంగా గుర్తించిన క్షయ బాధితులను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విశాఖలోని టీబీ ఆసుపత్రికి అనుసంధానం చేసి, చికిత్స చేయించారు. దీంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఫలితాలు కాస్త ఆశాజనకంగా ఉన్నాయి.

**సర్వే జరిగిందిలా:**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని గ్రామాల్లో సర్వే చేశారు. గిరిజనులతో సులభంగా మమేకమయ్యేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన ఏడుగురిని వాలంటీర్లుగా నియమించుకున్నారు.ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ చేశారు. 15 రోజుల కంటే ఎక్కువగా ఎడతెరిపి లేని దగ్గు, జ్వరం, ఆకలి వేయకపోవడం తదితర టీబీ లక్షణాలున్నాయేమో పరిశీలించారు.

మూడు మండలాల్లో అనుమానిత లక్షణాలున్న దాదాపు 1,300 మందికి నాలుగు దఫాలుగా ఛాతీ ఎక్స్‌రే తీయించారు. అందులో 120 మంది క్షయతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిలో ఎనిమిది మంది చిన్నారులే. కొన్ని గ్రామాల్లో తాత్కాలిక ప్రాతిపదికన మొబైల్ ఎక్స్‌రే స్టేషన్ ఏర్పాటు చేశారు. రూ.7 లక్షల విలువైన ట్రూనాట్ మిషన్‌ను హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించి, అక్కడే పరీక్షలు చేశారు. బాధితులందరికీ చికిత్స అందించి, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందజేశారు.

వైద్యానికి వెనుకడుగు: పట్టణ ప్రాంత ప్రజల్లో వ్యాధి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదిస్తారు. సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం, రోజంతా పని పోతుందని, తదితర కారణాలతో గిరిజనులు పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి ఆసక్తి చూపట్లేదు. పోషకాహార లోపం ఉన్నవారిలో క్షయ తీవ్ర రూపం దాల్చుతుంది. చిన్నచిన్న నివాసాల్లో వెలుతురు సరిగా రాకపోవడంతో ఇంట్లో ఒకరికి వ్యాధి సోకితే మిగిలిన వారికి సంక్రమించే అవకాశాలెక్కువ. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజనుల్లో అవగాహన పెరిగిందని జిల్లా అధికారులు ప్రశంసించారు. డా?? సి.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసన్, గీతం వైద్య కళాశాల

# తప్పనున్న అత్యవసర అగచాట్లు

ధర్మవరం : పట్టణాలు, గ్రామాల్లోని ప్రముఖ దేవాలయాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, మహిళా సంఘాల కమ్యూనిటీ భవనాల వద్ద ఉద్యోగులు, ప్రజలకు సరైన మరుగుదొడ్ల వసతి లేక ఒంటికి, రెంటికి నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు ఆ ఇబ్బందులు లేకుండా చేయాలని సంకల్పించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) పథకం కింద కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ (సీఎస్‌సీ) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 147 చోట్ల మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు రూ.4.41 కోట్లు మంజూరయ్యాయి.

**రూ.3 లక్షలతో ..**




జిల్లాలోని ఎంపిక చేసిన 103 ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, డ్వాక్రా సంఘాల కార్యాలయాలు, 29 బీసీ వసతిగృహాలు, 7 అంబేడ్కర్ గురుకులాలు, 8 ఎస్సీ వసతిగృహాల చోట మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క చోట రూ.3 లక్షలతో మూడు మరుగుదొడ్లు, ఒక బాత్రుమ్, లేదా 4 మరుగుదొడ్లు నిర్మించనున్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారుల పర్యవేక్షణలో వాటి నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన జాబితా రూపొందించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి. అనువైన స్థలాలను ఎంపిక చేసి ప్రజలకు ఉపయోగపడేలా వాటిని నిర్మించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా వాటి నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో అధికారులు పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టారు.

**సకాలంలోనే పూర్తి చేస్తాం- మల్లికార్జునప్ప, ఎస్ఈ, ఫామిదా, జేఈ, గ్రా.నీ.శా.** మరుగుదొడ్ల నిర్మాణాల జాబితాను పంచాయతీ కార్యదర్శులకు అందజేశాం. వారు చెప్పిన వెంటనే పనులు మొదలుపెట్టి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం.

# అలిపిరిలోనే.. ఆటంకాలేల?

తిరుపతి : తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తులు అలిపిరిలోని తనిఖీ కేంద్రం వద్ద అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే తిరుమలకు వెళ్లే భక్తుల సంఖ్య గణనీయంగా ఉంటుండగా తనిఖీల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు వాహనాల్లో అలిపిరి తనిఖీ కేంద్ర వద్దకు చేరుకుంటారు. సోమవారం ఉదయం 8.45 నుంచి 11.30 వరకు తనిఖీ కేంద్రం నుంచి గరుడ కూడలి వరకు వాహనాలు బారులు తీరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయాన్నే పలు సేవల్లో పాల్గొనాల్సిన భక్తులు వేళకు అక్కడకు చేరుకోలేకపోతున్నారు. అష్టకష్టాలు పడి సేవా టికెట్లు పొందినప్పటికీ వాటిలో పాల్గొనలేకపోతున్నట్లు మరికొందరు వాపోతున్నారు. కొన్ని రైళ్లు రెండు మూడు గంటలు ఆలస్యం అవుతుండగా తిరుపతి నుంచి తిరుమలకు చేరుకోవడం ఆలస్యమవుతూ బ్రేక్ టికెట్లు జారీ చేసే సమయం సైతం మించిపోతున్నట్లు మరికొందరు వాపోతున్నారు.



**సిబ్బంది సేవలు ఇలా..**

కేంద్రంలో 40 మంది ఎస్పీఎఫ్, 15 మంది విజిలెన్స్ సిబ్బంది ఒక్కో షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తూ ఉంటారు. తనిఖీ నిమిత్తం ఆరు స్కానర్లు ఉన్నాయి. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి తిరుమలకు అనుమతించాల్సి ఉంటుంది. భక్తులను వాహనాల నుంచి కిందకు దింపి వెంట తెచ్చుకున్న లగేజీలను పరిశీలించి ఆ తర్వాత అనుమతిస్తారు. ఇటీవల తిరుమలకు నిషేధిత వస్తువులైన మద్యం, గుట్కా, మాంసాహారం ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలు రవాణా అవుతుండటంతో తనిఖీలు ఆలస్యం అవుతున్నట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై తితిదే ఉన్నతాధికారులు, విజిలెన్స్, ఎస్పీఎఫ్ యంత్రాంగం దృష్టి సారించాలని, సిబ్బంది సంఖ్యను పెంచడంతోపాటు అధునాతన స్కానర్లు మరిన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# మట్టిలో కలిసిన నాలుగు వరుసలు

నందికొట్కూరు : నాలుగు వరుసల రహదారి నాణ్యత నవ్వులపాలైంది. రూ.1,179 కోట్లతో నిర్మిస్తున్న కర్నూలు- గుంటూరు (కేజీ) రహదారి పనులు నాణ్యత తప్పాయి. 66.115 కి.మీ. మేర చేపడుతున్న విస్తరణ పనుల్లో నాణ్యమైన మట్టి వినియోగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ కొట్టుకుపోయింది.. ఇరువైపుల వేసిన మట్టి కట్టలు కోతకు గురయ్యాయి. నన్నూరు నుంచి నందికొట్కూరు వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నన్నూరు టోల్‌ప్లాజా నుంచి జూపాడుబంగ్లా వరకు పరిశీలించగా... వర్షపు నీరు వెళ్లడానికి రోడ్డుకు ఇరువైపుల నిర్మించిన కాల్వలు కొట్టుకుపోయాయి.. సిమెంట్ పనులకు గండి పడింది. మట్టి కట్టకు భారీగా కోత పడింది.

**2023లో పనుల అప్పగింత**

కర్నూలు నుంచి గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు మీదుగా ఆత్మకూరు.. దోర్నాల సెక్షన్ వరకు 66.115 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల 340సి జాతీయ రహదారి పనులు చేపడుతున్నారు. ఫేజ్-1( 35.515 కి.మీ.) కింద రూ.587 కోట్లు, ఫేజ్-2( 30.6 కి.మీ.) కింద రూ.591 కోట్లు కేటాయించారు. 2023 అక్టోబరు 5న గుత్తేదారుకు పనులు అప్పగించారు. అప్పటి నుంచి 730 రోజుల వ్యవధిలో.. 2025 అక్టోబరు 4వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

# ఈశ్రమ్.. ఇదిగో ప్రయోజనం



పుత్తూరు : అసంఘటిత రంగ కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు పెరిగేలా మెప్మా, కామన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రిసోర్స్ పర్సన్ల ద్వారా వివరాలు సేకరిస్తున్నాయి. ఈ మేరకు ఆర్పీలకు ఉచితంగా లాగిన్లు అందించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 1.3 లక్షల నమోదు జరిగేలా ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు.

**ప్రయోజనాలివీ..**

నిర్మాణ, వలస, గృహ, వ్యవసాయ తదితర విభాగాలకు చెందిన కార్మికులు, గిగ్ ప్లాట్‌ఫారం కింద పనిచేసే వేతన జీవులకు చెందిన వివరాలను కేంద్రీకృత డేటాబేస్ ఆధారంగా ఆధార్‌తో అనుసంధానించనున్నారు. వారికి ప్రత్యేక సేవల అమలు, సామర్థ్యాలను మెరుగుపర్చడం, పథకాల అందజేత, సామాజిక భద్రత, ఉపాధి కల్పన, శిక్షణ, సంక్షేమ ప్రయోజనాలు, కార్మిక కోడ్‌ల వర్తింపు, విపత్తుల సమయంలో ఆర్థిక అండ తదితర సదుపాయాలకు ఈ ప్రక్రియ ఉపయోగపడనుంది.

**అర్హులు వీరే..** 18 నుంచి 59 ఏళ్ల మధ్యగల కార్మికులు

అసంఘటిత రంగంలో ఉండాలి

ఈఎస్ఐ, ఈపీఎఫ్‌వోలో సభ్యుడు కారాదు.

ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులు

రిజిస్ట్రేషన్‌కు ఇవి అవసరం..

ఆధార్ కార్డు

దానికి అనుసంధానమైన చరవాణి నంబరు

ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో కూడిన బ్యాంకు ఖాతా

**అర్హులందరినీ చేర్పించాలి..**

అర్హులైన వారందరినీ చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 710 మంది ఆర్పీలకు ప్రత్యేక చెల్లింపులు చేస్తున్నాం. జూన్ 30 నాటికి ఉమ్మడి చిత్తూరులో 1.30 లక్షల మంది నమోదు చేసేలా కార్యాచరణ రూపొందించాం. చేరిన అనంతరం కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డు వస్తుంది. ఏడాది పాటు ప్రమాద బీమా వర్తిస్తుంది. మృతి చెందినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యమైతే రూ.లక్ష అందుతుంది. ఇతర పథకాలు సైతం అర్హులే. రవీంద్ర, పీడీ, మెప్మా, ఉమ్మడి జిల్లా

# రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు చెక్



చిత్తూరు : డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణ వాయిదాల నగదు ప్రతి నెలా సంఘ అధ్యక్షురాలు లేదా సీఏలకు అప్పగిస్తుంటారు. వారు విధిగా ఆ మొత్తాన్ని బ్యాంకుల్లో చెల్లిస్తారు. కొన్నిసార్లు సీఏలు, కొందరు సంఘ సభ్యులు వాటిని సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. కొన్నాళ్లకు విషయం వెలుగులోకి వచ్చినా వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టడం చాలా కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నగదు రహిత సేవలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా స్త్రీనిధి పేమెంట్ యాప్‌ను అందుబాటులోకి తేనుంది. పుంగనూరులో స్వయం సహాయక సంఘాల పేరుతో రూ.32 లక్షలు రుణం తీసుకుని రిసోర్స్‌పర్సన్ అక్రమాలకు పాల్పడిన సంఘటన ఇటీవల వెలుగు చూసింది. తిరిగి చెల్లించకపోవడంతో ఆర్పీ అవకతవకలు బహిర్గతమయ్యాయి.

చిత్తూరు గ్రామీణ మండలం తాళంబేడులో రెండు గ్రామ సమాఖ్యల్లో గతంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు రూ.కోటికి పైగా సంఘమిత్రలు స్వాహా చేశారు. దీనిపై అప్పట్లో కేసులు నమోదయ్యాయి. ఇంకా కోర్టులో కేసు నడుస్తోంది. జిల్లాలో అప్పుడప్పుడూ ఇలాంటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. సంఘ సభ్యులు పసిగట్టి అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు అనేకం. వెలుగులోకి రానివి ఉన్నాయి.

జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 1,247

స్వయం సహాయక సంఘాల సభ్యులు: 35,643

సంఘాల్లోని సభ్యుల సంఖ్య: 3,70,419

2025-26లో స్త్రీనిధి లక్ష్యం: రూ.346 కోట్లు

2024-25లో: రూ.155 కోట్లు

2024-25లో ఇచ్చిన స్త్రీనిధి రుణం: రూ.206 కోట్లు

బ్యాంకు, స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపులను ఆఫ్‌లైన్ పద్ధతిలో బ్యాంకులకు వెళ్లి సభ్యులు చెల్లించేవారు. గతంలో ఆటో డెబిట్, పేటీఎంల ద్వారా కూడా చేసేవారు. కొత్తగా తీసుకురానున్న స్త్రీనిధి పేమెంట్ యాప్‌తో సభ్యులు నెలవారీ వాయిదాలను ఆఫ్‌లైన్‌లో చెల్లించవచ్చు. వెంటనే చరవాణికి సంక్షిప్త సందేశం వస్తుంది. వెలుగు సంఘాల సభ్యులు ఈ యాప్‌ను ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల వారీగా తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదా చెల్లింపులు ఎలా జరుగుతున్నాయనే విషయాన్ని అధికారులు ఈ యాప్ ద్వారా తెలుసుకునే వీలుందని స్త్రీనిధి ఏజీఎం ప్రకాష్ తెలిపారు.

# నాణ్యత లోపం, నిధుల దుర్వినియోగం



చిత్తూరు : రహదారులు, భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) నేతృత్వంలో వైకాపా హయాంలో చేపట్టిన రహదారుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో 2019-24 వరకు అత్యవసర మరమ్మతులు, ప్రత్యేక మరమ్మతులు, నిర్వహణ పేరిట చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని తెదేపా అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గత ఐదేళ్లలో చేపట్టిన 24 రహదారుల నిర్వహణ పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టింది.

**ఈ రికార్డులివ్వండి**

బిడ్ డాక్యుమెంట్, టెక్నికల్ బిడ్-ప్రైస్ బిడ్ ఎవాల్యుయేషన్, రివర్స్ టెండరింగ్ డాక్యుమెంట్.

ఎస్టిమేట్, వర్కింగ్ ఎస్టిమేట్ ఇన్ ఫుల్ షేప్.

అగ్రిమెంట్, సప్లిమెంట్ అగ్రిమెంట్.

ఎంబుక్స్.

క్రాస్ సెక్షన్ బుక్‌లెట్స్, ఎల్ఎఫ్ బుక్స్.

క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్స్ ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోరారు.

పనుల వివరాలు..: చిత్తూరు-పాటూరు వయా ఐరాల రోడ్డు, పత్తికొండ- మామడుగు, తాటిమిట్ట-కీలపట్ల, పలమనేరు-కృష్ణగిరి నుంచి జీవీకే రోడ్డు, కేజీఎఫ్ - బాలేంద్రపల్లి, కోదండరామాపురం-తిరుమలరాజపురం, అరగొండ - మత్యం, పలమనేరు- నెల్లిపట్ల, కుర్మాయిపల్లి-కోనాపల్లె, ఎంసీబీ రోడ్డు నుంచి తంబుగానిపల్లె, పెద్దపంజాణి సత్రం నుంచి కోలాత్తూరు, ఎంబీటీ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు వయా బట్టందొడ్డి, బైపాస్ రోడ్డు నుంచి ఎంసీబీ రోడ్డు వయా చెర్లోపల్లె, నలగాంపల్లె-బండివాండ్లవూరు, చిత్తూరు-గాజులపల్లి, సీజీ రోడ్డు నుంచి ఎంసీబీ రోడ్డు వయా పిల్లయ్యగారిపల్లె, చిత్తూరు-అరగొండ, పుంగనూరు- బైరెడ్డిపల్లె, చిత్తూరు-గుడియాత్తం, చిత్తూరు-అరగొండ నుంచి పాటూరు వయా ఐరాల, పలమనేరు-గుడియాత్తం, చెన్నై-బెంగళూరులో పలమనేరులో బైపాస్ స్ట్రెచెస్ పనులు, కేజీ సత్రం-బంగారుపాళ్యం-మొగిలి వద్ద బైపాస్ స్ట్రెచెస్ పనులు, సరకల్లు-మాధవరం రోడ్డు పనులకు సంబంధించి వివరాలు కోరారు.

# అంచనాలకు మించి ఖర్చు.. బిల్లుల కోసం పట్టు

అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హోటళ్లు, రిసార్ట్‌ల ఆధునికీకరణ పనుల కోసం అంచనాలకు మించి చేసిన నిధుల వ్యయంపై సంస్థ పాలకవర్గం (బోర్డు) ఆమోదం కోసం కొందరు ఇంజినీర్లు యత్నిస్తున్నారు. నిబంధనలకు భిన్నంగా 50% వరకు అదనంగా వెచ్చించి, ఆ మేరకు గుత్తేదార్లకు బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకవర్గం గతంలో ఒకసారి ఈ ప్రతిపాదనలను తిరస్కరించింది. ఈ నెల 23న నిర్వహించే సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వైకాపా ప్రభుత్వంలో రూ.138 కోట్లతో ప్రారంభించిన హోటళ్లు, రిసార్ట్‌ల ఆధునికీకరణ పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. 2024 ఏప్రిల్ నాటికి ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు పూర్తి చేయించి, సంస్థకు అప్పగించాలి. ఇప్పటికీ చాలాచోట్ల పనులు పూర్తి కాలేదు. మరోవైపు అంచనా విలువలను భారీగా పెంచేశారు. విశాఖలో యాత్రీనివాస్ (హోటల్) ఆధునికీకరణ రూ.8 కోట్లతో పూర్తి చేయాల్సి ఉండగా రూ.13.50 కోట్లకు పెంచేశారు. ఉన్నతాధికారుల నుంచి లిఖితపూర్వక ఆమోదం తీసుకోకుండా గుత్తేదారుతో ఖర్చు చేయించారు. గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలోనూ విశాఖ వేదికగా చక్రం తిప్పుతున్న ఒక ఇంజినీరే అంచనా వ్యయం పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. అదనపు మొత్తానికి పాలకవర్గం ఆమోదం కోసం ఆయన చేస్తున్న



ప్రయత్నాలకు పర్యాటకాభివృద్ధి సంస్థలో కొందరు అధికారులు సహకరిస్తున్నారు. తిరుమల కొండపై పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన రెండు రెస్టారెంట్ల ఆధునికీకరణ పనుల్లోనూ అంచనా వ్యయం కంటే రూ.కోటి వరకు పెంచేశారు. దాన్ని కూడా ఆమోదించాలని బోర్డుకు పెడుతున్నట్లు తెలుస్తోంది. అంచనాల్లోనూ ఏపీయూఐఏఎంఎల్ పాత్ర: హోటళ్లు, రిసార్ట్‌ల ఆధునికీకరణ పనులకు అంచనాలు వేయించడానికి పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇంజినీరింగ్ విభాగం పని చేస్తోంది. దాన్ని కాదని పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థ (ఏపీయూఐఏఎంఎల్)కు అప్పగించారు. ఆ సంస్థ ద్వారా వేరొక ఆర్కిటెక్చర్లను తీసుకొచ్చి అంచనాలు వేయించినందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ నుంచి అదనంగా ఫీజులు చెల్లించారు.

# మత్తుకు బానిసలై.. బతుకు భారమై..!

పెదవాల్తేరు : నగరంలో మద్యం, గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్న బాలల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీరిలో 12 నుంచి 17ఏళ్లలోపు వారు అధికంగా ఉన్నారు. ఈ వయసులో మత్తుకు బానిసైతే దాని నుంచి బయటపడడం అంత సులువు కాదని మానసిక వైద్యులు చెబుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేని పిల్లలే వ్యసనపరులుగా మారుతున్నారని వైద్యుల పరిశీలనలో తేలింది. పరిస్థితి చేయి దాటిన తర్వాత తల్లిదండ్రులు మేల్కొంటున్నారు. చివరికి పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలోని వ్యవసన విముక్తి కేంద్రానికి తీసుకొస్తున్నారు.

**బాధితుల్లో కనిపించే లక్షణాలు:**

నిద్ర సరిగా పట్టకపోవడం, చేతులు, కాళ్లు వణకడం, నిత్యం ఆందోళనగా ఉండడం, తరచూ భయ పడడం, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు ఊహించుకోడం, చిన్న విషయాలకే అసహనం, కోపం ప్రదర్శించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.




**70శాతం మందికి స్వస్థత:** మానసిక ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రానికి రోజుకు 5 మంది బాధితులు వస్తున్నారు. వైద్యులు వీరికి 3 వారాలపాటు చికిత్స అందిస్తున్నారు. బాధితుల్లో 70 శాతం మంది పూర్వపు స్థితికి వస్తున్నారు. నయమైన తర్వాత బయటకు వెళ్లిన వారిలో 30శాతం మంది తిరిగి మత్తుకు బానిసలవుతున్నారు. వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. వీరిని సాధారణస్థితికి తీసుకురావడం వైద్యులకు కత్తిమీద సాములా మారుతోంది. మళ్లీమళ్లీ మత్తుకు బానిసైన వారిని తీవ్ర ఆరోగ్య సమస్యలు వెంటాడతాయని మానసిక వైద్యులు చెబుతున్నారు.

**ఇవిగో ఉదాహరణలు..**

తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులు. ఆ బాలుడు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లకుండా చెడు స్నేహాలకు లోనయ్యాడు. సిగరెట్లు, మద్యం తాగడంతోపాటు మాదక ద్రవ్యాలకు బానిసయ్యాడు. పరిస్థితి తీవ్ర స్థాయికి చేరడంతో తల్లిదండ్రులు గుర్తించి మానసిక ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు.

బాలికకు 13ఏళ్లు. తండ్రి లేడు. తల్లి పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. ఆమె సరిగా స్కూల్‌కు వెళ్లకుండా యువకులతో స్నేహం చేసింది. వారితో సినిమాలకు వెళ్లడంతోపాటు సిగరెట్లు, మద్యం, గంజాయి, డ్రగ్స్ అలవాటు చేసుకుంది. చదువు మానేసి వ్యవసనాలకు బానిసగా మారి తల్లితో గొడవ పెట్టుకునేది. చివరికి తల్లి కుమార్తెను మానసిక ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం చేయిస్తోంది.

**తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తుండాలి**

ప్రధానంగా 18ఏళ్లలోపు పిల్లలు మద్యం, గంజాయి, సిగరెట్లు, వైట్నర్, మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడుతున్నారు. దీనికి కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడమే. 23ఏళ్లలోపు మత్తుపదార్థాలు తీసుకున్నవారు వ్యసనపరులుగా మారిపోతున్నారు. ఆ వయసు తర్వాత తీసుకున్నవారు బానిసలుగా మారడం లేదు. అందుకే పిల్లలకు 23ఏళు వచ్చే వరకు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.

డాక్టర్ ప్రసన్నకుమార్, మానసిక వైద్యులు

## నాదన్నది ఏదీ వదలను.. అందుకే ఐటీ రైడ్స్ జరిగాయి

యాంకర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన అనసూయ ఇప్పుడు యాంకరింగ్ కు గుడ్ బై చెప్పి ఓ వైపు టీవీ షో లకు జడ్జిగా, మరోవైపు సినిమాల్లో నటిస్తూ ఆడియన్స్ ను మెప్పిస్తూ ఉటుంది. రీసెంట్ గా అనసూయ యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా హోస్ట్ చేస్తున్న నిఖిల్ తో నాటకాలు పాడ్‌కాస్ట్‌కు హాజరై, పలు ఇంట్రెస్టింగ్ విషయాల గురించి మాట్లాడింది. ఆడ, మగ అంటే ఎట్రాక్షన్ ఉండటం నేచురల్. సినిమా వాళ్లపై జనం ఫోకస్ ఎక్కువగా ఉంటుందని చెప్పిన అనసూయ తనకు నైన్త్ క్లాస్ లోనే ప్రపోజల్స్ మొదలయ్యాయని, అప్పటినుంచే తప్పించుకోవడం అలవాటైందని చెప్పింది. సినిమా అంటే తనకెంతో ఇష్టమని చెప్పిన అనసూయ, తన టాలెంట్ ఏంటో? తానెంత వరకు చేయగలననేది తనకు తెలుసని, డైరెక్టర్లు, రైటర్లు చెప్పే కథకు సూటవనని అనిపిస్తే తనకు తానుగా తప్పుకున్న సిట్యుయేషన్స్ ఎన్నో ఉన్నాయని అనసూయ తెలిపింది. జబర్దస్త్ లో హైపర్ ఆదితో కలిసి చేసిన స్కిట్స్ చాలానే హైలైట్ అయ్యాయని, ఆడ, మగ సంబంధాలు, ఎదురింటి పెళ్ళాంపై వేసే జోకులు జబర్దస్త్ లో ఉంటాయి. ఆ షో కు హోస్ట్ గా చేసినందుకు గర్వంగా ఫీలవుతా అని చెప్పిన అనసూయ, అక్కడి జోకులకు అనసూయ నవ్వు నటిస్తుందని, స్క్రీన్ పై కనిపించే అనసూయ వేరు, బయట కనిపించే అనసూయ వేరని, కొన్ని సందర్భాల్లో జోకుల తీవ్రత ఎక్కువైనప్పుడు తాను స్పందించిన సందర్భాలు కూడా ఉన్నాయని, కానీ షో లో ఏమేం టెలికాస్ట్ చేయాలనేది ఎడిటింగ్ రూమ్ డిసైడ్ చేస్తుందని అనసూయ తెలిపింది. గతంలో ప్రతీ గురువారం సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాలి. ఏదొక ఫోటో షూట్ ను అప్ లోడ్ చేయాలనే ఒత్తిడి ఉండేది. ఫలానా బట్టలే వేసుకోవాలి. ఇది వేసుకోకూడదనే లాంటి ఒత్తిడిలను చాలానే తట్టుకున్నానని, నన్ను నన్నుగా ఇష్టపడే వారి కోసం షోలు, సినిమాలు,



డైలీ లైఫ్ లో జరిగే అంశాలను కచ్చితంగా షేర్ చేసుకుంటానని అనసూయ చెప్పింది. అనసూయకు ఇన్ని కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? 2 కోట్లు పెట్టి కారు కొనిందా అని అంటుంటారు. అలాంటి కారు కొన్నానంటే అది కేవలం నా ఒక్కదాని కష్టం కాదని, దాని వెనుక నా ఫ్యామిలీ కష్టం కూడా ఉందని అనసూయ చెప్పుకొచ్చింది. తనకెంత ఆస్తి ఉందనేది తానెప్పుడూ లెక్కలు వేసుకోలేదని, తనకు తెలిసిందల్లా హాలీడే ట్రిప్స్, ఎంజాయ్‌మెంట్స్ మాత్రమేనని అనసూయ పేర్కొంది. ఇప్పటికీ తనదొక మిడిల్ క్లాస్ హౌస్ వైఫ్ మెంటాలిటీనే అని, లైఫ్ తనకు నేర్పిన పాఠాలను చూసి ఇప్పటికీ పోపుల డబ్బాలో డబ్బులను దాచుకుంటానని చెప్పింది అనసూయ. ఆఫర్లు బాగా వచ్చి బాగానే సంపాదించానని చెప్పిన అనసూయకు జీఎస్టీ అనేది ఒకటుంటుందని తనకు తెలియదని, కొన్ని షో లకు ట్యాక్స్ కట్టకపోవడంతో పొరపాటు జరిగి తనపై ఐటీ రైడ్స్ జరిగాయని అనసూయ వెల్లడించింది. తాను, తన భర్త ఎంతో కష్టపడి నెలకు రూ. లక్షా పదహారు వేల ఈఎంఐ కడుతూ కొనుక్కున్న ఆడి కారును తనకెవరో ప్రొడ్యూసర్ గిఫ్ట్ గా ఇచ్చాడని ఎన్నో వార్తలొచ్చాయి. జీవితంలో పైకి రావడానికి కష్టపడతానని, నాది కానిదేదీ నాకొద్దని చెప్తున్న అనసూయ, నాదన్నది రూపాయి కూడా వదలనని చెప్తోంది. ఇక తనను ఆంటీ అనేవాళ్ల గురించి మాట్లాడుతూ తానే బట్టలేసుకుని తిరిగితే ఎవరికేం నష్టమేంటి అని ప్రశ్నించింది. పవన్ తో కలిసి వీరమల్లులో ఓ సాంగ్ లో నటించిన అనసూయ ఆయన ఎన్నో విషయాలకు నో, ఎన్నో విషయాలకు ఎస్ చెప్పబట్టే ఇవాళ ఈ స్థాయికి వచ్చారని, మెగా బ్రదర్స్ ముగ్గురూ స్వీట్ హార్ట్స్ అని వారందరితో కలిసి నటించే లక్ తనకు దక్కిందని అనసూయ తెలిపింది.

## బాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తున్న డ్రాగన్ బ్యూటీ..?

ఒక్క సినిమా హీరోయిన్ ఫేట్ మార్చేస్తుంది అని చాలా మంది కథానాయికల కెరీర్ లో ప్రూవ్ అయ్యింది. ఇప్పుడు అదే తరహాలో ఒక హీరోయిన్ ని ఓవర్ నైట్ స్టార్ ని చేసింది. అంతకుముందు నుంచి సినిమాలు చేస్తున్నా కూడా ఒక సినిమాలో అది కూడా ఆమె చేసిన సెకండ్ హీరోయిన్ రోల్ తో సూపర్ పాపులర్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే డ్రాగన్ బ్యూటీ కయదు లోహార్ అని తెలుస్తుంది. కోలీవుడ్ లో పలు సినిమాల్లో నటించిన అమ్మడు శ్రీవిష్ణు చేసిన అల్లూరి సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఐతే అప్పుడు అసలేమాత్రం జనాల దృష్టిలో పడని కయదు రీసెంట్ గా ప్రదీప్ రంగనాథ్ చేసిన డ్రాగన్ సినిమాతో అదరగొట్టేసింది. సినిమాలో ప్రదీప్ ఫస్ట్ హాఫ్ అనుపమని లవ్ చేస్తాడు సెకండ్ హాఫ్



లో కయదుతో పెళ్లికి రెడీ అవుతాడు. డ్రాగన్ సినిమాలో కయదు ఎంట్రీ మామూలుగానే అనిపించినా సినిమా నడుస్తున్నా కొద్దీ ఆమె నచ్చేస్తుంది. ఒకదశలో కయదుతో ప్రేమలో పడేలా చేస్తుంది. ఇక అమ్మడి గ్లామర్ షోకి కూడా కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. సో అలా కయదు లోహార్ డ్రాగన్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా రిలీజ్ తర్వాత ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా బీభత్సంగా పెరిగారు. మరోపక్క కయదు లోహార్ తెలుగులో విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది.

ఆ సినిమాతో అమ్మడు మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది. ఐతే సౌత్ ఆడియన్స్ ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తున్న ముంబై మేకర్స్ కయదు మీద ఉన్న ఈ బజ్ చూసి ఆమెని అక్కడ సినిమాల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ఓ విధంగా ఇది గొప్ప విషయమని చెప్పొచ్చు. డ్రాగన్ సినిమాతో కయదు నిజంగానే తన సత్తా చాటి అదరగొట్టే ఛాన్స్ లు అందుకుంటుంది. అమ్మడు ఇటు సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా ఛాన్స్ అందుకుంటే మాత్రం అక్కడ ఆడియన్స్ ని కూడా తన బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పొచ్చు. నిజంగానే కయదు బాలీవుడ్ షిఫ్ట్ అయితే మాత్రం అక్కడే టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ లు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.




## గోదావరి 2.. ఈ హింట్ ఇస్తే చాలు..!



టాలీవుడ్ లో ఉన్న సెన్సిబుల్ డైరెక్టర్స్ లో ఒకరైన శేఖర్ కమ్ముల తను తీసే ప్రతి సినిమాతో ఆడియన్స్ ని అలరిస్తూ ఉంటారు. ఆనంద్ తో మొదలైన శేఖర్ కమ్ముల దర్శకత్వ ప్రతిభ లవ్ స్టోరీ వరకు ఆడియన్స్ ని ఎంగేజ్ చేస్తూనే ఉంది. తను తీసే ప్రతి సినిమా ప్రత్యేకంగా ఉండాలని కోరుకునే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. అందుకే సినిమా సినిమాకు లేట్ అయినా ఆడియన్స్ అంచనాలకు తగిన సినిమాలే చేస్తుంటాడు. ఐతే శేఖర్ కమ్ముల కెరీర్ మొదట్లో గోదావరి అనే సినిమా చేశాడు. సుమంత్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సక్సెస్ అయ్యింది. ముఖ్యంగా ఆ సినిమాలో సాంగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 2006 లో వచ్చిన ఆ సినిమా ఇప్పటికీ ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఐతే రీసెంట్ గా సుమంత్ కూడా గోదావరి 2 చేయాలని ఫ్యాన్స్ అడుగుతున్నారని అందుకే శేఖర్ కమ్ములతో తాను టచ్ లో ఉంటానని చెప్పారు. నటుడిగా ఒక డైరెక్టర్ ని అవకాశాలు అడగడం లో తప్పులేదంటున్నారు సుమంత్. శేఖర్ కమ్ముల తో తనకు ఆల్రెడీ పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి తనని కలుస్తానని. ఇక రాజమౌళి గారి డైరెక్షన్ లో కూడా చేయాలని ఉందని అన్నారు సుమంత్. ఐతే శేఖర్ కమ్ముల తో సుమంత్ చేస్తే గోదావరి 2 చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు. చాలామంది ఆడియన్స్ కూడా గోదావరి 2 గురించి తనను అడుగుతారని.. అది శేఖర్ కమ్ముల చేతుల్లోనే ఉంది తను చేస్తానంటే నేను రెడీ అంటున్నారు సుమంత్. సో సుమంత్ ఈ హింట్ ఇచ్చారంటే తప్పకుండా టైం తీసుకున్నా కూడా గోదావరి 2 ఉండే అవకాశం ఉన్నట్టు కనిపిస్తుంది. ఐతే అక్కినేని ఫ్యామిలీ హీరో అయినా కూడా సపోర్టింగ్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి మొహమాటం లేదని అంటున్నారు సుమంత్. సార్, సీతారామం సినిమాల్లో పాత్రలు నచ్చి చేశానని అన్నారు సుమంత్. అనగనగా అనే సినిమా తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చారు సుమంత్. ఈటీవీ విన్ లో ఆ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. సుమంత్ శేఖర్ కమ్ముల కలిసి గోదావరి 2 సినిమా చేస్తే తప్పకుండా సంథింగ్ స్పెషల్ గా ఉంటుందని చెప్పొచ్చు. ప్రస్తుతం శేఖర్ కమ్ముల ధనుష్ తో కుబేర సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత నెక్స్ట్ ప్లాన్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది.

## 'మరణమాస్' టాక్: ఓటీటీ రెస్పాన్స్ ఎలా ఉంది?




ట్రైలర్ తోనే పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన మలయాళ సినిమా 'మరణమాస్'. ఇటీవల %ాు% సోనీ లివ్ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. శివ ప్రసాద్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ డార్క్ కామెడీ, కేరళలో ఒక నైట్ బస్సులో జరిగే అనూహ్య సంఘటనల చుట్టూ తిరుగుతుంది. బనానా కిల్లర్‌గా పిలిచే ఓ సీరియల్ కిల్లర్, స్థానిక ట్రబుల్‌మేకర్ లూక్ (బాసిల్ జోసెఫ్), అతని గర్ల్‌ఫ్రెండ్ జెస్సీ (అనిష్మ అనిల్‌కుమార్)తో సహా పలు పాత్రలు ఈ బస్సు ప్రయాణంలో చిక్కుకుంటాయి. సినిమా కథలో లూక్, ఓ వృద్ధుడి మరణంతో బస్సులో చిక్కుకుని, అనుమానిత కిల్లర్‌తో కలిసి ఈ రాత్రిని ఎలా గడుపుతాడనేది ఆసక్తికరంగా సాగుతుంది. బాసిల్ జోసెఫ్ తన డిఫరెంట్ పాత్రలో అద్భుతంగా నటించాడని, అతని కామెడీ టైమింగ్ సినిమాకు ప్లస్ అయ్యిందని ప్రేక్షకులు చెబుతున్నారు. అనిష్మ అనిల్‌కుమార్ కూడా జెస్సీగా తన వైబ్రంట్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. సిజు సన్నీ, రాజేష్ మాధవన్ పాత్రలు కూడా బాగున్నాయని, కానీ బాబు ఆంటోనీ పాత్రను మరింత బాగా ఉపయోగించుకోవచ్చని కొందరు అభిప్రాయపడ్డారు. ట్రైలర్‌లోనే హైలైట్ అయిన డార్క్ హ్యూమర్, సినిమాలో కూడా ప్రేక్షకులను నవ్వించింది. ఈ సినిమా సీరియస్‌గా కనిపించే అంశాలను కూడా కామికల్‌గా చూపించడం బాగుంది, ముఖ్యంగా బస్సు జర్నీలో మధ్య భాగం ఆసక్తికరంగా సాగింది అని నెటిజన్లు అంటున్నారు. నీరజ్ రెవి వైబ్రంట్ విజువల్స్, జెకె సంగీతం సినిమా క్విర్కీ టోన్‌కు సరిపోయాయని, కానీ సంగీతం లాంగ్ లాస్టింగ్ ఇంప్రెషన్ ఇవ్వలేదని కొందరు అభిప్రాయపడ్డారు. స్క్రీన్‌ప్లే కొన్ని చోట్ల నీరసంగా, డైలాగ్స్ సాగదీతగా ఉన్నాయని కొంతమంది విమర్శించారు. సినిమా మొదటి గంట కాస్త నెమ్మదిగా సాగినప్పటికీ, బస్సు జర్నీ మొదలైన తర్వాత కథలో వేగం, ఆసక్తి పెరిగాయని అంటున్నారు. లూక్–జెస్సీల రిలేషన్‌షిప్‌ను ఒకే రాత్రిలో సరిచేయడం కొంత ఒప్పించలేదని, ఎమోషనల్ డెప్త్ లోపించిందని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే, సీరియల్ కిల్లర్ ఎస్కే, కండక్టర్ కథ, స్మశానంలో జరిగే సన్నివేశాలు ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రేక్షకులు చెప్పారు. మొత్తంగా, 'మరణమాస్' ఒక టైమ్‌పాస్ డార్క్ కామెడీగా అందరినీ ఆకట్టుకుంది. మొదటి భాగం నెమ్మదిగా ఉన్నప్పటికీ, మధ్యలో డార్క్ హ్యూమర్, టెన్షన్‌తో సినిమా ఆసక్తికరంగా సాగుతుందని, అల్లరిగా సాగే డార్క్ కథలు ఇష్టపడే వారికి ఈ సినిమా నచ్చుతుందని పబ్లిక్ టాక్ నడుస్తోంది.

## 'ముత్యమల్లే' మెరిసిన జాన్వీ

వేకువ ఝామును మంచు పూలు మిలమిల మెరిసాయి. కానీ ఈ దృశ్యంలో జాన్వీ కపూర్ మంచి ముత్యమల్లే మెరుస్తోంది. మెరుపు లాంటి జాన్వీ కుర్రకారు గుండెల్లో భడభాగ్నిని రాజేస్తోంది. ఈ సుందరమైన దృశ్యం కేన్స్ 2025 ఉత్సవాల్లో కనిపించింది. మొట్టమొదటి సారి జాన్వీ కపూర్ కేన్స్ లో ఆరంగేట్రం చేసింది. కేన్స్ లో తాను నటించిన 'హోమ్ బౌండ్' స్క్రీనింగ్ లో ఈ అద్భుతమైన లుక్ తో కనిపించింది. జాన్వీ ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని దీనిని డిజైన్ చేసారు. ఈ లుక్ లో గ్రేస్ ఉంది. గ్లామర్ ని సాంప్రదాయ



బద్ధంగా ఎలివేట్ చేసే నైపుణ్యం కనిపించింది. ధడక్ తో ఆరంగేట్రం చేసిన జాన్వీ సహనటుడు ఇషాన్ ఖట్టర్ కూడా కేన్స్ 2025లో సందడి చేస్తుండడం విశేషం. అతడు విశాల్ జెత్వా కూడా జాన్వీతో పాటు కేన్స్ లో సందడి చేస్తూ కనిపించారు. ఈ ముగ్గురూ కేన్స్ 2025 లో 'హోమ్ బౌండ్' ప్రపంచ ప్రీమియర్ కోసం ఆత్రుతగా కనిపించారు. ఈ ఉత్సవాల్లో జాన్వీ కపూర్ గురూజీ, ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ కూడా ఉన్నారు. కరణ్ ధర్మ ప్రొడక్షన్స్ భాగస్వామి అయిన బిలియనీర్ అదర్ పూనవాలా భార్య నటాషా కూడా ఈ ఉత్సవాలలో సందడి చేసారు. జాన్వీతో సోదరి ఖుషీ కపూర్, ఆమె ప్రియుడు శిఖర్ పహారియా కూడా బృందంలో చేరారు. వారి స్నేహితుడు ఓర్హాన్ అవత్రమణి అలియాస్ ఓర్రీ కూడా సందడి చేయడం హాట్ టాపిగ్గా మారింది. నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హోమ్ బౌండ్ ప్రచారానికి మిత్రలు అంతా ఏకమవ్వడం విశేషం.

## ప్రభాస్ తో చేసినా లక్ కలిసి రాలేదు..!

మోడల్ గా రాణించి ఆ తర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కెరీర్ మొదట్లో అవమానాలు ఎదుర్కొని ఆ తర్వాత వరుస విజయాలతో అదరగొట్టింది అందాల భామ కృతి సనన్. మోడలింగ్ లో ఆమె రేంజ్ వేరు అనిపించుకున్న తర్వాత తెలుగులో సూపర్ స్టార్ మహేష్ తో 1 నేనొక్కడినే సినిమాతో ఆమె సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చింది. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు ఆ తర్వాత తెలుగులోనే నాగ చైతన్యతో దోచెయ్ సినిమా చేసింది కృతి సనన్. ఐతే అలా చిన్నగా బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంది. సినిమాలు వెబ్ సీరీస్ లు ఇలా హిందీ ఆడియన్స్ ని మెప్పిస్తూ వచ్చింది. ఐతే ఏమైందో ఏమో కానీ సడెన్ గా అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోయింది. బాలీవుడ్ లో ఆమెకు ఉన్న క్రేజ్ ని చూసే రెబల్ స్టార్ చేసిన ఆదిపురుష్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అందులో సీత పాత్రలో కృతి సనన్ ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ సినిమా కూడా డిజాస్టర్ అవ్వడం వల్ల కృతి సనన్ మరింత ఇబ్బందుల్లో పడింది. ఆదిపురుష్ తర్వాత మరో రెండు సినిమాలు చేసినా



లాభం లేకుండా పోయింది ఐతే లాస్ట్ ఇయర్ వచ్చిన క్రూ సినిమాతో కాస్త బెటర్ అనిపించుకుంది కృతి సనన్. ప్రస్తుతం అమ్మడు తెరె ఇష్క్ మైన్ సినిమాలో నటిస్తుంది. ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాతో మరోసారి బాలీవుడ్ లో తన స్టామినా ప్రూవ్ చేసుకోవాలని చూస్తుంది కృతి సనన్. ఈ సినిమా టీజర్ తోనే ఆడియన్స్ కి షాక్ ఇచ్చేలా చేశారు మేకర్స్. కృతి సనన్ తో పాటు ఈ సినిమా ధనుష్ కి కూడా సంథింగ్ స్పెషల్ గా ఉంటుందని అనిపిస్తుంది. కృతి సనన్ మాత్రం ఈ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది. తప్పకుండా అమ్మడు తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఐతే ప్రభాస్ కృతి సనన్ జోడీ బాగుంది వాళ్లు చేసిన ఆదిపురుష్ ని పక్కన పెట్టి మళ్లీ ప్రభాస్ తో ఒక యాక్షన్ సినిమాలో కృతి సనన్ ని హీరోయిన్ గా ఫిక్స్ చేస్తే బాగుంటుందని ఆడియన్స్ అంటున్నారు. అలా జరిగితే మళ్లీ సౌత్ లో అదే ముఖ్యంగా తెలుగులో కృతి సనన్ కి మళ్లీ మంచి క్రేజ్ కొనసాగే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536